

'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 215

గురువారం 27-10-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఐర్లాండ్ సంచలనం

టీ20 ప్రపంచకప్‌లో డక్‌వర్త్ లూయిస్ విధానంలో ఇంగ్లండ్‌పై గెలుపు - 12లో



ఎఫ్‌డీ రేట్ల పెంపు

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పీఎన్‌బీ - 13లో



కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన ఖర్గే

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లికార్జున ఖర్గే బాధ్యతలు స్వీకరించారు. నేటితో తన బరువు దిగిపోయిందంటూ సోనియాగాంధీ అందరినీ ఆశ్చర్యపరిచారు.

వివరాలు 6లో



తొలిరోజే విమర్శల జడివాన

బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌కు విమర్శలు ఎదురయ్యాయి. డేటా ఉల్లంఘన తప్పిదాలపై గతంలో రాజీనామా చేసిన సుయెల్లాను మళ్లీ నియమించడాన్ని ప్రతిపక్షం తప్పుబట్టింది.

వివరాలు 6లో

జోరుగా ఇళ్ల నిర్మాణం

వర్షాలు తగ్గుముఖం.. అందుబాటులో ఇసుక, సిమెంట్, ఐరన్.. ముమ్మరంగా పనులు

- లే అవుట్‌లలో మౌలిక వసతుల కల్పన.. విద్యుత్, తాగునీరు, రోడ్లకు ప్రాధాన్యం
- లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు తోడు పావలా వడ్డీకే రూ.35 వేల రుణం
- వెరసి కొత్తగా రూపుదిద్దుకుంటున్న వేలాది ఊళ్లు, కాలనీలు
- ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉన్నతస్థాయి సమీక్ష
- 2022–23లో గృహ నిర్మాణాల కోసం రూ.5,005 కోట్ల ఖర్చు
- ఇప్పటికే 40,576 టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అప్పగింత
- డిసెంబర్ నాటికి మరో 1,10,672, మార్చి నాటికి ఇంకో 1,10,968 ఇళ్లు పంపిణీ
- విశాఖలోని ఇళ్ల నిర్మాణాలపైనా ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం





సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేదలు తమ సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు నిర్మాణ పనుల్లో వేగం పెంచారు. వాస్తవానికి ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో నిర్మాణ పనుల్లో కొంత జాప్యం జరిగింది. కొద్ది రోజులుగా వర్షాలకు తెరపివ్వడంతో పనులు మళ్లీ ఊపందుకున్నాయి. నిర్మాణం మధ్యలో ఆపేసిన వారు తిరిగి పనులు మొదలు పెట్టారు. రాష్ట్రంలో 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలను అందజేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం.. ఆ స్థలాల్లో వారికి రెండు దశల్లో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ఇళ్లు కట్టించి ఇస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆహ్లాదకర వాతావరణంలో సరికొత్తగా కాలనీలు, ఊర్లు రూపుదిద్దుకుంటున్నాయి. ఆయా లేఅవుట్లలో గృహాలను నిర్మించుకునేందుకు అవసరమైన మెటీరియల్‌ను అధికారులు ఇప్పటికే అందుబాటులో ఉంచారు. చాలా కాలనీలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. మరికొన్ని కాలనీల్లో ఈ పని ముమ్మరమైంది. అంతర్గత రోడ్లు నిర్మించి, నీటి వసతికి ఇబ్బంది లేకుండా బోర్లు వేశారు. దీంతో లబ్ధిదారులు ఉత్సాహంగా గృహాలను నిర్మించుకోవడంలో బిజీ అయ్యారు. గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేసిన కొద్ది రోజులకే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నారు. దీంతో గృహ నిర్మాణాల్లో వేగం పెరుగుతోంది. ఆయా లే అవుట్లలో లబ్ధిదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం

మిగతా 3వ పేజీలో ▶

'కృష్ణపట్నం'లో మరో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

- నేడు మూడవ యూనిట్‌ను ప్రారంభించనున్న సీఎం
- దేశంలోనే మొదటి సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్
- సాధారణ ప్లాంట్లతో పోలిస్తే తక్కువ బొగ్గు వినియోగం
- పర్యావరణంపై తక్కువ ప్రతికూల ప్రభావం

- వివరాలు 14లో

కలిసికట్టుగా క్లీన్ స్వీప్

- టెక్కలి కార్యకర్తలతో భేటీలో సీఎం జగన్ దిశానిర్దేశం
- సగర్వంగా తలెత్తుకునేలా మన పరిపాలన.. 87% కుటుంబాలకు సంక్షేమ పథకాలతో మంచి చేశాం
- 175 చోట్లా గెలుపు కచ్చితంగా సాధ్యమే
- టెక్కలి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్

2లో

టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు ఎర?

నలుగురు శాసనసభ్యుల కొనుగోలుకు బేరసారాలు

- గువ్వల బాలరాజు, పైలెట్ రోహిత్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రేగా కాంతారావుపై వల
- రంగారెడ్డి జిల్లా అజీజ్‌నగర్‌లోని పీవీఆర్ ఫామ్ హౌజ్‌లో మంతనాలు
- భారీ నగదు, కాంట్రాక్టులు, పదవులు ఇస్తామని ఎర వేసినట్టు ఆరోపణలు
- రామచంద్రభారతి, నందకుమార్, సింహయాజులు అరెస్ట్
- రూ.15 కోట్లు పట్టుకున్నట్లు ప్రచారం
- ఎమ్మెల్యేల సమాచారం మేరకే దాడి చేశామన్న సైబరాబాద్ సీపీ
- ఇది బీజేపీ పన్నాగమన్న టీఆర్‌ఎస్
- ఆ హార్డ్‌కోర్ టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో ఏం చేసుకుంటామన్న కిషన్‌రెడ్డి

10లో



టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, రేగా కాంతారావు, పైలెట్ రోహిత్‌రెడ్డి



సింహయాజులు



రామచంద్ర భారతి



నందకుమార్



రామాయపట్నం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు

- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రామాయపట్నం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. జాతీయ రహదారిని ఆనుకొని చేవూరు వద్ద దీన్ని నిర్మించనుంది. దగదర్తి కంటే రామాయపట్నం ఎయిర్‌పోర్టు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు అనువుగా ఉంటుందని చెబుతున్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక బాధ్యతను ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు ఏపీఏడీసీఎల్ ఎండీ భరత్‌రెడ్డి తెలిపారు.

- వివరాలు 10లో

ఏం సెప్తిరి.. ఏం సెప్తిరి!



80 శాతానికి పైగా పూర్తయిన ఉద్దానం భారీ మంచినీటి ప్రాజెక్టు నిర్మాణం

- కిడ్నీ రోగుల బాగోగులు పట్టించుకున్నదెవరు?
- ముఖ్యమంత్రి వైఎస్ జగనా.. లేక చంద్రబాబా?
- రామోజీ.. మీరే వెళ్లి బాధితులను అడిగితే వాస్తవం తెలుస్తుంది
- పాదయాత్రలో వాళ్ల కష్టాలు చూసి చలించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రూ.700 కోట్లతో భారీ రక్షిత మంచినీటి ప్రాజెక్టు నిర్మాణం
- రూ.50 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం
- డయాలసిస్ చేయించుకుంటున్న వారి పింఛన్ ఏకంగా రూ.10 వేలకు పెంపు
- కిడ్నీ రోగుల కోసం ఉద్దానంలో ఒక్కసారి కూడా పర్యటించని చంద్రబాబు
- ఆయన హయాంలో డయాలసిస్ రోగులకు పింఛన్ రూ.2,500 మాత్రమే

2లో

ఇదంజగత్



...ఆ ఛాన్స్ వాళ్లకిచ్చేదే లేదు!

బీసీ సీఎంలకూ సాధ్యం కాలేదు

- సీఎం జగన్ పాలనలో సామాజిక న్యాయం.. బలహీన వర్గాలకు అన్ని విధాలా తోడ్పాటు
- ప్రతి పనిలోనూ బీసీల శ్రమ, కృషి దాగుంది.. వైఎస్సార్‌సీపీని 175 స్థానాల్లోనూ గెలిపిస్తాం
- తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ సమావేశం.. త్వరలో అన్ని జిల్లాల్లో నిర్వహణకు సన్నద్ధం

3లో



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య. చిత్రంలో మంత్రులు, సీనియర్ నాయకులు

క్లుప్తంగా

నేవీ డేకి రాష్ట్రపతి

- తొలిసారి విశాఖకు ద్రౌపది ముర్ము



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నంలో డిసెంబర్ 4వ తేదీ జరగనున్న నౌకాదళ దినోత్సవాల్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నారు. పాకిస్తాన్‌పై విజయానికి ప్రతీకగా ఏటా డిసెంబర్ 4వ తేదీన నేవీ డే ఉత్సవాల్ని తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం విశాఖపట్నంలో నిర్వహిస్తుంటారు. భారత నౌకాదళ పరాక్రమాన్ని చాటిచెప్పే ఈ ఉత్సవాలను ప్రారంభించేందుకు రాష్ట్రపతి 3వ తేదీ సాయంత్రం ప్రత్యేక విమానంలో ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. ఆరోజు ఈఎన్‌సీ ప్రధాన కేంద్రంలో బసచేస్తారు. 4వ తేదీ ఉదయం తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు ఆర్కే బీచ్‌లో నిర్వహించే నౌకాదళ విన్యాసాల్ని తిలకిస్తారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారి విశాఖపట్నంలో పర్యటించనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

మ్యుటేషన్లకు మార్గదర్శకాలు

- పాటించాలని రెవెన్యూ అధికారులకు సీసీఎల్ఏ ఆదేశాలు

సాక్షి, అమరావతి: ఆస్తిపై యాజమాన్య హక్కును ఒకరి నుంచి మరొకరికి బదిలీ చేసి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసేటప్పుడు (మ్యుటేషన్) కచ్చితంగా మార్గదర్శకాలు పాటించాలని ప్రభుత్వం రెవెన్యూ యంత్రాంగానికి స్పష్టం చేసింది. దీనిపై భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) సాయిప్రసాద్ ఇటీవల ఒక సర్క్యులర్ జారీచేశారు. మ్యుటేషన్లు చేసేటప్పుడు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు 1971 ఏపీ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్స్ యాక్ట్‌లోని సెక్షన్ 5(3), 1989 ఏపీ రైట్స్ ఇన్ ల్యాండ్ రూల్స్‌లోని రూల్ 18ని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. మ్యుటేషన్ కోసం దరఖాస్తు వచ్చినప్పుడు ఆన్‌లైన్‌లో జారీ చేసే ఫామ్–8 నోటీసును ఆ భూమితో సంబంధం ఉన్న వ్యక్తులందరికీ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఆ భూమికి సంబంధించి రికార్డుల్లో పేర్లు నమోదైన వారు, దాంతో సంబంధం ఉన్న వ్యక్తులు, దానిపై ఆసక్తిగల వ్యక్తులందరికీ నోటీసులు ఇచ్చి విచారించాలని సూచించారు. తహశీల్దార్లు, ఆర్డీవోలు ఈ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. తమకు సంబంధం ఉన్న భూమికి మ్యుటేషన్ చేసినప్పుడు నిబంధనల ప్రకారం తమకు నోటీసులు ఇవ్వలేదని కొందరు బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మార్గదర్శకాలు పాటించేలా చూడాలని కోర్టు ప్రభుత్వాన్ని కోరడంతో సీసీఎల్ఏ ఈ ఆదేశాలు జారీచేశారు.

నేడు హోంమంత్రుల చింతన్ శిబిర్

- హాజరుకానున్న రాష్ట్ర మంత్రి వనిత

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రాల హోంమంత్రుల చింతన్ శిబిర్‌ను హరియాణలోని సూరజ్ కుండ్‌లో గురువారం నుంచి రెండురోజులు నిర్వహించనున్నారు. పోలీసు బలగాల ఆధునికీకరణ, సైబర్‌నేరాలు అరికట్టడం, నేరవ్యవస్థలో పెరిగిన ఐటీ వినియోగం, భూ సరిహద్దుల నిర్వహణ, తీరప్రాంతాల భద్రత, మహిళా భద్రత, మాదకద్రవ్యాల అక్రమ రవాణా తదితర అంశాలపై చర్చించే ఈ శిబిర్ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు ఏపీ హోంమంత్రి తానేటి వనిత బుధవారం ఢిల్లీ చేరుకున్నారు. ఆమెతోపాటు ఏపీ హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి కూడా ఈ శిబిర్‌లో పాల్గొంటారు. ఈ చింతన్ శిబిర్‌ను ఉద్దేశించి శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించనున్నారు.

ఏపీ గృహ నిర్మాణ సంస్థ ఎండీ బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఏపీ గృహ నిర్మాణ సంస్థ ఎండీగా జి.లక్ష్మిశ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ఈ శాఖకు ఎండీగా పనిచేసిన భరత్ గుప్తా, ప్రస్తుత ఎండీ లక్ష్మిశ, జేఎండీ శివప్రసాద్ విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఆ శాఖ మంత్రి జోగి రమేశ్‌ను కలిసి ఏపీలో ఇళ్ల నిర్మాణ పురోగతిని వివరించారు.

28న విశాఖలో కేంద్ర ఆర్థిక మంత్రి పర్యటన

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 28న విశాఖలో పర్యటించనున్నారు. ఆమె కాకినాడ నుంచి రోడ్డు మార్గంలో 28న మధ్యాహ్నం విశాఖకు చేరుకుంటారు. సాయంత్రం గీతం యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించే సదస్సుకు హాజరవుతారు. ఎన్టీఆర్ స్మారక ఉపన్యాసం, పలు బీజేపీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. 29న హైదరాబాద్ బయలుదేరి వెళతారు.

31న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ నెల 31న విశాఖకు రానున్నారు. ఆయన నవంబర్ 1న ఏపీ అవతరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 2న ఏయూలో బాలయోగి ఎండోమెంట్ లెక్చర్ కార్యక్రమంలో ప్రసంగిస్తారు. 3న కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్ట్‌కు చేరుకుంటారు.

కలిసికట్టుగా క్లీన్ స్వీప్

టెక్కలి కార్యకర్తలతో భేటీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశా నిర్దేశం





టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: గతానికి పూర్తి భిన్నంగా అవినీతి లేకుండా, పక్షపాతం చూపకుండా 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా మేలు చేశాం. మంచి జరిగిన కుటుంబాల వారు మనల్ని ఆశీర్వదిస్తున్నారు. వికేంద్రీకరణ ద్వారా సుపరిపాలన అందిస్తున్నాం. ఆర్బీకేలను తెచ్చి రైతన్నలు గ్రామం దాటాల్సిన అవసరం లేకుండానే ప్రతి ఒక్కటీ అందచేస్తున్నాం. ఇంటి వద్దే సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నాం. గ్రామ సచివాలయాలు, విలేజ్ క్లినిక్స్, ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, నాడు–నేడుతో కార్పొరేట్‌కు దీటుగా తయారైన ప్రభుత్వ పాఠశాలలతో పల్లెల ముఖచిత్రం సంపూర్ణంగా మారుతోంది. డిసెంబర్ నాటికి మిగతా పనులు కూడా పూర్తవుతాయి. ఇవన్నీ రావటంతో గ్రామాల రూపురేఖలు మారి సరికొత్త చిత్రం ఆవిష్కృతమవుతోంది. చేసిన మంచి కళ్లెదుటే కనిపిస్తోంది. వాటిని చూసి మనమే అధికారంలో ఉండాలని ప్రతి చోటా ప్రజలు కోరుకుంటున్నారు. అలాంటప్పుడు 175 స్థానాల్లోనూ క్లీన్ స్వీప్ కచ్చితంగా సాధ్యమే. మనం చేయాల్సిందల్లా ప్రజల్లోకి వెళ్లి చేసిన మంచిని వివరించాలి. రేపు ఎన్నికల్లో గెలిచాక వచ్చే 30 ఏళ్లూ మనమే అధికారంలో ఉంటాం' అని టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలనుద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మీరూ, నేనూ కలిసికట్టుగా అడుగులు వేసి క్లీన్ స్వీప్ చేద్దామని దిశానిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో టెక్కలి నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్ పోటీ చేస్తారని, ఆయన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని రావాలని పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సీఎం జగన్ సమావేశమయ్యారు. ప్రతి కార్యకర్తతోనూ విడివిడిగా మాట్లాడి వారి యోగక్షేమాలను ఆరా తీశారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం టెక్కలి అభివృద్ధి కోసం చేసిన పనులను సీఎం జగన్ గణాంకాలతో సహా వివరించారు. టెక్కలి నియోజకవర్గంలో భావనపాడు పోర్టు రానుందని, అందుకోసం సుమారు రూ.4,362 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. డిసెంబర్‌లో భావనపాడు పోర్టుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులను డిసెంబరులో పునరుద్ధరిస్తామన్నారు.

- మరో 18 నెలల్లో రానున్న ఎన్నికలకు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది. చాలా కాలం ఉంది కదా.. ఇవాళ్టి నుంచే ఎన్నికల గురించి ఆలోచన చేయాలా? అని మీరు అనుకోవచ్చు. 18 నెలల తర్వాత ఎన్నికలున్నా ఆ అడుగులు ఇవాళ్టి నుంచి కరెక్ట్‌గా పడితేనే క్లీన్‌స్వీప్ చేయగలుగుతాం.
- ఒక్క టెక్కలి నియోజకవర్గంలోనే మూడేళ్ల నాలుగు నెలల వ్యవధిలో అక్షరాలా రూ.1,026 కోట్లను గడప గడపకూ చేర్చగలిగాం. ఎవరెవరికి ఇచ్చామో వివరాలతో సహా, అక్కచెల్లెమ్మల పేర్లతో సహా చెప్పగలిగేలా ప్రతి పథకాన్ని పారదర్శకంగా అమలు చేశాం. అర్హులెవరూ మిస్ కాకుండా, సంతృప్తస్థాయిలో వలంటీర్లు, సచివాలయం ద్వారా వీటిని చేర్చాం. ప్రతి నియోజకవర్గం, గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుంటే ప్రతి గ్రామంలోనూ 87 శాతం ఇళ్లకు మంచిచేశాం.
- ప్రతి నియోజకవర్గంలోనూ, ప్రతి గ్రామంలోనూ ప్రతి గడపకూ వెళ్లాలి. మనం చేసిన మంచిని గుర్తు చేసి వారి ఆశీర్వాదాన్ని తీసుకోవాలి.
- టెక్కలి నియోజకవర్గంలో సర్పంచ్ ఎన్నికల్లో 136కు 119 పంచాయతీలు, ఎంపీటీసీలు 78కి 74, ఎంపీపీలు, జడ్పీటీసీలు మొత్తం నాలుగు మనమే గెలిచాం. ఒక్క టెక్కలిలోనే కాదు.. కుప్పంలో కూడా ఇలాగే మంచి విజయాలు నమోదుచేశాం. మనం తెచ్చిన మార్పు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.
- మనలో మనకు ఎన్ని విభేదాలున్నా పక్కనపెట్టి బిగ్గర్ పిక్చర్ గుర్తు తెచ్చుకుందాం. అందరం కలిసికట్టుగా ఒక్కటవుదాం.

> ■ ఈ రోజు మన గ్రామంలోనే ఇంగ్లీషు మీడియం స్కూళ్లు, గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్ కనిపిస్తున్నాయి. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరు కనిపిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఉగాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలవుతుంది.

> ■ మూడున్నరేళ్లుగా ప్రజలకు చేస్తున్న మంచిని వివరించడానికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టాం. గతానికి భిన్నంగా పరిపాలన కొనసాగుతోంది. మంచి చేశామని సగర్వంగా తలెత్తుకునేలా మన పరిపాలన జరుగుతోంది.

ఏం సెప్తిరి.. ఏం సెప్తిరి!



పలాసలో 70శాతం పనులు పూర్తయిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/సాక్షి, అమరావతి / అరసవల్లి: రాష్ట్రంలో మూడేళ్ల క్రితం వరకు కిడ్నీ రోగుల పరిస్థితి ఏమిటని ఎవరైనా సరే స్వయంగా వెళ్లి బాధితులనే అడిగితే వాస్తవమేమిటో తెలుస్తుంది. కిడ్నీ బాధితుల కష్టాలను తన పాదయాత్రలో స్వయంగా చూసిన, విన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అధికారంలోకి రాగానే విప్లవాత్మక చర్యలతో వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు శ్రీకారం చుట్టారు. ఓ వైపు వారికి అత్యాధునిక వైద్యం అందేలా చర్యలు తీసుకుంటూనే, మరో వైపు వారికి పింఛన్ పెంపు ద్వారా ఆర్థికంగా దన్నుగా నిలిచారు. ఇంకో వైపు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా మంచి నీటి సరఫరా జరిగేలా అడుగులు ముందుకు వేశారు. వాస్తవం ఇలా ఉంటే ఈనాడు పత్రిక అధినేత రామోజీరావుకు మాత్రం మరో కనిపిస్తోంది.

మాటల్లో కాదు.. చేతల్లోనే

- 1980 దశకం నుంచి శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతం ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యకు అసలు కారణం ఏమిటన్నది ఇంత వరకు స్పష్టంగా నిర్ధారణ కానప్పటికీ.. అక్కడి తాగునీరే కారణం కావొచ్చేమోనన్న నిపుణుల అనుమానాల మేరకు 2019 సెప్టెంబరు 6వ తేదీన వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ ప్రాంతానికి శాశ్వత రక్షిత మంచి నీటి పథకాన్ని మంజూరు చేసింది.
- పలాస, ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని రెండు మున్సిపాలిటీలతో పాటు 807 నివాసిత గ్రామాలకు ఉపయోగపడేలా ఈ పథకాన్ని రూపొందించింది. ఏడాది పొడవునా సురక్షిత నదీ జలాలను పైపులైన్ ద్వారా అందించేలా డిజైన్ చేశారు.
- ఉద్దానానికి సమీపంలో ఉండే బహుదా, మహేంద్ర తనయ నదుల నుంచి రక్షిత నీటి సరఫరాకు అవకాశం ఉన్నా, అవి వేసవిలో ఎండిపోతే ఇబ్బంది ఉంటుందని భావించి, దాదాపు వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న హిరమండలం రిజర్వాయర్ నుంచి భూ గర్భ పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. దాని ద్వారా నీటిని తరలించి మెళియాపుట్టి మండల కేంద్రం వద్ద ఆ నీటిని ఇసుక ఫిల్టర్ల ద్వారా శుద్ధి చేస్తారు.
- హిరమండలం రిజర్వాయర్‌లో ఏటా 19.5 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుంది. అందులో 1.12 టీఎంసీల నీటిని ఉద్దానం ప్రాంత ప్రజల కోసం ప్రభుత్వం కేటాయించింది. శుద్ధి చేసిన నీటిని ఉద్దానం ప్రాంతంలో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేస్తోన్న రక్షిత మంచి నీటి ఓవర్‌హెడ్ ట్యాంకులకు తరలిస్తారు. అక్కడి నుంచి ఆ ప్రాంతంలో ప్రతి ఇంటికి ఈ నీటిని అందిస్తారు. ఇప్పటికే 80 శాతం పనులను ప్రభుత్వం పూర్తి చేసింది. 2023 మార్చి నాటికి పనులు పూర్తవుతాయి. రోజుకు 84 మిలియన్ లీటర్ల తాగు నీటిని సరఫరా చేసేందుకు వీలుగా మెళియాపుట్టి ప్రాంతంలో నీటి ఫిల్టర్ బెడ్‌లు నిర్మిస్తున్నారు. కనీసం 30 ఏళ్ల పాటు సరఫరా చేసేలా వివిధ గ్రామాల్లో మొత్తం 571 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నారు.
- 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ తర్వాత ఐదేళ్ల వరకు హడావుడి తప్ప చేసిందేమీ లేదు.

వైఎస్ జగన్ చర్యలు ఇలా..

- ప్రతిపక్షనేత హోదాలో కవిటి మండలం జగతిలో కిడ్నీ బాధితుల భరోసా యాత్ర పేరిట వైఎస్ జగన్ పర్యటించారు. బాధితులతో ముఖాముఖి మాట్లాడారు. అధికారంలోకి వస్తే నెలకు రూ.10 వేల పింఛన్ ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఈ సమస్యపై నిపుణులతో చర్చించారు.
- చంద్రబాబు ఇస్తున్న రూ.2,500 పింఛన్‌ను జగన్ అధికారంలోకి రాగానే వ్యాధి తీవ్రతను బట్టి రూ.10 వేలు, రూ.5 వేలు చేశారు. రూ.700 కోట్లతో భారీ రక్షిత మంచి నీటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి, 80 శాతానికి పైగా పూర్తి చేశారు. డయాలసిస్ కేంద్రాల్లో పడకల సంఖ్యను 62 నుంచి 90కి పెంచారు. ఇద్దరు నెఫ్రాలజిస్టులను నియమించారు. రూ.50 కోట్లతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి నిర్మిస్తున్నారు. 70 శాతం పూర్తయింది.
- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 37 రకాల మందులను నెఫ్రాలజిస్టులు సూచిస్తుంటారు. ఈ క్రమంలో ఉద్దానం ప్రాంతంలోని పీహెచ్‌సీ నుంచి ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో 25 రకాల మందులను ఏపీఎంఎస్ఐడీసీ సరఫరా చేస్తోంది. మరో 12 రకాల మందులను స్థానిక అవసరాలకు అనుగుణంగా అక్కడికక్కడే కొనుగోలు చేసుకోవడానికి వైద్య శాఖ అనుమతులు ఇచ్చింది.
- వ్యాధి లక్షణాలు కన్పిస్తే వెంటనే సామాజిక ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందే అవకాశం కల్పించారు. అక్కడ అవసరమైన మేరకు ఫిజీషియన్లను నియమించారు. డయాలసిస్ రోగులకు ఎత్రోపాయిటన్ ఇంజక్షన్ క్రమం తప్పకుండా ఉచితంగా ఇస్తున్నారు. పలాస సీహెచ్‌సీలో నెఫ్రాలజిస్టును నియమించారు. వారానికి ఒకసారి తనిఖీలు నిర్వహిస్తున్నారు.

బతుకుతాననుకోలేదు..



నాలుగేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ లక్షల రూపాయలు ప్రైవేటు ఆస్పత్రికే ధారబోశాను. అప్పట్లో కనీసం ఒక్క డాక్టర్ గానీ, మందులు ఇచ్చేవారు గానీ మా గ్రామానికి వచ్చేవారు కాదు. రెండున్నరేళ్ల నుంచి రూ.10 వేలు పింఛన్ వస్తోంది. నన్ను డయాలసిస్ కేంద్రానికి తీసుకువెళ్లడానికి 108 బండి వస్తోంది. నేను ఇప్పటి వరకు బతుకుతానని అసలు అనుకోలేదు. అంతా జగనన్న దయే.

– సుగ్గు లక్ష్మి, సన్యాసిపుట్టుగ, ఇచ్ఛాపురం మండలం, శ్రీకాకుళం జిల్లా

రూ.10 వేలు పింఛన్ అందుకుంటున్నాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.10 వేలు పింఛను ఇస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో డయాలసిస్ చేసుకోవడానికి స్థానికంగా బెడ్స్ లేక ఇబ్బంది పడేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చాక ఆర్థిక సమస్యలు నుంచి గట్టెక్కాం. డయాలసిస్ కూడా సకాలంలో చేసుకుంటున్నాం.

– మర్రిపాటి తులసీదాస్, పెద్దశ్రీరాంపురం, కంచిలి మండలం, శ్రీకాకుళం జిల్లా

ఈనాడు కథనం అవాస్తవం



శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం ప్రాంత మండలాల్లో కిడ్నీ రోగులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అద్భుత సేవలందుతున్నాయి. ఈ విషయాన్ని విస్మరించి 'ఉద్దానాన్ని ఏం ఉద్ధరించారు..?' అంటూ ఈనాడు తప్పుడు కథనం ప్రచురించడం దారుణం. జిల్లాలో 35 వేల మంది క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సికెడి) తో బాధపడుతున్నారని, ఇందులో 4,500 మంది చనిపోయారని రాశారు. డయాలసిస్ సెంటర్లు సరిపడా లేవని, నెఫ్రాలజిస్టులే లేరన్నారు. వాస్తవంగా జిల్లాలో 2,27,099 మందికి స్క్రీనింగ్ చేస్తే 19,379 మంది కిడ్నీ రోగులుగా తేలింది. ఇందులో 1,118 మంది వివిధ కారణాలతో చనిపోయారు. ఉద్దాన మండలాల్లోనే 28 డయాలసిస్ యూనిట్లను కొత్తగా ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఒకటి, హరిపురం సీహెచ్‌సీలో 10, పలాస సీహెచ్‌సీలో 04, సోంపేటలో 08, కవిటిలో 05 చొప్పున యూనిట్లు ఏర్పాటు చేశారు. ఇద్దరు నెఫ్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పని చేస్తున్నారు. పీహెచ్‌సీల్లోనే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. 10 ఎనలైజర్లను కొనుగోలు చేశారు. అన్ని రకాల మందులు అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ మీనాక్షి, డీఎంహెచ్‌వో

విశాఖకు వెన్నుపోటే టీడీపీ, ఈనాడు విధానం

- విశాఖ పరిపాలన రాజధాని ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష
- దాని నుంచి పక్కదోవ పట్టించడమే టీడీపీ, ఈనాడు లక్ష్యం
- ఉద్దానం కిడ్నీ బాధితులకు అండగా సీఎం జగన్
- టీడీపీ, ఈనాడు కుట్రలను ప్రజలు అడ్డుకోవాలి.. ఉద్దానం ప్రజలకు చంద్రబాబు చేసింది శూన్యం
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి: పరిపాలన రాజధాని కాకుండా విశాఖకు వెన్నుపోటు పొడవటమే టీడీపీ, ఈనాడు విధానమని, అందులో భాగంగానే ఉత్తరాంధ్రపై విషపు రాతలు రాస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందకూడదన్నది వారి ప్రధాన ఉద్దేశమని బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు. విశాఖ పరిపాలన రాజధాని కావాలన్నది ఉత్తరాంధ్ర ఆకాంక్ష అని, దాని నుంచి ప్రజల దృష్టిని పక్కదోవ పట్టించడానికే ఈ విధమైన రాతలు రాస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే ఉత్తరాంధ్రలోని ఉద్దానంపై అబద్ధాలు అచ్చేశారని మండిపడ్డారు. ఉద్దానం కిడ్నీ బాధితులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా అండగా నిలిచారని చెప్పారు. కిడ్నీ వ్యాధి సమస్య శాశ్వత పరిష్కారానికి వేగంగా చర్యలు చేపడుతున్నారన్నారు. కిడ్నీ వ్యాధి బాధితులకు చంద్రబాబు హయాం లోకంటే మెరుగైన పింఛన్లు, ఆధునిక వైద్యం, రక్షిత నీటి పథకాలు కళ్లెదుట కనిపిస్తున్నా, ఏమీ జరగడంలేదన్న భ్రాంతి కలిగించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఉద్దానంలోని ఏడు మండలాల ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటినందించడానికి రూ.700 కోట్లతో నిర్మిస్తున్న రక్షిత మంచి నీటి ప్రాజెక్టు, పలాసలో రూ.50 కోట్లతో 200 పడకల కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నామని చెప్పారు. శరవేగంగా జరుగుతున్న ఈ రెండు ప్రాజెక్టుల పనులు వారికి కనిపించడంలేదా అని ప్రశ్నించారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న ఆర్వో ప్లాంట్లు, 142 ఆటోమేటెడ్ వాటర్ డిస్పెన్సరీలు కనిపించడం లేదా అని నిలదీశారు. రక్షిత నీటి ప్రాజెక్టు పనులు 80 శాతం, ఆస్పత్రి పనులు 70 శాతం పూర్తయ్యాయని, ఈ రెండూ వచ్చే ఏడాది మార్చికి అందుబాటులోకి వస్తాయని చెప్పారు. వ్యాధిగ్రస్తులను ఆదుకోవడానికి నెల నెలా డాక్టర్ వైఎస్సార్ పెన్షన్ కానుక అందిస్తున్నట్లు తెలిపారు. డయాలసిస్ చేయించుకుంటున్న వారికి నెలకు రూ.10 వేలు, మూడు, నాలుగు దశల వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.5 వేలు చొప్పున పింఛను ఇస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో తూతూమంత్రంగా ఇచ్చేవారన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక వ్యాధికి గురైన అందరికీ పింఛను ఇస్తున్నట్లు తెలిపారు. అసత్య కథనాలు, ప్రచారాలతో విశాఖకు వెన్నుపోటు పొడుస్తున్న టీడీపీ, ఈనాడు కుట్రలను ప్రజలు అడ్డుకోవాలని, ఎక్కడికక్కడ నిలదీయాలని మంత్రి పిలుపునిచ్చారు.

అమరావతి పాదయాత్ర ముగిసినట్టే

నరసరావుపేట: అమరావతి పాదయాత్ర ముగిసినట్టే అని మంత్రి రజిని చెప్పారు. బుధవారం ఆమె ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. పాదయాత్రలో 60 మంది రైతుల వద్దే ఐడీ కార్డులు ఉన్నాయన్నారు. పాదయాత్రలో ఉన్న వారంతా టీడీపీ కార్యకర్తలేననే విషయం తేలిపోయిందన్నారు.

బాబు బాగోగులే రామోజీకి ముఖ్యం

ఈనాడు, రామోజీరావుకు ప్రజల బాగోగులు ముఖ్యం కాదని, టీడీపీ అధినేత చంద్రబాబు బాగోగుల కోసం ఆరాటపడుతున్నారని మంత్రి ధ్వజమెత్తారు. ఉద్దానంపై విషపు రాతలు రాశారని మండిపడ్డారు. ఉద్దానం కిడ్నీ సమస్య 75 ఏళ్లుగా ఉందన్నారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు ఉద్దానానికి ఏం చేశారని రామోజీరావు ప్రశ్నించారా అని నిలదీశారు. చంద్రబాబు సీఎంగా ఉండగా ఉద్దానం ప్రజలకు ఏం చేశారో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంటే బీసీలు ఉన్నారని తెలిపారు.

ఉద్దానంపై ప్రేమ కాదు.. ఉత్తరాంధ్రపై ఏడుపు

- ఈనాడు, టీడీపీపై మంత్రి అప్పలరాజు మండిపాటు
- విశాఖ పరిపాలన రాజధాని నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే అసత్య కథనాలు
- ఉత్తరాంధ్రకు అన్యాయమంటూ ఈనాడు రాస్తున్నదంతా విష ప్రచారమే
- అందులో భాగమే ఉద్దానంపైనా అసత్య కథనం



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ, ఈనాడు రామోజీరావుకు ఉద్దానంపై ప్రేమ లేదని, విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందేమోనన్న ఏడుపు మాత్రమే వారిలో కనిపిస్తోందని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. విశాఖ పరిపాలన రాజధాని నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే అసత్య కథనాలు ప్రచురిస్తున్నారని తెలిపారు. ఉత్తరాంధ్రకు అన్యాయమంటూ ఈనాడు రాస్తున్నదంతా విష ప్రచారమేనని అన్నారు. అందులో భాగంగానే ఉద్దానంపైనా అసత్య కథనం రాశారని మండిపడ్డారు. మంత్రి అప్పలరాజు బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఉద్దానంపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. ఇక్కడ రక్షిత మంచినీటి ప్రాజెక్టు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నారని, పలు చోట్ల డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేశారని చెప్పారు. కిడ్నీ వ్యాధి వ్యాపించకుండా చర్యలు చేపట్టారన్నారు. ఇవన్నీ కళ్లెదుట కనిపిస్తున్నా, అసలక్కడ ఏ కార్యక్రమమూ జరగడంలేదన్నట్లుగా ప్రజలను నమ్మించేందుకు అబద్ధపు రాతలు రాస్తున్నారని అన్నారు. అసలు చంద్రబాబు హయాంలో ఉద్దానం ప్రజలను కబళిస్తున్న కిడ్నీ వ్యాధి నివారణకు ఏమి చర్యలు చేపట్టారో చెప్పాలని అన్నారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు ఉద్దానం కోసం ఒక్కటైనా చేశారా? దీనికి రామోజీరావు సమాధానం చెప్పగలరా? అని ప్రశ్నించారు. ఉద్దానంపై వాస్తవాలు వక్రీకరించి అంతులేని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు దగ్గర ఈనాడు రామోజీరావు ఎంత ప్యాకేజీ తీసుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉద్యానవనంలా ఉద్దానం

ఘన చరిత్ర ఉన్న ఉద్దానం టీడీపీ ప్రభుత్వ హయాంలో అధ్వానంగా మారిందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఉద్దానంపై ప్రత్యేక దృష్టి పెట్టారని, కిడ్నీ జబ్బులు నయం చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. తుపాన్ వల్ల కుదేలైన ఉద్దానానికి ప్రత్యేక పరిహారం అందించారన్నారు. అక్కడ పంపిణీ చేసిన జీడి, కొబ్బరి చెట్లతో ఉద్దానం ఉద్యానవనంగా మారుతోందని అన్నారు. వైఎస్ జగన్ 2017లో కవిటి సభలో చెప్పిన విధంగా తమ ప్రభుత్వం రాగానే అక్కడ రీసెర్చ్ సెంటర్, ప్రత్యేకంగా కిడ్నీ ఆస్పత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు ఉద్దానం కోసం చేసిన దీర్ఘకాలిక ప్రయోజనాలు ఒక్కటీ లేవన్నారు. ఉద్దానంలో రీసెర్చ్ సంస్థ ఏర్పాటు చేస్తానని చెప్పిన చంద్రబాబు ఒక్క ఇటుక కూడా పేర్చలేదన్నారు. కేజీహెచ్ సెంటర్‌గా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పని చేస్తుందన్నారని, అదీ జరగలేదని చెప్పారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రత్యేకంగా స్పెషలైజ్డ్ నెఫ్రాలజీ యూనిట్ ఏర్పాటు చేశారని చెప్పారు. అందుకే చికిత్సలో, మందుల సరఫరాలో ఎక్కడా లోపం జరగడంలేదని చెప్పారు. అయినా, ప్రజలను పక్కదోవ పట్టించేలా కథనాలు ప్రచురిస్తున్న ఈనాడును, టీడీపీని ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని మంత్రి చెప్పారు.

ఇనుప ఖనిజ రవాణాలో గంగవరం పోర్టు రికార్డు

పెదగంట్యాడ(గాజువాక): అదానీ గంగవరం పోర్టు ఇనుప ఖనిజ రవాణాలో మరో మైలురాయిని సాధించింది. ఎంవీ లైలానాస్‌టాంగ్ నౌక గంగవరం పోర్టు నుంచి మహారాష్ట్రలోని జైగఢ్ పోర్టుకు 1.6 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని రవాణా చేసింది. అలాగే అతి తక్కువ సమయంలోనే 56.077 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని నౌకలో లోడ్ చేసింది. గంగవరం పోర్టు ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ పోర్టులోని సదుపాయాలు, సామర్థ్యాన్ని ఈ రికార్డు మరోసారి అందరికీ తెలియజేసిందన్నారు. అత్యంత సమర్థవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ.. పారిశ్రామికవేత్తలకు గణనీయమైన ఆర్థిక ప్రయోజనాలను అందిస్తున్నామని పోర్టు ప్రతినిధులు చెప్పారు.

క్లుప్తంగా

భద్రాద్రి భూములపై బీజేపీ రాజకీయం సిగ్గుచేటు
డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: భద్రాచలం శ్రీరామ చంద్రుడి ఆలయానికి ఆంధ్రప్రదేశ్‌లో గల భూముల విషయాన్ని రాజకీయం చేసేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ప్రయత్నించడం సిగ్గు చేటని డిప్యూటీ సీఎం (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో బుధవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆ భూముల పరిరక్షణకు ఇప్పటికే ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. భూముల ఆక్రమణల విషయమై అల్లూరి సీతారామరాజు కలెక్టర్ సుమీత్‌తో తాను మాట్లాడానని.. ఒక ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ ఆ భూముల్లో అక్రమంగా భవనాలు నిర్మించినట్టు చెప్పారని మంత్రి వెల్లడించారు. తక్షణం అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చామన్నారు. ఈ విషయాలేవీ తెలుసుకోకుండా బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు అవగాహన లోపంతో సీఎంకు లేఖ రాయడం ఆయన అవివేకాన్ని తేటతెల్లం చేసిందన్నారు.

ఏపీలోని భద్రాద్రి ఆలయ భూములను రక్షించండి..
సీఎం జగన్‌కు సోము వీర్రాజు లేఖ



సాక్షి, అమరావతి/అనంతపురం టవర్‌క్లాక్: తెలంగాణలోని భద్రాద్రి శ్రీరాముడి ఆలయానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉన్న భూముల పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు బుధవారం సీఎం జగన్‌కు లేఖ రాశారు. అల్లూరి మన్యం జిల్లా, పాడేరు పరిధిలో భద్రాద్రి ఆలయ భూములున్నాయని.. ఆ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే బీజేపీ మద్దతిస్తుందని అనంతపురంలో మీడియాతో స్పష్టం చేశారు. రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి బీజేపీ మద్దతుతో రాఘవేంద్ర బరిలో నిలుస్తున్నారని ప్రకటించారు.

విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేయాలి
కశింకోట మండల పరిషత్ సమావేశం తీర్మానం

కశింకోట: విశాఖ కేంద్రంగా పరిపాలనా రాజధానిని ఏర్పాటు చేయాలని కోరుతూ అనకాపల్లి జిల్లా కశింకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ కలగా లక్ష్మి సమావేశానికి అధ్యక్షత వహించారు. విశాఖను పరిపాలనా రాజధానిగా ఏర్పాటు చేయాలని కోరుతూ వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి ప్రతిపాదన చేశారు. దానిని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించి, తీర్మానించారు.

వచ్చే ఏడాది ఏప్రిల్ 14న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ
మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ వచ్చే ఏడాది ఏప్రిల్ 14న ఆవిష్కరిస్తారని మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. రూ.100కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.225 కోట్లకు చేరిందన్నారు. ప్రాజెక్టు పనులను మంత్రి బుధవారం పరిశీలించారు.

ఉత్తరాంధ్రవాసులు రాజధాని కోరుకోవడం లేదు: యనమల

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర ప్రజలు కార్యనిర్వాహక రాజధానిని కోరుకోవడం లేదని టీడీపీ నేత యనమల రామకృష్ణుడు తెలిపారు. అందుకే ప్రాంతాల మధ్య విద్వేషాలు, వైషమ్యాలు రెచ్చగొడుతున్నారని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు.

బీసీ సీఎంలకూ సాధ్యం కాలేదు

తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ సమావేశం

సాక్షి, అమరావతి: కుల వృత్తులతో తరతరాలుగా సమాజానికి సేవలందిస్తున్న బీసీ సామాజిక వర్గాలకు దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆర్థిక తోడ్పాటుతోపాటు రాజకీయంగా ఉన్నత అవకాశాలు కల్పిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని బీసీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతి పనిలోనూ బీసీల శ్రమ, కృషి దాగుందన్నారు. బీసీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న కృషిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. బీసీలే ముఖ్యమంత్రులుగా ఉన్న ఇతర రాష్ట్రాల్లోనూ బలహీన వర్గాలకు ఇంత సంక్షేమం సాధ్యం కాలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని 175 స్థానాల్లోనూ గెలిపించి సీఎం జగన్ రుణం తీర్చుకుంటామని, మరో 30 ఏళ్లు ఆయనే సీఎంగా ఉంటారని స్పష్టం చేశారు. బుధవారం తాడేపల్లిలోని సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి అధ్యక్షతన బీసీ ప్రజాప్రతినిధుల సమావేశం జరిగింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి దీనికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం బీసీ నేతలు మాట్లాడారు. త్వరలో 26 జిల్లాల్లోనూ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

సామాజిక న్యాయానికి పెద్దపీట:
బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి

సామాజిక న్యాయానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. 137 కార్పొరేషన్లకు సంబంధించి 484 పదవులు ఇస్తే 243 బీసీలకే ఇచ్చాం. బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు, శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు చేశాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. మూడున్నరేళ్లలో డీబీటీ ద్వారా వారికి దాదాపు రూ.2 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూర్చాం.

పోరాడే బాధ్యత మాదే:
జోగి రమేశ్, గృహ నిర్మాణశాఖ మంత్రి

బీసీల హక్కుల కోసం పోరాడే బాధ్యతను వైఎస్సార్ సీపీ స్వీకరించింది. బీసీ సామాజిక వర్గాలన్నింటిని ఏకం చేసి వారి ప్రయోజనాలను కాపాడగలిగేది ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమే. కలసికట్టుగా పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చి సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటాం.

అండగా నిలుద్దాం:
సీదిరి అప్పలరాజు, పశుసంవర్థక శాఖ మంత్రి

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకి కుల అహంకారం ఉంది. బీసీలు న్యాయమూర్తులుగా పనికి రారని గతంలో కేంద్రానికి లేఖలు రాశారు. మత్స్యకారులను తోకలు కత్తిరిస్తానని బెదిరించారు. ఎస్సీల కుటుంబంలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని కుల అహంకారంతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో బీసీ హాస్టళ్లు ఎలా ఉన్నాయో అందరికీ తెలుసు. అధికారం కోల్పోయాక రాష్ట్రానికి పరిశ్రమలు వస్తుంటే అడ్డుకోవాలని చూశారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాకే సామాజిక న్యాయం సాకారమైంది.



సమావేశంలో బీసీ ప్రజా ప్రతినిధులు

ఆయనకు అంతా అండగా నిలవాలి.

బాబు నైజాన్ని ఎండగట్టాలి: ఉషశ్రీ చరణ్, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి

బీసీలను ఎంతో ఆదుకుంటున్న సంక్షేమ పథకాలను ఆపాలంటున్న చంద్రబాబు నైజాన్ని ప్రజల్లో ఎండగట్టాలి. అనంతపురం అంటే బీసీల జిల్లా. వారంతా సీఎం జగన్ వెంటే నడుస్తున్నారు. గతంలో ఎప్పుడూ, ఎవరూ చేయనన్ని సంక్షేమ పథకాలను సీఎం జగన్ ప్రవేశపెట్టి అన్ని కులాలకు అండగా నిలిచారు. బీసీలకు చేయాల్సిందంతా చేసినా ఇంకా ఏం చేయగలమా? అని తపిస్తుంటారు.

బీసీలను బెదిరించిన చంద్రబాబు:
పోతుల సునీత, ఎమ్మెల్సీ

బీసీల తోకలు కత్తిరిస్తానంటూ చంద్రబాబు గతంలో బెదిరించారు. సీఎం జగన్ నా బీసీ సోదరులు, అక్క చెల్లెమ్మలంటూ ఆప్యాయంగా పిలుస్తారు. ఆయనకు మనపై ఉన్న ప్రేమకు అదే నిదర్శనం. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి, ఎంపీలు మోపిదేవి వెంకట రమణ, డాక్టర్ సంజీవ్‌కుమార్, తలారి రంగయ్య, బెల్లాన చంద్రశేఖర్, గోరంట్ల మాధవ్, మార్గాని భరత్, డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, హనుమంతరావు, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, దాడి వీరభద్రరావు, వైఎస్సార్‌సీపీ మహిళా నేత కిల్లి కృపారాణి పాల్గొన్నారు.

సమానంగా ఎదిగేలా తోడ్పాటు

ఇతర సామాజిక వర్గాలతో సమానంగా బీసీలు అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. టీడీపీ ఐదేళ్లలో బీసీలకు విదిల్చింది కేవలం రూ.19,369 కోట్లు మాత్రమే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు దాదాపు రూ.2 లక్షల కోట్ల మేర పారదర్శకంగా లబ్ధి చేకూర్చింది.

– గుమ్మనూరు జయరాం, కార్మిక శాఖ మంత్రి

ఇతర రాష్ట్రాల్లోనూ చర్చ

బీసీలను అక్కున చేర్చుకుని ఆదరించిన నేత సీఎం జగన్. డెహ్రాడూన్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్‌లో జరిగిన స్పీకర్ల సమావేశాల్లో ఈ అంశాలు చర్చకు వచ్చాయి. బీసీల కోసం ఇన్ని పథకాలను ఎలా అమలు చేయగలుగుతున్నారని ఇతర రాష్ట్రాల వారు నావద్ద ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దేశంలో ఒక ట్రెండ్ సెట్ చేసిన సీఎం జగన్‌కు మనమంతా ఎప్పుడూ అండగా ఉండాలి. ఆయన కృషితో భవిష్యత్తు తరతరాలు బాగుంటాయి. సీఎం జగన్‌కి వ్యతిరేకంగా ఎవరు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా బీసీల పొత్తు మాత్రం సీఎం జగన్‌తోనే.

– తమ్మినేని సీతారాం, శాసన సభాపతి

బీసీ సీఎంలకు సైతం సాధ్యం కాలేదు

బీసీల జీవితాల్లో వెలుగులు నింపే పథకాలను సీఎం జగన్ తెచ్చారు. దేశంలో బీసీ ముఖ్యమంత్రులు సైతం బీసీల సంక్షేమం కోసం ఇన్ని పనులు చేయలేదు. 56 కార్పొరేషన్లు తెచ్చి అందరికీ గుర్తింపు కల్పించారు. బీసీల కోసం సీఎం జగన్ చేస్తున్న కార్యక్రమాలపై ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. సీఎం జగన్ వల్ల దేశ వ్యాప్తంగా బీసీలకు న్యాయం జరుగుతుంది. పార్లమెంట్‌లోనూ ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టారు. ప్రతి జిల్లాలోనూ సమావేశాలు నిర్వహించి సీఎం జగన్ చేసిన మేలును ప్రతి బీసీ కుటుంబానికి వివరిస్తాం. 2024లో తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపించి సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేస్తాం. త్వరలోనే ప్రతి జిల్లాలో బీసీల సమావేశాలు జరుగుతాయి.

– ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ

జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు!

బీసీల హక్కుల కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం: విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో వైఎస్సార్‌సీపీ అలుపులేని పోరాటం చేస్తోందని పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్, పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి తెలిపారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ రాజ్యసభలో తాము ఇప్పటికే ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. బీసీల హక్కుల కోసం పార్లమెంట్‌లో పోరాడే బాధ్యతను వైఎస్సార్‌సీపీ తీసుకుందన్నారు. బీసీ సామాజిక వర్గాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి వారి ప్రయోజనాలను కాపాడే వైఎస్సార్ సీపీని 2024 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి తెచ్చి వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లిలోని సీఎస్సార్ కళ్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ బీసీ ఆత్మీయ సమావేశం అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రవ్యాప్తంగా బీసీ సదస్సులు

బీసీ సామాజిక వర్గాల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తూ మూడున్నరేళ్లుగా చేస్తున్న కృషిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకే బీసీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశాం. అందులో భాగంగా 225 మంది బీసీ ప్రజా ప్రతినిధులతో జరిగిన సమావేశాన్ని కోర్ కమిటీ భేటీగా పరిగణిస్తున్నాం. సీఎం జగన్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో బీసీ నాయకులందరిని కూడగట్టి పది రోజుల్లో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తాం. అనంతరం 26 జిల్లాల్లో బీసీసదస్సులు జరుగుతాయి.

నేరుగా రూ.2 లక్షల కోట్లు..

టీడీపీ హయాంలో ఐదేళ్లలో బీసీల కోసం రూ.19,369 కోట్లు ఖర్చు చేయగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడున్నరేళ్లలో నేరుగా నగదు బదిలీ ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు దాదాపు రూ.2 లక్షల కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేసింది.

కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల దాకా..

సామాజిక న్యాయానికి సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారు. మొత్తం 137 కార్పొరేషన్లకు సంబంధించి 484 పదవులు కేటాయించగా 243 బీసీలకే దక్కాయి. బీసీలకు 56 కార్పొరేషన్లు, శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 1.3 లక్షల శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తే అందులో 83 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకే దక్కాయి. సచివాలయాల్లో 2.7 లక్షల వలంటీర్ ఉద్యోగాలతో పాటు మిగతావి కూడా కలిపి 6.03 లక్షల ఉద్యోగాలను సృష్టించగా 70 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే ఇచ్చాం. రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు కలిపి మొత్తం 2,61,571 ఉద్యోగాలను బీసీలకే ఇచ్చాం.

మహిళా సాధికారత..

మంత్రిమండలిలో 70% బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే సీఎం జగన్ చోటు కల్పించారు. మంత్రివర్గం నుంచి నామినేటెడ్ పోస్టులు, స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు.. ఇలా అన్నింటిలోనూ రిజర్వేషన్లు కల్పించారు. డిప్యూటీ సీఎం పదవులు ఐదుగురికి ఇస్తే 80% బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే దక్కాయి. స్పీకర్, మండలి చైర్మన్, డిప్యూటీ చైర్‌పర్సన్, పదవుల్లో బీసీలు, ఎస్సీలకే అవకాశం కల్పించాం. మండలి డిప్యూటీ చైర్మన్‌గా మైనార్టీ మహిళను నియమించడం రాష్ట్ర చరిత్రలోనే ప్రథమం. నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు 50% రిజర్వేషన్లను సీఎం జగన్ కల్పించారు. ఇదే రీతిలో చట్టసభల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని ప్రధాని అధ్యక్షతన జరిగిన ప్రతి అఖిలపక్ష సమావేశంలోనూ వైఎస్సార్‌సీపీ తరపున డిమాండ్ చేశాం. పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లు కూడా ప్రవేశపెట్టాం.

బాబు దృష్టిలో బానిస క్లాస్...

బీసీలను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బానిస క్లాస్‌గా పరిగణిస్తారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు నాయీ బ్రాహ్మణులు తమ సమస్యలు చెప్పుకునేందుకు సచివాలయానికి వస్తే తోకలు కత్తిరిస్తానని బెదిరించి అవమానించారు. బీసీలు న్యాయమూర్తులుగా ఉండటానికి వీల్లేదంటూ 2017 మార్చి 21న కేంద్రానికి లేఖ రాసిన దుర్మార్గుడు చంద్రబాబే.

మంగళగిరి టౌన్‌షిప్‌లో ప్లాట్లకు ఈ-వేలం



- సులభ వాయిదాల్లో చెల్లింపు
- ప్రభుత్వ ఉద్యోగులకు ధరలో 20 శాతం రాయితీ

సాక్షి, అమరావతి: మధ్య ఆదాయ వర్గాలకు అనువుగా మంగళగిరిలో అభివృద్ధి చేసిన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లోని ప్లాట్లను ఈ-వేలం వేయనున్నట్టు ఏపీ సీఆర్డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి సులభ వాయిదాల్లో నగదు చెల్లించే సౌలభ్యం కల్పించినట్టు పేర్కొన్నారు. ఎంఐజీ లే అవుట్-2లో మొత్తం 267 ప్లాట్లు ఉన్నాయని, వీటిలో 200 చదరపు గజాల్లో 68, 240 చదరపు గజాల్లో 199 ఉన్నాయన్నారు. చదరపు గజం ధర రూ.17,499గా నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో నివసిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు లే-అవుట్‌లోని 10 శాతం ప్లాట్లు రిజర్వు చేయడంతో పాటు 20 శాతం రాయితీ కల్పించామని, విశ్రాంత ఉద్యోగులకు 5 శాతం ప్లాట్లను రిజర్వు చేసినట్టు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ప్లాట్ ధరలో 10 శాతం మొత్తం చెల్లించి ప్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. అందిన దరఖాస్తులకు ఈ-లాటరీ నిర్వహిస్తామని, అందులో ఎంపికైనవారు ప్లాట్ కేటాయించిన నెలలోపు ఒప్పందం చేసుకుని ధరలో 30 శాతం సొమ్ము చెల్లించాలన్నారు. అనంతరం 6 నెలల్లో మరో 30 శాతం మొత్తం, ఏడాదిలోపు మిగిలిన 30 శాతం మొత్తం ధర చెల్లించవచ్చన్నారు. ప్లాట్‌కు మొత్తం ధర చెల్లించిన అనంతరం రిజిస్ట్రేషన్ చేయనున్నట్టు ప్రకటించారు.


40 శాతం మినహాయింపు

ఎంఐజీలో ప్లాట్లు కొనుగోలు చేసే వారికి ప్రభుత్వం నికర అమ్మకపు ధరలో 60 శాతం మీద మాత్రమే రిజిస్ట్రేషన్ చార్జీలు ఉంటాయని, మిగిలిన 40 శాతంపై రిజిస్ట్రేషన్ చార్జీలను మినహాయింపు ఇచ్చిందని వివేక్ యాదవ్ తెలిపారు. ప్లాట్ పొందిన వారు ధర మొత్తం ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తున్నట్టు వివరించారు. అన్నిరకాల ప్రభుత్వ అనుమతులు ఉన్న ఈ ప్లాట్లకు సమీపంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్లాట్లు పొందాలనుకునే వారు పది శాతం ప్రారంభ ధర చెల్లించి నవంబర్ 19వ తేదీ లోగా https://migapdtcp.ap.gov.in లేదా https://crda.ap.gov.in వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 0866-2527124 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ శాఖలో రూ.4,925 కోట్ల ఆదా

వ్యవసాయానికి 30 ఏళ్లపాటు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు కృషి చేసిన ఏకైక సీఎం జగన్: మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, అమరావతి: విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేయటం, సాంకేతికంగా వాణిజ్య నష్టాలను తగ్గించడం వంటి మూడు అంశాలపై విద్యుత్ సంస్థలు ప్రధానంగా దృష్టి సారించాయని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై ఇంధన శాఖ అధికారులతో మంత్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. వినియోగదారులకు చౌకగా విద్యుత్ అందించే చర్యల్లో భాగంగా విద్యుత్ సంస్థలు బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేయడం, ఇతర సాంకేతిక, యాజమాన్య విధానాల ద్వారా దాదాపు రూ.4,925 కోట్లను మూడేళ్లలో ఆదా చేసినట్లు మంత్రి వెల్లడించారు. మరోవైపు ప్రసార, పంపిణీ నష్టాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టడంతో 2018-19లో 3.10 శాతం ఉన్న విద్యుత్ ప్రసార నష్టాలు 2022-23లో 2.83 శాతానికి (మే-22 వరకు) తగ్గాయన్నారు.



వ్యవసాయానికి ఉచిత విద్యుత్..

వ్యవసాయ రంగానికి వచ్చే 30 ఏళ్లపాటు పగటిపూట 9 గంటలపాటు ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు చొరవ తీసుకున్న ఏకైక సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారని పెద్దిరెడ్డి చెప్పారు. కేవలం రైతులకోసమే సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని, దశలవారీగా 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయనుందన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడంతోపాటు పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కృష్ణపట్నం యూనిట్ 3 (స్టేజ్ 2) నిర్మాణంలో భాగస్వాములైన ఏపీ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ఇంధన శాఖ అధికారులను మంత్రి అభినందించారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, ఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి, జెన్‌కో డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

20 మంది బంగ్లా జాలర్లను రక్షించిన భారత కోస్టుగార్డు

నడిసంద్రం నుంచి తీరం చేర్చిన వైనం

భువనేశ్వర్: నడి సముద్రంలో చిక్కుకున్న 20 మంది బంగ్లాదేశ్ మత్స్యకారులను భారతీయ కోస్టుగార్డు యంత్రాంగం సురక్షితంగా తీరం చేర్చింది. మత్స్యకారుల పడవలు మంగళవారం సిత్రాంగ్ తుపాను బీభత్సంతో భారత్-బంగ్లాదేశ్ అంతర్జాతీయ సముద్రమార్గం సరిహద్దు రేఖ ఐఎంబీఎల్ సాగర్ ద్వీపం పరిసరాల్లో మునిగిపోయాయి. స్వదేశానికి సమాచారం అందించేందుకు అవకాశం లేకపోవడంతో వీరంతా అందుబాటులో ఉన్న సామగ్రి సాయంతో దిక్కుతోచక నీటిలో తేలియాడుతున్నారు. తుపాను అనంతరం తీరప్రాంత పరిశీలనకు వెళ్లిన కోస్టుగార్డు సిబ్బంది వీరిని గుర్తించారు. విజయ ఓడను రప్పించి మత్స్యకారులను ఎక్కించి సురక్షితంగా తీరానికి చేర్చారు. భారతీయ కోస్టుగార్డు, బంగ్లాదేశీ కోస్టుగార్డు ఒప్పందం మేరకు తీరం చేర్చిన మత్స్యకారులను స్వదేశానికి అప్పగించే కార్యాచరణ చేపట్టారు. మలేషియా పోర్టు కియాంగ్ నుంచి కోల్‌కతా వైపు దూసుకెళ్తున్న మంత భూమ్ ఓడను గుర్తించిన కోస్టుగార్డు సిబ్బంది దాన్ని దారిమళ్లించారు.

మూడు రాజధానులు ఏర్పాటు చేసి తీరుతాం

- అన్ని ప్రాంతాల అభివృద్ధే సీఎం జగన్ సంకల్పం
- రాష్ట్ర ప్రజలంతా ఇదే కోరుకుంటున్నారు
- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పమని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. ఇందుకోసం మూడు రాజధానులు ఏర్పాటు చేసి తీరుతామని స్పష్టం చేశారు. బుధవారం కృష్ణా జిల్లా గుడివాడలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి ప్రాంతం, అక్కడి ప్రజలు బాగుండాలని, వారితో పాటు ఇతర ప్రాంతాలు కూడా బాగుండాలని కోరుకుంటారన్నారు. అందులో భాగంగానే అందరి అభిప్రాయం మేరకు సీఎం జగన్ పరిపాలన వికేంద్రీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. రాజధాని ముసుగులో భూములిచ్చిన 29 గ్రామాల రైతులు, అక్కడ భూములు కొన్న పెట్టుబడిదారులు వారి భూములకు విపరీతమైన ధరలు వస్తాయని చంద్రబాబు గ్రాఫిక్స్ మాయలో పడ్డారని తెలిపారు. వారి ప్రాంతంలోనే అన్నీ ఉంటే హైదరాబాద్‌లా వెంటనే అభివృద్ధి చెంది ఎకరా ధర రూ. 25 నుండి రూ. 30 కోట్లకు పెరుగుతుందని భ్రమ పడ్డారన్నారు. వారి ఆస్తుల ధరలు పెంచుకోవడానికి ఆరాట పడుతున్నారని చెప్పారు. పాలనా రాజధాని విశాఖపట్నం వెళితే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందా, హైకోర్టు వెళితే కర్నూలు అభివృద్ధి చెందుతుందా అని టీడీపీ నాయకులు కొందరు అంటున్నారని, ఫలితం రాని వీటిని తరలించడానికి ఎందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నారో అర్థం కావడంలేదని అన్నారు. వారికే ఈ విషయంపై స్పష్టత లేదన్నారు. అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలని ఆంధ్ర ప్రాంత ప్రజలు కూడా కోరుకుంటున్నారని చెప్పారు. కృష్ణా గుంటూరు జిల్లాల్లోని 33 అసెంబ్లీ స్థానాల్లో నాలుగింట్లో మాత్రమే టీడీపీ గెలిచిందన్నారు. దీనినిబట్టి ఈ ప్రాంతవాసులు కూడా అభివృద్ధికి అడ్డుపడటం లేదని, కేవలం ఆ 29 గ్రామాల్లో భూములు కొన్న వారి ఆరాటమే ఈ పోరాటమని అన్నారు. ఎవరు ఎన్ని ధర్నాలు చేసినా, టీవీలు, పేపర్లలో ఎన్ని తప్పుడు వార్తలు రాసినా మూడు రాజధానులు ఏర్పాటు చేసి తీరుతామని నాని స్పష్టంచేశారు.

జోరుగా ఇళ్ల నిర్మాణం

▶ మొదటి పేజీ తరువాయి

మౌలిక వసతుల పనుల్లో వేగం పెంచింది. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షలకు తోడు లబ్ధిదారులైన మహిళలకు రూ.35 వేల చొప్పున పావలా వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తోంది. నిర్మాణాల్లో వేగం పెరగడానికి ఇది బాగా దోహదం చేస్తోంది.

అందుబాటులో మెటీరియల్

గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, స్టీల్, సిమెంట్‌ను ఎప్పటికప్పుడు అవసరాల నిమిత్తం లబ్ధిదారులకు అందించేందుకు అన్ని జిల్లాల్లో అధికారులు సిద్ధంగా ఉంచారు. ఆయా ప్రాంతాల్లోని గోడౌన్లకు స్టీల్, సిమెంట్‌ను ఇప్పటికే చేరవేశారు. అన్ని జిల్లాల్లోని జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగు నీరు, డ్రెయినేజీల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. లేఅవుట్లలో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఉచితంగానే చేస్తున్నారు. నిర్మాణం పూర్తయిన వెంటనే ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు. వీధుల్లో స్తంభాలు, వైర్లు, ఇళ్లకు విద్యుత్ బోర్డులు, వైర్లు, మీటరు ఉచితంగా ఇస్తున్నారు. ఒక్కో కనెక్షన్‌కు దాదాపు రూ.6 వేల వరకు వ్యయం అవుతుండగా మొత్తం ప్రభుత్వమే భరిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకున్న వారికి కూడా ఉచితంగానే విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు. దీంతో వేలాదిగా కొత్త ఊర్లు, కాలనీలు రూపుదిద్దుకుంటున్నాయి.

నిర్మాణాల్లో మరింత వేగం పెరగాలి

నిరుపేదలు, దిగువ మధ్య తరగతి ప్రజల కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గినందున నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. గృహ నిర్మాణం, టిడ్కో ఇళ్ల ప్రగతిపై బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల్లో ఇప్పటి దాకా చేపట్టిన గృహ నిర్మాణాల పురోగతిని అధికారులు సీఎంకు వివరించారు. టిడ్కో ఇళ్లలో ఇప్పటికే 40,576 యూనిట్లను లబ్ధిదారులకు అప్పగించామని చెప్పారు. దీనిపై సీఎం మాట్లాడుతూ.. డిసెంబర్ కల్లా 1,10,672 ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించాలని, వచ్చే మార్చి నాటికి మరో 1,10,968 ఇళ్లు అప్పగించాలని ఆదేశించారు. వర్షాలు తగ్గినందున నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, విశాఖలో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాల పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలు, విద్యుదీకరణ పనులు సమాంతరంగా చేపట్టాలని ఆదేశించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో గృహ నిర్మాణం కోసం రూ.5,005 కోట్లు ఖర్చు చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు. టిడ్కో ఇళ్లు ఫేజ్-1కు సంబంధించి దాదాపుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇచ్చే 30 లక్షల ఇళ్ల ప్రగతి గురించి కూడా సీఎంకు వివరించారు.

రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు..

పట్టణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల నిర్వహణకు ఆయా ప్రాంతాల నివాసితులతో సంక్షేమ సంఘాలు ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. వేయి ఇళ్లకు పైగా ఉన్న చోట్ల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇళ్ల నిర్వహణపై వారికి అవగాహన కల్పించడంతో పాటు, మార్గదర్శకాలు సూచించాలన్నారు. టిడ్కో ఇళ్ల నిర్వహణ బాగుండాలని, వాటిని పట్టించుకోకపోతే మళ్లీ మురికివాడలుగా మారే ప్రమాదం ఉంటుందని సీఎం హెచ్చరించారు. ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచడం, శానిటేషన్, విద్యుత్ దీపాల నిర్వహణ, వీధి లైట్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్వహణ తదితర అంశాలపై అసోసియేషన్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలో ఈ నెల 22న పంపిణీ చేసిన టిడ్కో ఇళ్లలో గృహ ప్రవేశాల తీరుపై అధికారులు సీఎంకు ప్రత్యేకంగా వివరించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇళ్లు రూపుదిద్దుకుంటున్నాయ్





జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇవ్వడంతో ఇల్లు నిర్మించుకుంటున్నాము. మా సొంతింటి కల సాకారం అవుతోంది. ఇప్పటి వరకు చాలీచాలని గదిలో అద్దెకు ఉన్నాం. ఆడపడుచుల పేరున జగనన్న ఉచితంగా స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం చేపట్టడం మా లాంటి వాళ్లకు ఎంతో ఆసరాగా ఉంటుంది. ఇప్పుడు వర్షాలు తగ్గడంతో పనులు చకచకా సాగుతున్నాయి. ఇళ్లు రూపుదిద్దుకుంటున్నాయి. జగనన్నకు రుణపడి ఉంటాము.

– కె.మంజులాదేవి, తువ్వపాడు, కొనకనమిట్ల మండలం, ప్రకాశం జిల్లా

– వానపల్లి జగదీశ్వరి, వాకలవలస లేఅవుట్, శ్రీకాకుళం జిల్లా



ఒక అనుమానాన్ని తొలగిస్తే, ఇంకోటి దాని స్థానంలోకి వస్తుంది. చెట్టు ఆకులను ఒక్కొక్కటీ తొలగించడం లాంటిదది. అన్ని ఆకులనూ తొలగించినప్పటికీ కొత్త ఆకు పుట్టుకొస్తుంది. అందుకే చెట్టు మొత్తాన్నీ పెకిలించాలి.

– రమణ మహర్షి

సాక్షి

గురువారం, అక్టోబర్, 27

ఇక... వాణిజ్య గ'ఘనమే'!

వినువీధిలో మరో విజయం దక్కింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తన చరిత్రలోనే అత్యంత బరువైన రాకెట్‌ను ఆదివారం నాడు విజయవంతంగా గగనతలంలోకి పంపి, మరో మైలురాయిని చేరుకుంది. 'జియోసింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ మార్క్ 3' (జీఎస్ఎల్వీ ఎంకే 3) రాకెట్‌తో దాదాపు 6 టన్నుల పేలోడ్‌ను దిగువ భూకక్ష్యలోకి ప్రవేశపెట్టింది. 'ఎల్వీఎం3– ఎం2' అని కూడా ప్రస్తావించే ఈ రాకెట్ ఏకంగా 36 ఉపగ్రహాలతో ఇంత బరువును విహాయసంలోకి తీసుకువెళ్ళడం ఇస్రో చరిత్రలో ఇదే తొలిసారి. విజయవంతమైన ఈ ప్రయోగం మన అత్యాధునిక ఉపగ్రహ వాహక నౌక 'ఎల్వీఎం3' రాకెట్ ఆచరణీయతను మరోసారి ధ్రువీకరించింది. ఆసక్తితో చూస్తున్న 'గగన్‌యాన్' లాంటి వాటికి ఆ రాకెట్ అన్ని విధాలా తగినదని తేల్చిచెప్పింది. అంతేకాక, భారీ ఉపగ్రహాల ప్రయోగానికి సంబంధించిన విపణిలో ఇస్రో బలమైన అభ్యర్థి అని చాటిచెప్పింది.

ఈ పరిణామం అభినందనీయం. అందుకు అనేక కారణాలున్నాయి. భారత అంతరిక్ష విభాగ పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థ 'న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్' (ఎన్ఎస్ఐఎల్) వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాలను చేపడుతోంది. ఆ ప్రయోగాలకు అంకితమైన రాకెట్ – 'ఎల్వీఎం3'. 2017లో ఈ రాకెట్‌ను తొలిసారి ప్రయోగించారు. అప్పటి నుంచి మన దేశ కమ్యూనికేషన్ ఉపగ్రహాలనూ, ఇతర పేలోడ్‌లనూ నాలుగు సార్లు విజయవంతంగా వినువీధిలోకి పంపిన ఘనత ఈ రాకెట్‌ది. ఇప్పుడు తొలిసారిగా విదేశీ పేలోడ్‌ను వినువీధిలోకి పంపడానికి దీన్ని వినియోగించారు. జయకేతనం ఎగరేసిన ఈ రాకెట్ మనకు అందివచ్చిన అవకాశం. ఒకేసారి ఉపగ్రహాల్ని ఒక మండలంగా ప్రయోగిస్తూ పలు సంస్థల అవసరాల్ని తీర్చి, అంతర్జాతీయ విపణిలో ఆ ఖాళీ భర్తీకి ఇది ఉపకరిస్తుంది.

నిజానికి, అక్టోబర్ 23 నాటి ఈ అంతరిక్ష ప్రయోగం ఎన్ఎస్ఐఎల్‌కూ, బ్రిటన్‌కు చెందిన 'వన్ వెబ్'కూ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భాగం. భారతీ గ్లోబల్ భారీగా పెట్టుబడులు పెట్టిన ఈ వన్ వెబ్‌కు దిగువ భూకక్ష్య (ఎల్ఈఓ)లో పలు ఉపగ్రహాలు అవసరం. ఆ అవసరాన్ని ఇస్రో ఇలా తీరుస్తోంది. తాజా 36 ఉపగ్రహాలు కాక, మరో 36 వన్‌వెబ్ ఉపగ్రహాలను రెండో విడతగా 2023లో ఇస్రో అంతరిక్షంలోకి పంపనుంది. ఇలా రెండు ప్రయోగాలతో మొత్తం 72 ఉపగ్రహాలను నింగిలోకి పంపడానికి ఆ సంస్థ మన ఇస్రోకు రూ. 1000 కోట్లు చెల్లించింది. వచ్చే ఏడాది కల్లా ప్రపంచవ్యాప్త టెలీకమ్యూనికేషన్లలో హైస్పీడ్ కనెక్టివిటీని అందించాలని వన్‌వెబ్ లక్ష్యం. ఆ లక్ష్య సాధనకు మొత్తం 648 ఉపగ్రహాల్ని నింగిలోకి పంపాలని సిద్ధమైంది. ఇప్పటికి 462 పంపగలిగింది.

తాజా ప్రయోగంలో ఓ తిరకాసుంది. ప్రతి రెంటికీ మధ్య కనీసం 137 మీటర్ల దూరం ఉండేలా మొత్తం 36 ఉపగ్రహాలనూ 601 కి.మీ. కక్ష్యలో అత్యంత కచ్చితత్వంతో ప్రవేశపెట్టాలి. వన్‌వెబ్‌కు ఉన్న ఈ అవసరాన్ని అతి సమర్థంగా నెరవేర్చడం ఇస్రో సాధించిన ఘనత. థ్రస్టర్లను ఉపయోగించి, క్రయో దశలోనే పదే పదే దిశానిర్దేశంతో, ఈ విన్యాసాన్ని ఇస్రో చేసిచూపింది. ఇస్రోకు మరిన్ని వాణిజ్య ఒప్పందాలు రావాలంటే – ఇప్పటి ప్రయోగం, అలాగే వచ్చే ఏటి రెండో విడత ప్రయోగం సక్సెస్ కావడం కీలకం. తాజా విజయం మన అంతరిక్ష ప్రయోగ సామర్థ్యానికి మరో మచ్చుతునక. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాల గిరాకీకి తగ్గట్టు మన ఉపగ్రహ వాహక జవనాశ్వమైన ఎల్వీఎం3 రాకెట్ల తయారీని వేగవంతం చేసేందుకు ఇస్రో సన్నద్ధమవుతోంది.

అసలు ఇలా ఒకేసారి ఉపగ్రహ మండలంగా పలు ఉపగ్రహాలను ఒకే కక్ష్యలోకి వాణిజ్యపరంగా పంపే వాహక నౌకల కొరత అంతర్జాతీయంగా ఉంది. ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో ఆ ఉపగ్రహాలను రక్షణ ప్రయోజనాలకు వాడబోమని హామీ ఇవ్వాలంటూ పట్టుబట్టి, రష్యా ఈ వన్ వెబ్ అవకాశం వదులుకుంది. చైనా రాకెట్ల వాణిజ్య సత్తాను పాశ్చాత్యలోకం అంగీకరించదు. ఫ్రాన్స్‌లో వీటి అభివృద్ధి ఆలస్యమైంది. ఇవన్నీ మనకు కలిసొచ్చాయి. ప్రస్తుతం అంతరిక్ష వాణిజ్య విపణిలో అంతర్జాతీయంగా భారత వాటా 2 శాతమే. తాజా ప్రయోగ విజయంతో దాన్ని గణనీయంగా పెంచుకొనే వీలు చిక్కింది. వాణిజ్య ప్రయోగాలకు ఇస్రో వద్ద పీఎస్ఎల్వీ మాత్రమే ఉంది. తాజా ఎల్వీఎం3–ఎం2 రాకెట్‌తో రెండో అస్త్రం చేరింది. పూర్తి స్వదేశీ సాంకేతికతతో రూపొందిన ఈ రాకెట్ 'చంద్రయాన్–2' సహా 4 ప్రయోగాల్ని సక్సెస్ చేసింది. మనిషిని విహాయసంలో విహరింపజేసే 'గగన్‌యాన్'కూ దీన్నే స్వల్ప మార్పులతో సిద్ధం చేస్తున్నారు. వచ్చే ఏటి 'చంద్రయాన్–3'కీ, సూర్యగ్రహ అధ్యయనమైన 'ఆదిత్య ఎల్1'కూ సన్నాహాలు సాగుతుండడం గర్వకారణం.

రాబోయే రోజుల్లో ఉపగ్రహ సేవలనేవి అతి పెద్ద వ్యాపారం. 5జీ వస్తున్నవేళ టెలికామ్ సేవలకు కీలకమైన ఎల్ఈఓ ఉపగ్రహాలను గగనంలోకి పంపే విపణిలో ఆటగాడిగా మనం అవతరించడం శుభసూచకం. మనకూ ఉపయుక్తం. ఇదే ఊపు కొనసాగితే వచ్చే 2025 కల్లా మన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 1300 కోట్ల డాలర్ల (రూ.1.07 లక్షల కోట్ల) ఆదాయాన్ని అందుకుంటుందట. ఉపగ్రహ సేవల విపణి 500 కోట్ల డాలర్లకూ, గ్రౌండ్ సేవలు 400 కోట్ల డాలర్లకూ చేరుకుంటాయని లెక్క. వెరసి, రాగల మూడేళ్ళలో ఉపగ్రహ, ప్రయోగ సేవల్లో మనం మునుపెన్నడూ లేనట్టు 13 శాతం అత్యధిక వార్షిక వృద్ధి రేటు సాధిస్తామన్న మాట ఈ ఆనందానికి మరిన్ని రెక్కలు తొడుగుతోంది. దేశీయ అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం శ్రీకారం చుట్టుకుంది. అంతరిక్ష వాణిజ్య సేవల రంగంలో దేశంలో రానున్న పెనుమార్పులకు స్వాగతం... శుభ స్వాగతం!

మానవ హక్కులకు ప్రాణధార



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

'చట్టాలు పేద వర్గాలను పీల్చి పిప్పి చేస్తుంటే, ధనిక వర్గం ఆ చట్టాలతోనే పెత్తనం చలాయిస్తుంది' అన్నాడు గోల్డ్‌స్మిత్. ఆదర్శంలో ప్రతి ఒక్కరూ వారి స్థాయితో నిమిత్తం లేకుండా తమ ఫిర్యాదును న్యాయస్థానానికి నివేదించుకోగలగాలి. అందుకే జీవించే హక్కును, వ్యక్తిగత స్వేచ్ఛను హరించే ధోరణులకు అడ్డుకట్ట వేయవలసిన అవసరాన్ని సుప్రీంకోర్టు కూడా గుర్తించవలసి వచ్చింది. కానీ 'చట్టాలు సాలెగూడుల్లాంటివి. ఆ గూట్లోకి బలహీనమైన ప్రాణి దూరితే దాని కథ ముగిసినట్టే' అన్నాడు సోలన్. అందుకే రాజ్యాంగంలోని 32వ అధికరణానికి ఉన్న పరిమితులను సైతం దృష్టిలో ఉంచుకుని మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న న్యాయమూర్తులు ఉన్నారు. అలాంటివారిలో... జస్టిస్ యతిరాజులు ఒకరు.

"ఎంతటి సాధారణ పౌరుడైనా, జీవితంలో అతడు ఏ స్థానంలో ఉన్నా, దానితో నిమిత్తం లేకుండా న్యాయస్థానంలో తన కేసును హుందాగా వినిపించే హక్కు అతనికి ఉంది. అంతే హుందాతనంతో కోర్టు అతని వాదనను సానుభూతితో వినే మర్యాదనూ పాటించాలి. ప్రజా సమస్యలను వినడానికే న్యాయస్థానాలు ఉన్నాయి. కోర్టులో న్యాయం కోసం వచ్చే పౌరుల్ని యాచకులుగానూ, పీడకులుగానూ చూడరాదు."

– 1988 షీలా బర్సే వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు.

"తీర్పు గుడ్డిది కావచ్చుగానీ, తీర్పరి (జడ్జి) గుడ్డివాడు కాకూడదు.

– సుధాంశు రంజన్, సుప్రసిద్ధ జర్నలిస్టు, 'జస్టిస్ వర్సెస్ జ్యుడీషియరీ' గ్రంథం, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, 2019

భారత రాజ్యాంగ సూత్రాలను, 'భారత ప్రజలమైన మేము మాకుగా రూపొందించుకున్న సెక్యులర్ రాజ్యాంగాన్ని' కంటికి రెప్పలా కాపాడుకునే హక్కు మాకు ఉందని రాజ్యాంగం పీఠికలోనే నిర్ద్వంద్వంగా ప్రకటించి ఉన్నందున అది ఎప్పటికీ అనుల్లంఘనీయమని ప్రముఖ తెలుగు న్యాయమూర్తులలో ఒకరైన జస్టిస్ జి. యతిరాజులు చాటి చెప్పారు. రాజ్యాంగ అతిక్రమణ జరిగినప్పుడు 'రాజ్యాంగ పరిహార' హక్కును 32వ అధికరణం ప్రసాదిస్తోంది. భాగమైన 32వ అధికరణకు ఆచరణలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ– ఆ ఇబ్బందుల ఫలితంగా పాలక వర్గాలు, అధికారులు, పోలీసుల వల్ల సామాన్య ప్రజలు ఎలాంటి కష్టనష్టాలు ఎదుర్కోవలసి వస్తోందో వివరించారు. "జీవించే హక్కును, వ్యక్తిగత స్వేచ్ఛను హరించే ధోరణులకు" అడ్డుకట్ట వేయవలసిన అవసరాన్ని సుప్రీంకోర్టు ఎందుకు గుర్తించవలసి వచ్చిందో జస్టిస్ యతిరాజులు పదే పదే ప్రస్తావించవలసి వచ్చింది ('ఆర్టికల్ 32 అండ్ ద రెమెడీ ఆఫ్ కాంపెన్సేషన్' పేరుతో రాసిన పుస్తకంలో). అయితే, దురదృష్టవశాత్తూ, కాదుకాదు, రాజ్యాంగ ఆదేశాల ఉల్లంఘనకు పాల్పడి పౌరహక్కుల అధ్యాయానికి తూట్లు పొడవడానికి అలవాటుపడిన పాలకవర్గాలు పౌరులకు ఉపయోగపడాల్సిన అధికరణలను ఆచరణలో అమలు కాకుండా చేసే యంత్రాంగాన్ని చొప్పించాయి.

ఆదేశిక సూత్రాల లక్ష్యం సంక్షేమ రాజ్య స్థాపన. అవి అమలు జరగాలంటే వాటికి చట్టబద్ధత అవసరమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయాన్ని విస్మరించరాదు. కొంతమంది వ్యక్తులకు సౌకర్యాల పేరిట కల్పించిన ప్రత్యేక హక్కులను అవసరమైతే సవరించయినా సరే ఆదేశిక సూత్రాలను అమలు జరపాలని కనీసం తొమ్మిది, పది కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులు చెప్పింది (1970–1987 మధ్యకాలంలో).

రెండో మాట





జస్టిస్ యతిరాజులు

రాజ్యాంగంలోని 32వ అధికరణ ప్రాధాన్యతను నొక్కి చెప్పడానికి జస్టిస్ యతిరాజులు "మానవ హక్కుల, ప్రాథమిక స్వేచ్ఛా స్వాతంత్ర్యాల" రక్షణ ప్రాధాన్యతను ఉగ్గడించిన యూరోపియన్ కన్వెన్షన్ అధికరణలో పెక్కింటిని కూడా ఉదాహరించారు. ఈ 32వ అధికరణ ఆసరాగానే పాలకులు ప్రత్యర్థులపై విధించే అక్రమ కేసుల నుంచి విడిపించే 'హెబియస్ కార్పస్' పిటీషన్ కూడా అమలులోకి రాగల్గింది! అలాంటి అధికారం ఉన్న 32వ అధిక రణను విధిగా అమలు జరిపే బాధ్యత నుంచి తప్పించి అమలులోకి రాకుండా చేశారు. అలాంటి 32వ అధికరణ అమలు జరపడానికున్న అడ్డంకులను ఛేదించిన జస్టిస్ యతిరాజులును న్యాయశాస్త్రంలో ఉద్దండులైన పలువురు పాత తరం న్యాయ మూర్తులకు దీటైనవారిగా భావించవచ్చు.

సుప్రసిద్ధ గోల్డ్‌స్మిత్ అన్నట్టు "చట్టాలు పేద వర్గాలను పీల్చి పిప్పి చేస్తుంటే, ధనిక వర్గం ఆ చట్టాలతోనే పెత్తనం చలాయిస్తుంది." అయితే గతించిన శతాబ్దంలో ఏథెన్స్‌లో ధనికులకూ, పేదలకూ మధ్య దుర్భరమైన అంతరం ఏర్పడినప్పుడు రాచరిక కుటుంబీకుడైన సోలన్ రంగంలోకి దిగాడు. స్వయంగా ప్రజలకు ఆర్థిక బానిసత్వం నుంచి, అప్పుల నుంచి విముక్తి కల్పించాడు. జైళ్లపాలైన వారిని విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశాడు. పేదల్ని పిండి వసూలు చేసే పన్నులకు పన్నెండు రెట్లు ఎక్కువ పన్నును ధనిక వర్గాల నుంచి రాబట్టాడు. కోర్టులను ప్రజాబాహుళ్యం అవసరాలకు అనుగుణంగా సంస్కరించాడు. ఏథెన్స్ నగర రక్షణలో ప్రాణాలొడ్డిన వారి పిల్లలను పైకి తెచ్చి, ప్రభుత్వ ఖర్చుపైన విద్య చెప్పించాడు. ఈ సమూల సంస్కరణలకు ధనిక వర్గాలు భీషణమైన నిరసనలకు దిగాయి. అయితే ఇలా – ఒక తరం గడిచే లోగానే సోలన్ పెను సంస్కరణలు ఏథెన్స్‌ను విరుచుకు పడటానికి సిద్ధంగా ఉన్న విప్లవం నుంచి రక్షించాయి.

అందుకే సెయింట్ అగస్టీన్ అన్నాడు: రాజ్యాలు, రాజ్యపాలకులంటే ఎవరనుకున్నారు? పరమ ఘరానా దోపిడీదారులు, దోపిడీవర్గ సంస్థలు అన్నాడు (ది సిటీ ఆఫ్ గాడ్)! కనుకనే, సోలన్ "పాలకుడెవరో చెప్పండి – అతను చేసే చట్టం ఎలా ఉంటుందో నేను చెప్తా" అన్నాడు. "ఎందుకంటే చట్టాలు సాలెగూడుల్లాంటివి. ఆ గూట్లోకి బలహీనమైన ప్రాణి (పురుగు) దూరితే దాని కథ ఇక ముగిసి నట్టే. కానీ, ఎదిరించగల శక్తి ఉన్నది దూరితే అది నిభాయిం చుకుని బయటపడగల్గుతుంది" అని వివరించాడు.

రాజ్యాంగంలోని 32వ అధికరణకున్న పరిమితులను సహితం దృష్టిలో ఉంచుకుని జస్టిస్ యతిరాజులు అదే అధికరణ కింద కక్షిదారుల సహజహక్కుల్ని రక్షించడం, నష్టపరిహారం రాబట్టగల్గడం... మానవహక్కుల సహజ పరిరక్షణకు తనవంతు చారిత్రక బాధ్యతను నెరవేర్చడంగా భావించాలి. ఈ విషయంలో జాతీయస్థాయిలోనూ, ఇటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనూ పలువురు న్యాయమూర్తులు సాధించిన విజయాలకు జస్టిస్ యతిరాజులు కృషి ఏమాత్రం తీసిపోదు. నిజాయితీకి, నిర్మొహమాటానికి పేరొంది, జాతీయ స్థాయిలో అభ్యుదయకర సంస్కరణలకు చేదోడు వాదోడుగా నిలిచిన జస్టిస్ పి.ఎ.చౌదరి, హిదా యతుల్లా, కేహార్, వెంకటాచలయ్య, హెచ్.ఆర్. ఖన్నా, జె.ఎస్.వర్మ, లోకూర్, జె.ఎస్.టాగోర్, భరూచా, కురియన్, జోసఫ్, జాస్తి చలమేశ్వర్ ప్రభృతులు ప్రవేశపెట్టిన నూతన ఒరవడులకు జస్టిస్ యతిరాజుల కృషి కొనసాగింపుగానే భావించవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, జాతీయ స్థాయిలోనూ నూతన ఒరవడిలో తీర్పులు వెలువరించిన పి.ఎ.చౌదరి, జస్టిస్ జీవన్ రెడ్డి ప్రభృతుల కృషికి ప్రాణధారపోసి చట్టబద్ధతకు దూరంగా ఉండి పోయిన దానిని పలువురి దృష్టిని ఆకర్షించేలా చేసి ప్రజలముందు ప్రయోజనకర అధికరణగా నిలబెట్టగలిగారు! సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థానంలో ఉండ వలసిన సుప్రసిద్ధ పౌరహక్కుల వాణి అయిన ప్రశాంత్ భూషణ్ గొంతు నొక్కేసే సంప్రదాయానికి తలుపులు తెరిచిన మాజీ ప్రధాన న్యాయమూర్తుల వైఖరిని తూర్పారబట్టారు. ఇలాంటి వాతావర ణంలో – చట్టరీత్యా ఆచరణలో అమలు కాకుండా దూరంగా ఉంచేసిన 32వ అధికరణకు ఆచరణలో శాశ్వత విలువను సంతరింపజేయడంలో జస్టిస్ యతిరాజుల కృషి సదా అభినందనీయం. అయితే, రాజ్యాం గంలో కేవలం పేరుకు మాత్రమే చేర్చి, ఆచరణలో లేకుండా దూరం చేసిన వాటికి పూర్తి చట్టబద్ధత కల్పించే వరకు ప్రజాశ్రేయస్సును కోరే న్యాయమూర్తులు విశ్రమించకుండా ఉంటే ప్రజలు సంతోషిస్తారు.

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త ప్రారంభం



ఒక సంవత్సరం ముగిస్తే, ఇంకో సంవత్సరం మొదలవుతుంది. హిందూ నూతన సంవత్సరం సందర్భంగా ప్రతి ఒక్కరికీ నా శుభాకాంక్షలు. సాల్ ముబారక్. (కొన్ని వర్గాల్లో దీపావళి నుంచి కొత్త సంవత్సరం మొదలవుతుంది.)

– ప్రీతీ పటేల్, బ్రిటన్ ఎంపీ

రద్దుకు సిద్ధమా?



కేరళ పిచ్చి కమ్యూనిస్టులు గ్రహించాల్సింది ఏమంటే– కేరళ గవర్నర్ (మహమ్మద్ ఆరిఫ్ ఖాన్) భారత రాష్ట్రపతికి ప్రాతినిధ్యం వహిస్తారు. అంటే రాజ్యాంగపరంగా కేంద్రానికి. ఒకవేళ గవర్నర్ వెంట్రుకను తాకినా కేరళ ప్రభుత్వాన్ని రద్దు చేయడానికి సిద్ధంగా ఉండాలని మోదీ సర్కారును కోరుతున్నా.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

ఇంకా పెంచుదాం!



డియర్ కేజ్రీవాల్: కరెన్సీ నోట్ల మీద లక్ష్మీదేవి, గణేశులను ముద్రిస్తే అది సంపదను తేగలిగితే – అల్లాహ్, జీసస్, గురునానక్, గౌతమబుద్ధుడు, మహావీరులను కూడా కలిపి మనం మరింత సంపద పెరిగేలా చూద్దాం.

– సల్మాన్ అనీస్ ఓజ్, కామెంటేటర్

అప్పుడే అయిపోతుందా?



మనకు ఇంకా ఈ 2022వ సంవత్సరంలో రెండు నెలల ఆరు రోజులే మిగిలాయి. ఈ అందమైన సంవత్సరం ఎక్కడికి మాయమైపోతుంది?

– మీనా కందసామి, రచయిత్రి

అదే పెద్ద విషయం



నేను పెద్ద విషయాలేవో చేద్దామని మెడిసిన్‌లోకి అడుగుపెట్టాను. ఇప్పుడు పెద్ద విషయాలకు జమయ్యే చిన్న విషయాలేవో స్థిరంగా చేద్దామనుకుంటున్నాను.

– ఉమ్మే హెచ్. ఫైజల్, పరిశోధకురాలు

ఈ ప్రశ్నలకెవురు జెబాబు సెప్తారు?

ఆగండాగండి. దండయాత్ర కాదు, ధర్మ యాత్ర అంటన్నారు కదా, యీ ప్రశ్నలకి జెబాబులు చెప్తారా? ఒకప్పుడు గోదావరి నుంచి మహానది దాకా కళింగదేశమట. ఇప్పుడంత లేదు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం మూడు జిల్లాల ఉత్తరాంధ్ర వుండేది, అదిపుడు ఆరుజిల్లాల ఉత్తరాంధ్ర అయ్యింది. ఈ ఆరుజిల్లాల ఉత్తరాంధ్ర ఈనాటి ఆంధ్రప్రదేశ్‌లో విద్య, వైద్యం, ఉపాధి, పశుసంపద, భూమి, సాగు నీటివసతులు, రోడ్లు, విద్యుత్... ఇలాగ యే రంగం తీసుకోండి... అన్ని జిల్లాలకంటే యెందుకు ఆఖరిస్తానాల్లో వున్నాయి?

నాగావళి, వంశధార, జంఝావతి, వేగావతి, మహేంద్రతనయ వంటి పద్దెనిమిది జీవనదులుండగా మా సాగుభూముల్లో మూడు వంతుల నేలకి సాగునీటి సదుపాయాలెందుకు లేవు? రాష్ట్రంలోని యే ప్రాంతానికీ లేని మూడు వందల యాభయి కిలోమీటర్ల సముద్రతీరమున్నాది. వేలకోట్ల రూపాయల మత్స్యసంపద దొరకతాది? అయితే మా మత్స్యకారులెందుకు గుజరాత్, భివాండీ వంటి ప్రాంతాలకు వలసలు పోవాల్సివచ్చింది? గుడిసెల్లో గుండెలరచేతిల పెట్టుకొని మా మత్స్యకార మహిళలు సముద్రానికెందుకు దీనంగా మొక్కవలసొస్తన్నాది?

ఎక్కడా లేని అయిదు వందల కిలోమీటర్ల అడవులున్నాయి మా ఆరు జిల్లాలలోన. రాష్ట్రంలోని మిగిలిన చోటనున్న ఆదివాసీలకంటే ఎక్కువ ఆదివాసీలున్నారు. అయినా ఎందుకక్కడ యింకా రోడ్లు లేవు, ఆసుపత్రులు లేవు. స్కూళ్లు లేవు, విద్యుత్ లేదు, ఉపాధి లేదు. ఆదివాసీలు కూడా ఎందుకు రెక్కలు కొట్టుకొని వలసలు పోవల సొస్తంది?

పాతిక లక్షల ఎకరాల సారవంతమయిన సాగుభూమి వుంది. అయితే ఎందుకీ జిల్లాల రైతులు అప్పులపాలయినారు? కారు చవగ్గా యీ భూముల్ని అటునిండొచ్చిన మీ జిల్లాల పెద్దరైతులు కొనేసి, పెద్దపెద్ద కమతాలు కట్టుకోలేదా? మా నేలలో మా రైతోళ్లని పాలేర్లు చేయలేదా? మాకున్న యేకైక నగరం విశాఖపట్నం. అదిపుడు మీ జిల్లాల నుండొచ్చిన వ్యాపారస్తుల దుకాణమయిపోలేదా? అక్కడి ఆసుపత్రులెవురివి? అక్కడి లాడ్జింగులెవురివి? అక్కడి కాలేజీలు, యూనివర్సిటీ లెవురివి? కాంట్రాక్టులెవురివి? కంపెనీ లెవురివి?

విశాఖపట్నంలో పాలనా రాజధాని యేర్పాటు మాత్రమే కాదు... ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి యీ ప్రాంతానికి చెందిన ప్రతినిధులతో ఒక ప్రత్యేక పాలనా వ్యవస్థ యేర్పాటు కావాలని కూడా అడుగుతున్నాం, తప్పంటారా? డార్జిలింగ్ అటానమస్ హిల్ కౌన్సిల్ పద్ధతిలో ఉత్తరాంధ్రాలోని ఆదివాసీ ప్రాంతాలైన భద్రగిరి, సీతంపేట, అరకు, పాడేరు, సాలూరు, మందస వంటి ప్రాంతాలతో హిల్ యేరియా కౌన్సిల్ యేర్పాటు చేయాలంటున్నాం, తప్పంటారా? ఆదివాసీ ప్రాంత సహజ వనరులనూ, ఖనిజాలనూ రకరకాల అభివృద్ధి ప్రణాళికల పేరిట కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే చర్యలను విరమించుకోవాలి. గిరిజన యూనివర్సిటీని పూర్తిస్థాయిలో ప్రారంభించాలంటున్నాం, తప్పంటారా? ఉత్తరాంధ్రా వెనకబడడానికి కారణం పారిశ్రామికీకరణ జరగకపోవడం. అందుచేత మూడు జిల్లాల్లో వ్యవసాయాధార పరిశ్రమలు,



సహజ వనరుల వెలికితీసే పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లు యేర్పాటు చేయాలి. మూసివేతకు గురయిన కర్మాగారాలనన్నీటినీ తెరిపించాలని నినదిస్తన్నాం, తప్పంటారా?

ఉత్తరాంధ్రాకు ప్రత్యేక ప్రాంతమయిన ఉద్దానంలో... జీడి, మునగ, కొబ్బరి, పనస వంటి పంటలకు కిట్టుబాటు ధర కల్గించడమేగాక, జీడి, కొబ్బరి వంటి పంటలకు ప్రాసెసింగ్ యూనిట్లు, అనుబంధ కర్మాగారాలూ నిర్మిస్తే, ఉపాధి అవకాశాలూ కలుగుతాయి. ఉద్దానం మంచినీటి సమస్యను పరిష్కరించాలి. ఉద్దానం కిడ్నీవ్యాధికి సంబంధించిన పరిశోధనలు జరపాలి. వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్యసదుపాయాలు అందించాలంటన్నాం, తప్పంటారా?

మొత్తం కోస్తాంధ్రాలో 72 శాతం భూమికి సాగునీరు అందుతుండగా, ఉత్తరాంధ్రకు 42 శాతం భూమికి మాత్రమే సాగు నీరందుతుంది. 7 శాతం భూమి మాత్రమే రెండు పంటలకు అనువుగా వుంది. పెండింగులో వున్నటువంటి అన్ని సాగునీటి ప్రాజెక్టులనూ తక్షణమే పూర్తిచేసే చర్యలను చేపట్టాలంటున్నాం తప్పా? పంటలకు గిట్టుబాటు ధరలు కావాలంటన్నాం. వేయికోట్లకు పైగా ఆదాయమిచ్చే మత్స్యసంపదను మల్టీనేషనల్ కంపెనీలు కాజేస్తున్నాయి. మత్స్యకారులకు తీరని నష్టం జరుగుతోంది. సముద్రజలాల్లో మత్స్యకారుల వేటకు సంబంధించిన ప్రాంతంపై మత్స్యకారులకే అధికారముండాలి. కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలి. తుఫానుషెల్టర్లు నిర్మించాలంటన్నాం, తప్పంటారా? విశాఖలో రైల్వే జోన్ ఉత్తరాంధ్రకు లబ్ధి జరిగేవిధంగా యేర్పాటు కావాలంటున్నాం, తప్పా?

ఏటకేటా ఉత్తరాంధ్ర నుంచి యాభయి వేలమంది ఉపాధికోసం వలసపోతన్నారు. వలసలు ఆగాలనడుగుతున్నాం. తప్పంటారా?


మా నేల ఎవరెవరి పుణ్యానో యిన్నేళ్లు నిరాదరణకు గురయ్యింది, ఇంకా నిరాదరణకు గురి చేస్తామంటే ఎలా సహిస్తాం? పాలనా రాజధాని విశాఖకు వస్తే వైసీపీ నేతల రియలెస్టేట్‌కి లాభమంటన్నారుకదా, మరి అమరావతిలో రియలెస్టేట్ జరిగిందని అర్థం కదా మీ మాటలకి?

అసలు విశాఖకు పాలనాకేంద్ర రావడం వలన మీకొచ్చిన నష్టమేమిటి? మీకు వచ్చే దేనిని మేము తీసుకుంటున్నాం? మీరిచ్చిన భూములకు ధరలు తగ్గించమని మేమడిగినామా? మీకిచ్చిన ప్లాటులను ప్రభుత్వం వెనక్కి తీసుకోమని అనంటన్నామా? మీ అమరావతిలో అసెంబ్లీ వొద్దుగాక వొద్దని మీలాగ మీ అమరావతికి యాత్ర తీసినామా? మీ జోలికి రాలేదు, మీ ఊసెత్తలేదు, మీ ముక్కు మీద మసి అనలేదు. మరేల మా నేల మీదకి దండయాత్ర కొస్తన్నారు? మీకిది దరమ్మా? మీకిది నేయమా? మీకిది తగునా? 'విశాఖ ఉక్కు' కోసం పోరాడుతున్నట్టే పాలనాకేంద్రం కోసమూ పోరాడతాం. అడ్డుగా వొస్తన్న మిమ్మల్ని ఎందుకొదిలేస్తాం? ఎందుకొదిలీయాలి?

– కళింగ కరువోడు

ఆపన్నులకు 'ఫ్యామిలీ డాక్టర్' భరోసా

సందర్భం



అమరనాథ్ జగర్లపూడి

'ఆకలికి అన్నము వేదనకు ఔషధం' అనే నానుడి మనకందరికీ తెలిసినదే! శారీరక ఆరోగ్యానికి ఆహారం ఎంత అవసరమో అలాగే అనారోగ్య శరీరాలకు ఔషధం అనేది కూడా అంతే ముఖ్యం. కానీ ఔషధాన్ని నిర్ణయించాల్సింది మటుకు వైద్యులే అనేది జగమెరిగిన సత్యం! రోగిని పరీక్షించటం, వ్యాధిని నిర్ణయించి తగిన సమయంలో సరియైన మోతాదులలో మందులు వాడటం అనేది వైద్యుల బాధ్యతే. అయితే 'విత్తం ఉంటేనే వైద్యం' అనే రీతిలో ప్రస్తుత పరిస్థితులు ఉండటంతో సమాజంలోని పేద, మధ్యతరగతి వారు వైద్యం అందక నానా ఇబ్బందులు పడుతున్నారు.

పూర్వం గ్రామాల్లో స్థిర నివాసం ఉండే వైద్యులు ఉండేవారు. వారికి ఆ ఊళ్లో ఉన్న అన్ని కుటుంబాల ఆరోగ్య స్థితుల పట్ల ఒక అవగాహన ఉండేది. అందువల్ల ఆయా కుటుంబాలకు వైద్య చికిత్స అందించడం తేలికయ్యేది. వారందరినీ ఫ్యామిలీ డాక్టర్లుగా వ్యవహరించడం కద్దు. అయితే ప్రస్తుతం వైద్యుల సంఖ్య పెరుగుతున్నా ఈ ఆధునిక కాలంలో పల్లెల్లోనే కాదు, పట్టణాల్లోనూ ప్రజలందరికీ డాక్టర్లు అందుబాటులో ఉండటంలేదు. ఇందుకు వైద్యం ఖరీదైనదిగా మారటం ఒక కారణమైతే, డబ్బు సంపాదనే ధ్యేయంగా ఎక్కువ మంది డాక్టర్లు పెద్ద ఆసుపత్రుల్లో తమ సేవలను అందించడం ఇంకో కారణం. దీంతో ఆయా గ్రామాల్లో కానీ, లేదా పట్టణాల్లోని వార్డుల్లో కానీ జీవించే వారికి ఫ్యామిలీ డాక్టర్ అనదగిన వైద్యుని సేవలు పొందే అవకాశం లేకుండా పోయింది.

పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కొద్దో గొప్పో లభిస్తూనే ఉంటాయి. అలాగే వైద్య సౌకర్యాలు ఫరవాలేదు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు తక్కువ. అలాగే రోగం, రొప్పు వస్తే అర్హత గల డాక్టర్ వైద్య సేవలు మృగ్యం. నాసిరకం మందులు, నాటు మందులు మాత్రమే వారికి లభిస్తాయి. మూఢనమ్మకాలతో కూడిన వైద్యం వారిని కాటేస్తున్నది. నాణ్యమైన వైద్యం కావాలంటే... అప్పుల పాలు కావటమో, ఆస్తులు తాకట్టు పెట్టటమో, నగ నట్రా లేదా ఆస్తులు అమ్ముకోవటమో చేయాల్సి వస్తున్నది.

ముఖ్యంగా స్త్రీలలో ప్రసవ వేదన సమస్యలు, సాధారణ స్త్రీ ఆరోగ్య సమస్యలు; దీర్ఘకాలిక వ్యాధులున్నవారి సమస్యలు, వృద్ధాప్యంలో వచ్చే సహ జమైన ఆరోగ్య సమస్యలు, పిల్లల్లో కలిగే రుగ్మ



తలు, పౌష్టి కాహార లోపం వల్ల వచ్చే వ్యాధులు వంటి వాటికి చికిత్స పొందే తాహతు పల్లెల్లో కానీ, పట్టణాల్లో కానీ చాలా తక్కువ మందికే ఉంది. అందుకే ప్రజలందరికీ ఉచిత నాణ్యమైన వైద్యం అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని ప్రవేశ పెట్టేం దుకు సిద్ధమయింది.

మాటలతో మానసిక భరోసా, అవసరమైన వరకే మందులతో వైద్యం చేసే పరిస్థితి ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఉంటుంది. నిజంగా ఇది 'కారుచీకటిలో కాంతి పుంజం' వంటిదని చెప్ప వచ్చు. 'ఫ్యామిలీ డాక్టర్స్' వ్యవస్థ ఆవిష్కరణ మన రాష్ట్రానికే కాదు దేశానికే, ఆదర్శం, హర్షణీయం. ఇదేదో ప్రభుత్వ ఆకర్షణీయ పథకం అనుకుంటే పొరపాటే! ప్రభుత్వం ప్రజలందరి ఆరోగ్య స్థితిగతుల గురించిన సమాచారాన్ని సేకరించి... తగిన విధంగా వైద్య సేవలను అందచేయడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకోవడానికి ఈ విధానం ఎంతో ఉపకరిస్తుంది.

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ, రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే), వాలంటరీ వ్యవస్థ, నూతన విద్యా విధానాల వైపు దేశం యావత్తూ ఆసక్తికరంగా చూస్తోంది. ఇప్పుడు జగన్ ప్రభుత్వ తీసుకువస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్స్' విధానం మరింతగా దేశ ప్రజలను ఆకర్షించి మంచి ఫలితాలు పొందడానికి మార్గదర్శక మవుతుంది. ఇంగ్లాండ్‌లో ఈ విధానం ఇప్పటికే అమలులో ఉంది. వైద్యునికి రోగికి మధ్య సత్సంబంధాలు మెరుగుపరచటమే కాక... సకాలంలో సరియైన రీతిలో ప్రజలకు పెద్దగా ఆర్థిక భారం లేని వైద్య సౌకర్యాలు అందుబాటులోకి రావడానికి ఈ విధానం దోహదం చేస్తుంది. అందుకే ఈ విధానానికి ఆహ్వానం పలుకుదాం! ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం!

వ్యాసకర్త కౌన్సెలింగ్ సైకాలజిస్ట్
మొబైల్: 98495 45257

గ్రహం అనుగ్రహం

శ్రీశుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.విదియ ప.2.04 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** విశాఖ ప.2.19 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** సా.6.09 నుండి 7.41 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.50 నుండి 10.34 వరకు, తదుపరి ప.2.24 నుండి 3.02 వరకు, **అమృతఘడియలు:** రా.3.14 నుండి 4.50 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు; **సూర్యోదయం** 6.00; **సూర్యాస్తమయం** 5.29.

ఇంటింటా సంక్షేమ కాంతులు

సాక్షి, నెట్‌వర్క్‌: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటివద్దా ప్రజలు ఆనందంతో స్వాగతం పలుకుతున్నారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో ఇంటింటా సంతోషం వెల్లివిరుస్తోందని చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ బుధవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.


పల్నాడు జిల్లా ఒప్పిచర్లలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


అనంతపురం జిల్లా గన్నెవారిపల్లి కాలనీలో మహిళకు లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


అన్నమయ్య జిల్లా భాకరాపేటలో పథకాల లబ్ధి బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి


కాకినాడ జిల్లా బంగారయ్యపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పూర్ణచంద్రప్రసాద్

తెరుచుకున్న దుర్గమ్మ ఆలయం


అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో రద్దీగా ఉన్న అంతరాలయం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): పాక్షిక సూర్యగ్రహణం అనంతరం బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి భక్తులకు అధికారులు అవకాశం కల్పించారు. ఉదయం 6 గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయం, మల్లేశ్వర స్వామి ఆలయం(బాలాలయం), ఇతర ఉపాలయాల ద్వారాలను అర్చకులు తెరిచారు. దేవతా మూర్తులకు స్నపనాభిషేకం, అర్చన, మహా నివేదన, హారతి ఇచ్చారు. ఈవో భ్రమరాంబ, అర్చకులు అమ్మవారి తొలి దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. ఆలయశుద్ధి, సంప్రోక్షణ నేపథ్యంలో అన్ని ఆర్జిత సేవలను దేవస్థానం రద్దు చేసింది. సాయంత్రం పంచహారతుల సేవ యథావిధిగా నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు సేవలో పాల్గొన్నారు.

29న పెద్ద శేష వాహనంపై మలయప్ప దర్శనం

తిరుమల: నాగులచవితి సందర్భంగా ఈ నెల 29న తిరుమలలో శ్రీ మలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి తిరుమాడ వీధుల్లో పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. ఆ రోజు రాత్రి 7 నుంచి 9 గంటల నడుమ పెద్దశేష వాహన సేవ జరగనుంది.

సర్వ దర్శనానికి 4 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. 4 కంపార్ట్‌మెంట్‌లు నిండి ఉన్నాయి. సర్వదర్శనానికి 4 గంటల సమయం పడుతోంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 25,549 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 9,764 మంది తలనీలాలు సమర్పించారు.

పక్కాగా పంటల బీమా

దిగుబడి ఆధారిత పంటలకు బీమా కంపెనీలు ఖరారు

- వాతావరణ ఆధారిత పంటల పరిహారం భారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వంపైనే
- మూడేళ్లలో రైతులకు రూ.6,884.84 కోట్ల బీమా పరిహారం చెల్లింపు
- ఈ–క్రాప్ డేటా ఆధారంగా రైతులందరికీ వర్తింపజేస్తున్న కేంద్రం
- ఏపీ బాటలో ఫసల్ బీమా యోజనలో మార్పులు



సాక్షి, అమరావతి: రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. దిగుబడి ఆధారిత పంటలకు ఇన్సూరెన్స్ కంపెనీలు ఖరారు కాగా వాతావరణ ఆధారిత పంటలపై కంపెనీలు ముందుకు రాకపోవడంతో గతంలో మాదిరిగానే నష్ట పరిహారం భారాన్ని పూర్తిగా భరించి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. మూడేళ్లుగా ఈ–క్రాప్ డేటా ఆధారంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. టీడీపీ హయాంలో ఐదేళ్లలో 30.85 లక్షల మందికి రూ.3,411.20 కోట్ల బీమా పరిహారం మాత్రమే చెల్లించగా 6.19 లక్షల మందికి ఎగ్గొట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గత సర్కారు ఎగ్గొట్టిన రూ.715.84 కోట్ల బకాయిలతో కలిపి మూడేళ్లలో 44.66 లక్షల మంది రైతులకు రూ.6,884.84 కోట్ల పరిహారాన్ని అందచేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ పారదర్శక విధానాలకు గుర్తింపుగా ఈ క్రాప్ డేటా ప్రామాణికంగా రైతులందరికీ పంటల బీమా వర్తింపచేసేలా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో కేంద్ర ప్రభుత్వం మార్పులు తెచ్చింది. 2022–23 సీజన్ నుంచి ప్రధాని ఫసల్ బీమాతో వైఎస్సార్ ఉచిత పంటల బీమాను అనుసంధానించి అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

ఆర్బీకేల్లో ఈ–క్రాప్ డేటా

గ్రామం, మండలం, జిల్లా యూనిట్‌గా నోటిఫై చేసిన దిగుబడి ఆధారిత 17 పంటలు, వాతావరణ ఆధారిత 8 పంటల బీమా కవరేజ్ కోసం సెప్టెంబర్‌లో ఇన్సూరెన్స్ కంపెనీలను టెండర్లకు ఆహ్వానించారు. దిగుబడి ఆధారిత పంటల కవరేజ్ కోసం బిడ్డింగ్‌లో పాల్గొన్న ఎల్–1 కంపెనీల్లో 18 కంపెనీలను ఎంపిక చేసి 9 క్లస్టర్లను అప్పగించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా ఈ క్రాప్ డేటాను ఈనెల 31వ తేదీ వరకు ఆర్బీకేల్లో ప్రదర్శించనున్నారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత తుది జాబితాను నవంబర్ 2వ తేదీన ప్రదర్శిస్తారు. తుది జాబితా ఆధారంగానే నోటిఫై చేసిన దిగుబడి ఆధారిత పంటల కవరేజ్ కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటాతో పాటు రైతుల వాటా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆయా ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లిస్తుంది. వాతావరణ ఆధారిత పంటల కవరేజ్ కోసం ఇన్సూరెన్స్ కంపెనీలు ముందుకు రాకపోవడంతో గతంలో మాదిరిగానే డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద క్లెయిమ్స్ చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది.

దిగుబడి ఆధారిత పంటలకు ఎంపికైన బీమా కంపెనీలు ఇవీ

క్లస్టర్ పరిధిలోని జిల్లాలు	ఇన్సూరెన్స్ కంపెనీ
నెల్లూరు, ప్రకాశం	- అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్
శ్రీకాకుళం, అన్నమయ్య, తూర్పు గోదావరి	- హెచ్‌డీఎఫ్‌సీ ఎర్‌గో జీఐసీ లిమిటెడ్
కర్నూలు, వైఎస్సార్, విజయనగరం	- ఎస్‌బీఐ, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్
వైఎస్సార్, కాకినాడ, పార్వతీపురం మన్యం	- అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా
అనంతపురం, ఏలూరు, గుంటూరు	- రిలయన్స్ జీఐసీ లిమిటెడ్
కోనసీమ, బాపట్ల	- రిలయన్స్, జీఐసీ లిమిటెడ్
అనకాపల్లి, పశ్చిమగోదావరి, తిరుపతి	- హెచ్‌డీఎఫ్‌సీ ఎర్‌గో
శ్రీసత్యసాయి, నంద్యాల, పల్నాడు, చిత్తూరు	- ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్
విశాఖపట్నం, కృష్ణా, ఎన్టీఆర్	- ఇఫ్కో టోక్యో జీఐసీ లిమిటెడ్

పైసా భారం పడకుండా పంటల బీమా

గత మూడేళ్ల మాదిరిగానే రైతులపై పైసా భారం పడకుండా ఈ–క్రాప్ డేటా ఆధారంగా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నాం. దిగుబడి ఆధారిత పంటలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా–ఫసల్ బీమా పథకం వర్తింపచేస్తుండగా వాతావరణ ఆధారిత పంటలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద పూర్తి పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనుంది.

– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం


ముత్తుకూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, మహిళలు

ముత్తుకూరు(శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా) : పదహారేళ్లుగా కలగా మిగిలిపోయిన మత్స్యకారేతర ప్యాకేజీని పంపిణీ చేయనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం ప్రజా ప్రతినిధులు, మహిళలు క్షీరాభిషేకం చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పెద్ద సంఖ్యలో చేరిన మహిళలు వైఎస్ జగన్ జిందాబాద్ అంటూ సీఎం చిత్రపటంపై పూలుజల్లారు. ఈ సందర్భంగా పార్టీ కన్వీనర్ మెట్ట విష్ణువర్ధనరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్ బూదూరు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు యల్లంగారి వెంకటేశ్వర్లు, షేక్ నవీద్ మాట్లాడారు. వైఎస్సార్ మత్స్యకారేతర ప్యాకేజీని మంజూరు చేయగా.. ఆయన తనయుడైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్యాకేజీ నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు.

నిధులిస్తేనే సకాలంలో పోలవరం పూర్తి

- పీపీఏ సీఈవోకు తెగేసిచెప్పిన జలవనరుల శాఖ కార్యదర్శి
- సీఎం జగన్ కోరిన విధంగా అడ్‌హాక్‌గా రూ.10 వేల కోట్లు ఇవ్వాలని వినతి
- ఈ నిధులపై కేంద్ర జల్ శక్తి శాఖతో చర్చిస్తామన్న సీఈవో
- భూసేకరణ, పునరావాసంపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రశంసలు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేసిన మేరకు అడ్‌హాక్‌గా రూ. 10 వేల కోట్లను విడుదల చేస్తేనే పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయగలుగుతామని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో చంద్రశేఖర్ అయ్యర్‌కు రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తేల్చి చెప్పారు. నిర్వాసితులకు నష్ట పరిహారాన్ని ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన రూ. 3 వేల కోట్లను రీయింబర్స్ చేయడంలో జాప్యం వల్ల ప్రభుత్వంపై భారం పడుతోందన్నారు. అడ్‌హాక్‌గా నిధుల విడుదలపై కేంద్ర జల్ శక్తి శాఖతో చర్చిస్తామని పీపీఏ సీఈవో చెప్పారు. భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసంలో రాష్ట్ర ప్రభుత్వం బాగా పనిచేస్తోందని అభినందించారు. పోలవరం ప్రాజెక్టు పురోగతి, ఈ సీజన్‌లో చేపట్టాల్సిన పనులపై రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డి తదితరులతో పీపీఏ సీఈవో బుధవారం వర్చువల్‌గా సమీక్షించారు. ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. దిగువ కాఫర్ డ్యామ్‌ను సంక్రాంతికి, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ ప్రాంతం వరద ఉద్ధృతికి ఏర్పడిన అగాధాలను పూడ్చేందుకు చేయాల్సిన పరీక్షలు, డయాఫ్రమ్ వాల్ పరీక్షలను జనవరికి పూర్తి చేస్తామని అధికారులు చెప్పారు. ఫిబ్రవరి ఆఖరుకు సీడబ్ల్యూసీ డిజైన్లు ఖరారు చేస్తే మార్చిలో ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు ప్రారంభిస్తామని, వరదల సమయంలోనూ పనులు కొనసాగిస్తామని ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి చెప్పారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తి చేయడానికి రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను ఈఎన్‌సీ వివరించారు. దీనికి పీపీఏ సీఈవో సంతృప్తి చెందారు. కాంపొనెంట్ వారీగా కాకుండా.. అంచనా వ్యయాన్ని పరిగణలోకి తీసుకుని రీయింబర్స్ చేయాలని అధికారులు కోరారు. 2017–18 ధరల ప్రకారం సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లకు ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ ఇచ్చి, ఆ మేరకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర జల్ శక్తి శాఖతో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని అయ్యర్ చెప్పారు.

రైతుల మద్దతు లేని కులవాద ఉద్యమం

759వ రోజు రిలే నిరాహార దీక్షలో మండిపడ్డ బహుజన నాయకులు



తాడికొండ: రైతుల మద్దతు లేని కులవాద అమరావతి ఉద్యమం నిలిపేయకపోతే ప్రజల నుంచి ఛీత్కారాలు తప్పవని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 759వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పలువురు మాట్లాడారు. ఒక రాజధాని పేరుతో జరుగుతున్న కులవాదుల కుట్రలు సాగవని, రైతుల మద్దతు లేకుండా అమరావతి పేరుతో పెయిడ్ ఆర్టిస్టులతో వెళుతున్న డ్రామా కంపెనీ అని ప్రజలకు తెలిసిపోయిందన్నారు. కోర్టు తీర్పుతో పాదయాత్రలో ఉన్న పెయిడ్ ఆర్టిస్టుల బండారం బట్టబయలైందని చెప్పారు. అమరావతి పేరుతో రాజధానిలో బాబు చేసిన అవినీతిని వెలికితీసి అరెస్టు చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతుందని చెప్పారు. ఆ అక్కసుతోనే ఓ సామాజిక వర్గం అడ్డుకోవాలని చూస్తుందని మండిపడ్డారు. మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వే రైతులకు వరం

ఏపీ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి



అమడగూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వే రైతుల పాలిట వరంలా మారిందని ఏపీ లోకాయుక్తా జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా అమడగూరు మండలంలోని చినగానిపల్లిలో విలేకరులతో మాట్లాడారు. సుమారు వందేళ్ల తర్వాత చేపట్టిన భూసర్వేతో రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. భూసర్వేలో తర్వాత అందే పట్టాతో రైతులకు భూమిపై శాశ్వత హక్కు దక్కుతుందని తెలిపారు. అలాగే పట్టా పొందిన తర్వాత ఆయా భూముల్లో ఎలాంటి లోటుపాట్లున్నా, ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు వికేంద్రీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే కర్నూలులోనే హైకోర్టు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. లోకాయుక్తకు వచ్చే ఫిర్యాదులపై ప్రభుత్వం ఎలాంటి ఒత్తిళ్లు ఉండవని, న్యాయపరంగానే సమస్యలను పరిష్కరిస్తామన్నరు. కదిరి ఆర్డీవో రాఘవేంద్ర, డీఎస్పీ కోలార్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీ చైర్మన్‌గా చంద్రశేఖర్ అయ్యర్

- 1న బాధ్యతల స్వీకరణ.. 30న పదవీ విరమణ
- తదుపరి చైర్మన్‌గా వోహ్రా

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వాటర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ విభాగం సభ్యుడు చంద్రశేఖర్ అయ్యర్‌ను సీడబ్ల్యూసీ చైర్మన్‌గా కేంద్రం నియమించింది. ప్రస్తుత చైర్మన్ డాక్టర్ ఆర్కే గుప్తా ఈనెల 31న పదవీ విరమణ చేయనున్నారు. నవంబర్ 1న అయ్యర్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన ఈ పదవిలో నెల రోజులే ఉంటారు. నవంబర్ 30న పదవీ విరమణ చేస్తారు. అయ్యర్ తర్వాత సీనియర్ అధికారి, సీడబ్ల్యూసీ డిజైన్, రీసెర్చ్ విభాగం సభ్యుడు కుశ్వీందర్ వోహ్రాను చైర్మన్‌గా కేంద్రం నియమించనుంది. డిసెంబర్ 1న వోహ్రా బాధ్యతలు స్వీకరిస్తారు.

'ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి'

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకుడు కేశవరపు జాలిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వారు బుధవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. పీఎఫ్ లోన్లు వెంటనే మంజూరు చేయడంతో పాటు ఫేషియల్ హాజరును నిమిషం నుంచి ఐదు నిమిషాల వరకు ఆలస్యంగా నమోదు చేయడంపై ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టర్లు సక్రమంగా సరఫరా చేయక మధ్యాహ్న భోజన పథకంలో గుడ్లు ఇవ్వకపోవడంపై హెచ్ఎంలను బాధ్యులను చేయడం సరికాదని వారు పేర్కొన్నారు.

అమెరికాలో ట్రక్కును ఢీకొన్న కారు

- తెలుగు రాష్ట్రాలకు చెందిన ముగ్గురు మృతి
- మృతుల్లో ఒకరు నల్లగొండ జిల్లా వాసి
- మరొకరిది వరంగల్, ఇంకొకరిది తూర్పుగోదావరి


ప్రేమ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)


పావని (ఫైల్)

రామగిరి(నల్లగొండ)/వరంగల్ చౌరస్తా/కడియం: ఉన్నత చదువుల కోసం యూఎస్ వెళ్లిన ముగ్గురు తెలుగు విద్యార్థులు రెండు నెలల్లోనే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వీరు ప్రయాణిస్తున్న కారు.. ట్రక్కును ఢీకొనడంతో ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు. వీరిలో నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం గోదోరిగూడెం గ్రామానికి చెందిన గోదా ప్రేమ్‌కుమార్‌రెడ్డి(26)తో పాటు వరంగల్ నగరంలోని గిర్మాజీపేటకు చెందిన ఎంఎస్ విద్యార్థిని గుళ్లపెల్లి పావని(22), ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకకు చెందిన పాటంశెట్టి సాయి నరసింహ (25) ఉన్నారు. గోదోరిగూడేనికి చెందిన లక్ష్మారెడ్డి, లలిత దంపతుల పెద్ద కుమారుడు ప్రేమ్‌కుమార్ అమెరికాలోని న్యూయార్క్ సాక్రెడ్‌హార్ట్ యూనివర్సిటీలో ఎంఎస్ చదువుతున్నారు. ఆగస్టు 23న అమెరికాకు వెళ్లారు. ఇదిలా ఉండగా, సోమవారం స్నేహితులతో కలిసి ప్రేమ్‌కుమార్ విహారయాత్రకు వెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. దట్టమైన మంచు కురుస్తుండటంతో సరిగా కనిపించక ఎదురుగా వస్తున్న ట్రక్కును వీరి కారు ఢీకొట్టింది. కారులో ఉన్న ఏడుగురిలో ప్రేమ్‌కుమార్, పావని, సాయి నరసింహ అక్కడికక్కడే మృతిచెందారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన మనోజ్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు గాయపడ్డారు. చదువు కోసం అమెరికా వెళ్లి రెండు నెలలు గడవక ముందే ప్రేమ్ మరణించడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కాగా, అమెరికా నుంచి మృతదేహాలను తీసుకురావడానికి సంప్రదింపులు జరుగుతున్నాయి. స్వదేశానికి రావడానికి నాలుగు రోజులు పట్టే అవకాశం ఉంది.

కొద్ది నెలల కిందటే అమెరికాకు..

గిర్మాజీపేటకు చెందిన గుళ్లపెల్లి రమేశ్, కల్పన దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రమేశ్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో అడ్తి దుకాణాల్లో అకౌంటెంట్‌గా పనిచేస్తుండగా, తల్లి కల్పన ప్రైవేట్ స్కూల్ టీచర్. పెద్ద కుమార్తె వాసవి ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. పావని ఎంఎస్ కోసం రెండు నెలల కిందట అమెరికా వెళ్లింది. పావని దీపావళి రోజు కుటుంబ సభ్యులతో మొబైల్ ఫోన్‌లో మాట్లాడినట్లు బంధువులు తెలిపారు. కాగా, బుర్రిలంకకు చెందిన సాయి నరసింహ 3 నెలల క్రితమే ఎంఎస్ చదివేందుకు యూఎస్ వెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన ఐశ్వర్య ఈ ఘటనలో గాయపడి చికిత్స పొందుతోంది.

చిన్న దుకాణానికి రూ.1.72 కోట్ల లీజు

ఇండోర్: గుడి ఆవరణలో కేవలం పూలు, పూజా సామగ్రి, ప్రసాదాలు విక్రయించే 69.50 చదరపు అడుగుల వైశాల్యమున్న చిన్నపాటి దుకాణాన్ని ఓ వ్యాపారి రూ.1.72 కోట్లకు 30 ఏళ్లపాటు లీజుకు దక్కించుకున్నాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లోని ప్రఖ్యాత ఖజ్రానా గణేశ్ ఆలయ కాంప్లెక్స్‌లో ఈ లీజు వ్యవహారం చోటుచేసుకుంది. '1–ఎ' దుకాణాన్ని లీజుకు ఇవ్వడానికి ఆలయ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. రూ.30 లక్షలు కనీస మొత్తంగా నిర్ణయించారు. వేలం పాటలో ఇది ఏకంగా రూ.1.72 కోట్లకు చేరింది. అంటే ఒక్కో చదరపు అడుగు స్థలం రూ.2.47 లక్షలు పలికింది. వాణిజ్య స్థలం లీజు కోసం ఈ స్థాయిలో ధర పలకడం అరుదైన సంఘటన అని చెప్పొచ్చు. ఖాజ్రానా వినాయక ఆలయానికి దర్శించుకొనేందుకు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు భారీగా తరలివస్తుంటారు. ఇక్కడ వ్యాపారం భారీగానే జరుగుతోంది.

ముంచుకొస్తున్న మాంద్యం

వచ్చే ఏడాదికల్లా ప్రపంచాన్ని కమ్మేస్తుంది: ఆర్థికవేత్తలు

- సంపన్న దేశాల్లోనూ ఆర్థిక వృద్ధి నేల చూపులు
- ఆ దెబ్బకు చిన్న దేశాల పుట్టి మునగడం ఖాయం

ప్రపంచాన్ని మాంద్యం మేఘాలు కమ్ముకుంటున్నాయి. వచ్చే ఏడాదికల్లా ఆర్థిక మాంద్యం అతలాకుతలం చేసేలా కన్పిస్తోంది. కరోనా దెబ్బ నుంచి కోలుకోకముందే వచ్చిపడ్డ రష్యా–ఉక్రెయిన్ యుద్ధం తదితరాలతో ఆర్థిక వృద్ధి క్రమంగా కుంటుపడుతూ ప్రధాన దేశాలన్నీ మాంద్యం వైపు అడుగులేస్తున్నాయి....

డి.శ్రీనివాసరెడ్డి


ప్రపంచం ఆర్థిక మాంద్యం బారిన పడటం ఖాయమని ఫ్లోరిడాకు చెందిన నెడ్ డేవిస్ రీసెర్చ్ చెబుతోంది. మాంద్యాన్ని అంచనా వేయడంలో ఈ సంస్థ అందెవేసిన చేయి. దాని లెక్క ప్రకారం వచ్చే ఏడాదికల్లా ప్రపంచం మాంద్యం గుప్పెట్లో చిక్కేందుకు 98.1 శాతం ఆస్కారముంది. వాల్‌స్ట్రీట్ జర్నల్ జూలైలో చేసిన సర్వేలో మాంద్యం తప్పదని 49 శాతం ఆర్థికవేత్తలు పేర్కొనగా అక్టోబర్‌లో వారి సంఖ్య 63 శాతానికి పెరిగింది! 12 నెలల్లోపే అమెరికా మాంద్యం కోరల్లో చిక్కడం ఖాయమని సర్వే తేల్చింది. వర్ధమాన దేశాలపై ఇది సుదీర్ఘ ప్రభావమే చూపవచ్చని ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు డేవిడ్ మాల్పాస్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరోనా, యుద్ధం, వాతావరణ విపరిణామాలు ప్రపంచాన్ని అంధకారంలోకి నెడుతున్నాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి ఎండీ క్రిస్టలినా జార్జివా హెచ్చరించారు.

కుంటినడకన ఆర్థికం...

చాలా దేశాల్లో జీడీపీ వృద్ధిరేటు నానాటికీ పడిపోతోంది. 2022లో ప్రపంచ ఆర్థిక పురోగతి రేటు 6.1 శాతముంటే 2023 నాటికి ఏకంగా సగానికి సగం పడిపోయి 3.2 శాతానికి పరిమితం కావచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది. సంపన్న దేశాల ఆర్థిక వృద్ధి కూడా నేల చూపులే చూస్తోంది. యూరప్ జీడీపీ 1.2 శాతానికి, బ్రిటన్ కేవలం 0.3, ఫ్రాన్స్ 0.7కు పరిమితం కావచ్చని అంచనా. సవరించిన వృద్ధి రేట్ల ప్రకారం చూసినా అమెరికా 1 శాతం, చైనా 3.2 శాతంతో సరిపెట్టుకునేలా ఉన్నాయి. 2016తో పోలిస్తే ప్రపంచ జీడీపీ 23 శాతం పెరగాలన్నది అంచనా కాగా కరోనా, యుద్ధం తదితరాల దెబ్బకు 17 శాతానికే పరిమితమైంది. ఇలా పడిపోయిన ఉత్పాదకత విలువ ఏకంగా 17 లక్షల కోట్ల డాలర్లు. అంటే ప్రపంచ ఆదాయంలో ఏకంగా 20 శాతం!

ఎందుకీ దుస్థితి...?

కరోనా, యుద్ధం నేపథ్యంలో విపరీతంగా పెరిగిపోయిన ధరలకు కళ్లెం వేసేందుకు ఈ ఏడాది ఏకంగా 90 దేశాల సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచేశాయి. ఈ దెబ్బకు ఉత్పాదకత తగ్గడంతో పెట్టుబడులు, వినియోగం పడిపోయి మాంద్యం ముంచుకొస్తోంది. ధరల అదుపు కోసమని పదేపదే వడ్డీ రేట్లు పెంచితే మాంద్యం బారిన పడక తప్పదని జార్జ్ వాషింగ్టన్ వర్సిటీ ప్రొఫెసర్ పావ్‌లిన్ టియెన్ అన్నారు. అమెరికా ఫెడరల్ బ్యాంకు వడ్డీ రేట్ల పెంపుతో 90 దేశాల కరెన్సీ విలువలు పతనమయ్యాయి. గతేడాది 125.7గా ఉన్న ఆహారోత్పత్తుల ధరల సూచీ ఈ ఏడాది 146.94 పాయింట్లకు పెరిగింది. మాంద్యం దెబ్బకు కంపెనీలు నియామకాలకు కత్తెర వేస్తున్నాయి. అమెరికాలో నిరుద్యోగిత వచ్చే డిసెంబర్ నాటికి 3.7 శాతానికి, 2023 జూన్‌కల్లా 4.7కు పెరుగుతుందని అంచనా.



మాంద్యమంటే...

మామూలు పరిభాషలో వరుసగా రెండు త్రైమాసికాలు గనక జీడీపీ తిరోగమనంలో సాగితే ఆ దేశంలో మాంద్యంలోకి జారుకున్నట్టు పరిగణిస్తారు.

ఇవీ సంకేతాలు...

- సుదీర్ఘంగా సాగేలా కన్పిస్తున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం
- డాలర్ ముందు కుదేలవుతున్న అన్ని దేశాల కరెన్సీలు
- చుక్కలనంటుతున్న ద్రవ్యోల్బణం
- వడ్డీరేట్లను పెంచేస్తున్న అన్ని దేశాల సెంట్రల్ బ్యాంకులు
- నియామకాలు బాగా తగ్గిస్తున్న కార్పొరేట్ సంస్థలు
- నానాటికీ మందగిస్తున్న ప్రపంచ ఆర్థిక వృద్ధి

మనకూ తిప్పలే...

మన జీడీపీ వృద్ధి రేటు ఈ ఏడాది 6.8 శాతం ఉంటుందని, 2023లో 6.1 శాతానికి తగ్గుతుందని ఐఎంఎఫ్ నివేదిక పేర్కొంది. ఇతర దేశాలతో పోలిస్తే ఇది మెరుగేనని కితాబిచ్చింది. కానీ మాంద్యం ఎఫెక్ట్ భారత్‌పైనా గట్టిగానే ఉంటుందని అంచనా. అమెరికాకు మన ఎగుమతులు 2011 10.1 శాతముంటే ఇప్పుడు 18.1 శాతానికి పెరిగాయి. మన సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో ఏకంగా 54.8 శాతం అమెరికాకే వెళ్తున్నాయి. అగ్రరాజ్యం మాంద్యంలో చిక్కితే వీటిపై గట్టి ప్రభావమే పడుతుంది. మన విదేశీ మారక నిల్వలు వరుసగా తొమ్మిదో వారమూ తిరోగమన దిశలో ఉన్నట్టు అక్టోబర్ 7నాటి నివేదికలో రిజర్వ్ బ్యాంకే పేర్కొంది. అమెరికాతో భారత వాణిజ్య లోటు 3.8 శాతానికి ఎగబాకుతుందని అంచనా!

క్లుప్తంగా...

స్వదేశీ ఉత్పత్తులు వాడండి

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ: దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని, దేశం అభివృద్ధి చెందాలంటే స్వయం స్వావలంబన సాధించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. స్వదేశీ ఉత్పత్తుల వాడకంతోనే మన కళలు, సంస్కృతి, నాగరికత సజీవంగా ఉంటాయని చెప్పారు. జైన గురువు విజయ్ వల్లభ్ సురీశ్వర్ 150వ జయంతి బుధవారం జరిగిన కార్యక్రమంలో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. స్వదేశీ, స్వయం సమృద్ధి మన నినాదాలు కావాలన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా యుద్ధం, హింస, ఉగ్రవాదం వంటి సంక్షోభాలు పెరుగుతున్నాయని, జైన్ గురువుల బోధనలు వీటికి పరిష్కార మార్గమని అభిప్రాయపడ్డారు. సురీశ్వర్ స్మారక పోస్టల్ స్టాంప్, నాణాన్ని అధికారులు విడుదల చేశారు.

ఇక జీఎం ఆవాలు !

న్యూఢిల్లీ : జన్యుపరంగా మార్పులు చేర్పులు చేసిన ఆవాలకి పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రయిజల్ కమిటీ (జీఈఏసీ) సిఫారసులు చేసింది. ఈ ఆవాలు సాగులోకి వస్తే వాణిజ్య పంటగా రూపాంతరం చెందడానికి దారులు పడతాయని నిపుణులు భావిస్తున్నారు. జీఎం ఆవాలు సాగులోకి వస్తే ఆహారభద్రతపైన, ప్రజారోగ్యంపైన వ్యతిరేక ప్రభావం చూపిస్తుందని ఇప్పటికీ పర్యావరణ సంరక్షకులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో పని చేసే జీఈఏసీ పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సిఫారసు చేయడం గమనార్హం. జన్యుపరంగా మార్పులు చేసి పండించే పంటల్ని నియంత్రించే జీఈఏసీ అక్టోబర్ 18న సమావేశమైన మస్టర్డ్ హైబ్రిడ్ డీఎంహెచ్–11 విత్తనాల అభివృద్ధికి అవసరమైన పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని, వాణిజ్యపరంగా ఆ విత్తనాలను విడుదల చేయడానికి ముందు మరిన్ని పరీక్షలు నిర్వహించాలని సిఫారసు చేసింది.

'జిల్లాకొక ప్రత్యేక అవినీతి వ్యతిరేక కోర్టు'పై...

31న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో 'ప్రత్యేక అవినీతి వ్యతిరేక కోర్టులు' ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై ఈ నెల 31న సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్, న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.ఆర్.భట్, జస్టిస్ బేలా ఎం.త్రివేదితో కూడిన ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని విచారించనుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో వ్యాజ్యాల జాబితాను అప్‌లోడ్ చేశారు. మనీ లాండరింగ్, పన్నుల ఎగవేత వంటి ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల విచారణను ఏడాదిలోగా పూర్తి చేయడానికి ప్రత్యేక అవినీతి వ్యతిరేక కోర్టులు నెలకొల్పాలని కోరుతూ సీనియర్ అడ్వొకేట్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు.

జ్యూస్ కాదు.. ప్లేట్‌లెట్లే!

ప్రయాగ్‌రాజ్: డెంగ్యూ బాధితుడికి ప్లేట్‌లెట్ల బదులు బత్తాయి రసం ఎక్కించినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేట్ ఆసుపత్రి వ్యవహారంపై అధికారులు దర్యాప్తు పూర్తిచేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లోని గ్లోబల్ హాస్పిటల్‌లో ప్రదీప్ పాండే అనే రోగికి బత్తాయి రసం ఎక్కించినట్లుగా ఇటీవల ఓ వీడియో దేశవ్యాప్తంగా వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. రోగిని మరో ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ ఆదేశాల మేరకు ఈ నెల 20న ఆసుపత్రిని మూసివేశారు. గ్లోబల్ ఆసుపత్రి నుంచి నమూనాలు సేకరించి, పరీక్షించామని ప్రయాగ్‌రాజ్ జిల్లా మేజిస్ట్రేట్ సంజయ్‌కుమార్ ఖత్రీ చెప్పారు. రోగికి బత్తాయి రసం కాదు, ప్లేట్‌లెట్స్ ఎక్కించినట్లు తేలిందన్నారు. కానీ, ఈ విషయంలో సరైన ప్రమాణాలు పాటించలేదని, అందుకే రోగిలో రక్తస్రావం జరిగిందని, ఆసుపత్రిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా, గ్లోబల్ ఆసుపత్రి భవనాన్ని చట్టవిరుద్ధంగా నిర్మించారని, ఈ నెల 28వ లోగా పూర్తిగా ఖాళీ చేయాలని ప్రయాగ్‌రాజ్ డెవలప్‌మెంట్ అథారిటీ(పీడీఏ) నోటీసులిచ్చింది.

ఇరాన్‌లో షియా మసీదులో కాల్పులు...

15 మంది దుర్మరణం

దుబాయ్: ఇరాన్‌లో షియా వర్గానికి చెందిన షా చెరాగ్ మసీదులో దుండగులు బుధవారం విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 15 మంది మరణించారని, దాదాపు 40 మంది గాయపడ్డారని అధికారులు వెల్లడించారు.

పగ్గాలు చేపట్టిన ఖర్గే



ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాహుల్. చిత్రంలో సోనియా

నా బరువు దిగింది: సోనియా

- కాంగ్రెస్‌ను ఖర్గే మరింతగా పటిష్టపరుస్తారని వ్యాఖ్యలు
- సాధారణ కార్యకర్తకు అత్యున్నత గౌరవమిది: ఖర్గే
- 'భయపడొద్దు' అన్న రాహుల్ నినాదంతో ముందుకు పోదాం
- కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు పిలుపు.. బీజేపీపై నిప్పులు

న్యూఢిల్లీ: సహచర నాయకుడు శశిథరూర్‌ను ఓడించి ఇటీవలే కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన సీనియర్ నాయకుడు మల్లికార్జున ఖర్గే (80) బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దాదాపు రెండు దశాబ్దాలుగా పదవిలో కొనసాగుతున్న తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ (75) ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు లాంఛనంగా బాధ్యతలు అప్పగించారు. అయితే, ''అధ్యక్ష బాధ్యతల బరువు నేటితో దిగిపోయింది. నాకు చాలా ఊరటగా ఉంది'' అంటూ వ్యాఖ్యలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు! మార్పు సహజమంటూ కాస్త వేదాంత ధోరణిలో మాట్లాడారు. కార్యక్రమంలో రాహుల్‌గాంధీతో పాటు పార్టీ అగ్ర నేతలంతా పాల్గొన్నారు. అధ్యక్షునిగా ఎన్నికైనట్టు ఖర్గేకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన కాస్త భావోద్వేగానికి లోనయ్యారు. ''ఒక మామూలు కార్యకర్త కుమారుడైన అతి సాధారణ కార్యకర్తను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కాంగ్రెస్ కుటుంబం మొత్తానికీ కృతజ్ఞతలు. ఇది గొప్ప గౌరవం. నిరంతరం కష్టించి పని చేస్తా. ప్రతి కార్యకర్తకూ గొంతుకగా మారతా. పార్టీలో అన్ని స్థాయిల్లోనూ నాయకత్వాన్ని పెంపొందిస్తా'' అని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఖర్గేను సోనియా స్వయంగా అధ్యక్ష కార్యాలయంలోకి తోడ్కొని వెళ్లి కుర్చీలో కూర్చోబెట్టారు. తన పక్క కుర్చీలో కూర్చోవాల్సిందిగా ఖర్గే కోరగా సున్నితంగా తిరస్కరించారు.

'భయపడొద్దు' నినాదంతో ముందుకు

తన ముందున్న సవాళ్ల గురించి పూర్తి అవగాహన ఉందని ఖర్గే అన్నారు. పార్టీగా కాంగ్రెస్‌కు ఇది కష్ట కాలమేనని అంగీకరించారు. అయితే కార్యకర్తలు తమలో ఉన్న భయాలను పారదోలితే ఎంతటి సామ్రాజ్యమైనా వారిముందు మోకరిల్లుతుందన్నారు. రాహుల్ ఇచ్చిన 'భయపడొద్దు' నినాదం స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో బీజేపీని ఓడించేందుకు నేతలు, కార్యకర్తలూ స్వరశక్తులూ ధారపోయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. పార్టీలో 50 శాతం పదవులను 50 ఏళ్లలోపు వయసు వారికే ఇవ్వడం వంటి నిర్ణయాలతో ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను సంపూర్ణంగా అమలు చేసి సమూల మార్పులు తేవాల్సి ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలపై కళ్లు మూసుకుంటూ ఆశ్రిత పెట్టుబడిదారీ మిత్రులకు సర్వం దోచిపెడుతోందని మండిపడ్డారు. ''గాడ్సేను దేశభక్తునిగా, గాంధీని దేశద్రోహిగా చిత్రిస్తున్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని మార్చి సంఘ్ పరివార్ రాజ్యాంగం తెచ్చే ప్రయత్నం జరుగుతోంది'' అంటూ దుయ్యబట్టారు. ఈ అబద్ధాలను బట్టబయలు చేసి, మోసాలను ఎండగట్టి, విద్వేష ప్రచారాలను తుత్తునియలు చేసి తీరతామన్నారు. పార్టీని ఖర్గే మరింత పటిష్టపరుస్తారని, స్ఫూర్తిదాయకంగా నడుపుతారని సోనియా విశ్వాసం వెలిబుచ్చారు. ఇంతకాలం తనకు సహకరించిన నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలోనూ కాంగ్రెస్ ఎన్నో సవాళ్లు ఎదుర్కొందని, ఓటమిని మాత్రం ఎన్నడూ అంగీకరించలేదని అన్నారు. దేశ ప్రజాస్వామిక సూత్రాలకే పొంచి ఉన్న పెను ముప్పును దీటుగా ఎదుర్కోవడం ఇప్పుడు పార్టీ ముందున్న పెద్ద సవాలని అభిప్రాయపడ్డారు. అధికారం కోసమే రాజకీయాలు చేసే ఈ కాలంలో సోనియా మాత్రం స్వార్థరహితంగా పార్టీని ముందుకు నడిపారంటూ ఖర్గే కొనియాడారు.

సునాక్‌కు సోనియా లేఖ

బ్రిటన్ ప్రధానిగా ఎన్నికైన రిషి సునాక్‌ను సోనియా అభినందించారు. ఇది భారతీయులందరికీ గర్వకారణమంటూ ఆయనకు లేఖ రాశారు. ఆయన హయాంలో ఇరు దేశాల సంబంధాలు మరింత పటిష్టమవుతాయని ఆశాభావం వెలిబుచ్చారు.

ఆఫీస్ బేరర్ల రాజీనామాలు...

47 మందితో స్టీరింగ్ కమిటీ

47 మందితో కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీని నూతన అధ్యక్షుడు ఖర్గే నియమించారు. కాంగ్రెస్ నూతన వర్కింగ్ కమిటీ ఏర్పాటయ్యే దాకా దాని బాధ్యతలను ఖర్గే సారథ్యంలోని ఈ కమిటీ చూస్తుంది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, పార్టీ మాజీ అధ్యక్షులు సోనియా, రాహుల్‌తో పాటు గత సీడబ్ల్యూసీ సభ్యుల్లో అత్యధికులకు కమిటీలో చోటు దక్కింది. ప్రియాంక, ఏకే ఆంటోనీ, అంబికా సోని, ఆనంద్ శర్మ, కేసీ వేణుగోపాల్, రణ్‌దీప్ సుర్జేవాలా, దిగ్విజయ్‌సింగ్, టి.సుబ్బరామిరెడ్డి తదితరులు కమిటీలో ఉన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుల్లో మాత్రం ఎవరికీ చోటు దక్కలేదు. కొత్త టీములను ఏర్పాటు చేసుకునేందుకు ఖర్గేకు వీలు కల్పిస్తూ అంతకుముందు సీడబ్ల్యూసీ సభ్యులు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు తదితర ఆఫీసు బేరర్లంతా ఆయనకు లాంఛనంగా రాజీనామాలు సమర్పించారు. అధ్యక్షునిగా ఖర్గే ఎన్నికను ఆమోదించేందుకు వచ్చే మార్చిలో పార్టీ ప్లీనరీ జరిగే అవకాశముంది. ఖర్గే సారథ్యంలో జరిగిన పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీలో గుజరాత్‌లో అభ్యర్థుల ఎంపికపై చర్చించారు.

కరెన్సీ నోట్లపై లక్ష్మీ, గణేశుడి చిత్రాలు

- ఆర్థిక వ్యవస్థ మెరుగవుతుంది
- మోదీ, కేంద్రానికి కేజ్రీవాల్ సూచన



న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెంది, భారత్ సంపన్న దేశంగా మారడానికి కరెన్సీ నోట్లపై లక్ష్మీ, గణేశుడి చిత్రాలు ముద్రించాలని ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్రానికి సూచించారు. ''ప్రస్తుతం దేశ ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగా లేదు. పూర్వ వైభవం రావాలంటే ఎన్నో ప్రయత్నాలు చేయాలి. దేవుళ్లు, దేవతల ఆశీస్సులు కూడా కావాలి'' అని బుధవారం మీడియాతో అన్నారు. నోట్లపై గాంధీ ఫొటో కొనసాగిస్తూనే మరోవైపు లక్ష్మీ, గణేశుడి ఫొటోలూ ముద్రించాలని మోదీకి, కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ''ప్రతినెలా కొత్త నోట్లు ముద్రిస్తూనే ఉండాలి. అప్పుడే అవి ఎక్కువ సంఖ్యలో చెలామణిలోకి వస్తాయి'' అన్నారు. చెలామణిలో ఉన్న నోట్లను మార్చాలని కోరడం లేదన్నారు. తన సూచన ఎవరికీ వ్యతిరేకం కాదని, ముస్లిం దేశమైన ఇండోనేషియాలో కరెన్సీ నోట్లపై గణేశుడి చిత్రాలు ముద్రించారని గుర్తుచేశారు. ఇండియా ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటోందని, అమెరికా డాలర్‌తో పోలిస్తే మన రూపాయి విలువ క్రమంగా పడిపోతోందని, సామాన్య ప్రజలు కష్టాల్లో చిక్కుకుంటున్నారని కేజ్రీవాల్ ఆవేదన వ్యక్తం చేశారు. దీపావళి పండుగ సందర్భంగా లక్ష్మీ, గణేశుడికి పూజలు చేస్తుండగా, కరెన్సీ నోట్లపై వారి చిత్రాలను ముద్రించాలన్న ఆలోచన తనకు వచ్చిందన్నారు. దేవుళ్ల చిత్రాలను నోట్లపై ప్రింట్ చేస్తే వారి ఆశీర్వచనాలు మన దేశానికి లభిస్తాయని తెలిపారు.

కేజ్రీవాల్ హిందూ వ్యతిరేకి: బీజేపీ

కరెన్సీ నోట్లపై దేవుళ్ల చిత్రాలను ముద్రించాలన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వినతిని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా బుధవారం తప్పుపట్టారు. ఆమ్ ఆద్మీ పార్టీ హిందూ వ్యతిరేక వైఖరి, ఢిల్లీలో ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కేజ్రీవాల్ రాజకీయ డ్రామాలకు తెరతీశారని మండిపడ్డారు. హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసం తనను తాను హిందువుగా చిత్రీకరించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించారు. యూ–టర్న్ రాజకీయాలు ఆయనకు అలవాటేనని ఎద్దేవా చేశారు. దీపావళి సందర్భంగా బాణాసంచా కాలిస్తే శిక్షిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ప్రజలను హెచ్చరించిందని అన్నారు. ఆ పార్టీ నాయకుడు రాజేంద్రపాల్ గౌతమ్ ఇటీవల హిందూ దేవతలను అవమానించారని తెలిపారు. అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణాన్ని కేజ్రీవాల్ గతంలో వ్యతిరేకించారని గుర్తుచేశారు. హిందుత్వ అంటే గిట్టని ఆయన ఇప్పుడు అధికారంపై యావతో లక్ష్మీ, గణేశుల భక్తుడి మారిపోయారని విమర్శించారు. హిందూ వ్యతిరేక ముఖాన్ని దాచుకొనేందుకు కేజ్రీవాల్ చేసిన ప్రయత్నం ఘోరంగా విఫలమైందని సంబిత్ పాత్రా వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

కేరళలో గవర్నర్ వర్సెస్ సీఎం

తిరువనంతపురం: కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి, గవర్నర్ అరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు వివాదం ముదురుతోంది. ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్ ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొట్టేలా వర్సిటీ విద్యార్థుల దగ్గర ప్రసంగాలు చేశారని, ఆయనపై రాజ్యాంగపరమైన చర్యలు తీసుకోవాలని సీఎం పినరయి విజయన్‌కు గవర్నర్ సూచించారు. ఆర్థిక మంత్రిపై తాను విశ్వాసం కోల్పోయానని, ఆయన్ను పదవి నుంచి తొలగించాలన్న అర్థం వచ్చేలా బుధవారం లేఖ రాశారు. గవర్నర్ డిమాండ్‌ను సీఎం తోసిపుచ్చారు. యూపీ నుంచి వచ్చే విద్యార్థులకు కేరళలో పరిస్థితులు అర్థం కావడం సంక్లిష్టంగా ఉంటుందని ఈ నెల 18న కేరళ వర్సిటీలో విద్యార్థుల సమావేశంలో బాలగోపాల్ అన్నారు. ''మంత్రి తన ప్రమాణాన్ని మరిచారు. దేశ ఐక్యత, సమగ్రతలను తక్కువ చేసి చూపిస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అలాంటి వ్యక్తి పదవిలో ఉండకూడదు. ఆయన నా విశ్వాసాన్ని కోల్పోయారు'' అంటూ లేఖలో పేర్కొన్నారు. మంత్రిపై తనకు పరిపూర్ణ విశ్వాసముందంటూ సీఎం ఘాటుగా బదులిచ్చారు. ఆయనను తప్పించడానికి ఏ కారణాలూ లేవన్నారు. కేరళలోని తొమ్మిది విశ్వవిద్యాలయాల్లో వీసీల నియామకం అంశంలో ఇప్పటికే ప్రభుత్వం, రాజ్‌భవన్ మధ్య ఘర్షణాత్మక వాతావరణం నెలకొంది.

రష్యా అణు యుద్ధ సన్నద్ధత!

మిలటరీ డ్రిల్స్‌ను స్వయంగా పరిశీలించిన అధ్యక్షుడు పుతిన్

మాస్కో: ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయిలో పైచేయి సాధించడమే లక్ష్యంగా రష్యా అధినేత పుతిన్ వ్యూహాలకు పదును పెడుతున్నారు. బుధవారం తమ సైనికుల యుద్ధ సన్నద్ధతను ఆయన పుతిన్ స్వయంగా పరిశీలించారు. రష్యా వ్యూహాత్మక అణు దళాలు బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైళ్లతో డ్రిల్స్ నిర్వహించాయి. ఉక్రెయిన్‌పై అణ్వాయుధాల ప్రయోగానికి రష్యా సేనలు సన్నద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఈ డ్రిల్స్ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒకవేళ తమ దేశంపై అణు దాడి జరిగితే గట్టిగా తిప్పికొట్టాలన్నదే తమ ఉద్దేశమని రష్యా రక్షణ శాఖ మంత్రి సెర్గీ షోయిగు చెప్పారు. తాజాగా ఎక్సర్‌సైజ్‌లో భాగంగా ఉత్తర ప్లెసెట్స్క్ లాంచ్ సైట్ నుంచి ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. కామ్చాట్కా ద్వీపంలో అణు జలాంతర్గామి ద్వారా సినేవా ఐసీబీఎం క్షిపణిని పరీక్షించారు. అలాగే టూ–95 స్ట్రాటజిక్ బాంబర్ల సాయంతో క్రూయిజ్ క్షిపణులను ఫైర్‌టెస్టు చేశారు. అన్ని క్షిపణులు నిర్దేశిత లక్ష్యాలను చేరుకున్నాయని రష్యా ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. మరోవైపు నాటో కూటమి ఉత్తర యూరప్ ప్రాంతంలో వార్షిక మిలటరీ విన్యాసాలు నిర్వహిస్తోంది. ఈ నెల 30 దాకా ఈ విన్యాసాలు కొనసాగుతాయి. అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యం కలిగిన ఎయిర్‌క్రాఫ్ట్‌లు, అమెరికాకు చెందిన లాంగ్–రేంజ్ బి–52 బాంబర్లు సైతం ఇందులో పాల్గొంటున్నాయి. పరిస్థితి చెయ్యి దాటితే అణ్వస్త్రాల ప్రయోగానికి వెనుకాడబోమని పుతిన్ ఇప్పటికే హెచ్చరించిన సంగతి తెలిసిందే.

40 గ్రామాలపై రష్యా దాడులు

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. గత 24 గంటల వ్యవధిలో ఉక్రెయిన్‌లోని 40 గ్రామాలపై దాడులు చేసింది. ఈ ఘటనలో ఇద్దరు మరణించారని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. దాడుల భయంతో జనం రాత్రిపూట బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని తెలిపారు. రష్యా సైన్యం ఐదు రాకెట్లు ప్రయోగించిందని, 30 వైమానిక దాడులు, 100కుపైగా మల్టిపుల్–లాంచ్ రాకెట్ సిస్టమ్ దాడులు చేసిందని ఉక్రెయిన్ సైనిక దళాల జనరల్ స్టాఫ్ పేర్కొన్నారు.

తొలిరోజే విమర్శల జడివాన

- హోంమంత్రిగా బ్రేవర్మన్ నియామకంపై లేబర్ పార్టీ మండిపాటు
- ఆమె క్షమాపణ చెప్పారు: రిషి సునాక్



ప్రధానిగా తొలిసారి పార్లమెంటులో ప్రైమ్ మినిస్టర్స్ క్వశ్చన్స్‌ను ఎదుర్కొంటున్న రిషి

లండన్: బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ బాధ్యతలు తీసుకున్న వెంటనే విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. డేటా ఉల్లంఘన తప్పిదాలపై లిజ్ ట్రస్ హయాంలో హోంమంత్రిగా రాజీనామా చేసిన భారత సంతతికి చెందిన సుయెల్లా బ్రేవర్మన్‌ని తిరిగి నియమించడాన్ని ప్రతిపక్ష లేబర్ పార్టీ తీవ్రంగా విమర్శించింది. రాజీనామా చేసిన వారం రోజుల్లోనే ఆమెను అదే పదవిలో నియమించడాన్ని తప్పు పట్టింది. బ్రేవర్మన్ నియామకాన్ని రిషి సమర్థించారు. ఆమె తప్పు తెలుసుకొని క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. ఆర్థిక మంత్రిగా జెరెమి హంట్, విదేశాంగ మంత్రిగా జేమ్స్ క్లెవెర్లీలను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. కొత్త మంత్రులతో ఆయన బుధవారం మొట్టమొదటి కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. తొలిసారి ప్రధాని హోదాలో ప్రైమ్ మినిస్టర్ క్వశ్చన్స్ (పీఎంక్యూస్) ఎదుర్కోవడానికి ముందు కేబినెట్ కొత్త మంత్రులతో కలిసి చర్చించారు. యూకే రాజకీయాల్లో పీఎంక్యూస్ కార్యక్రమం అత్యంత కీలకమైనది. ప్రతీ బుధవారం సాయంత్రం జరిగే ఈ కార్యక్రమంలో విపక్ష పార్టీలు, ఎంపీలు ఏ అంశం మీద అడిగిన ప్రశ్నలకైనా ప్రధాని బదులివ్వాల్సి ఉంటుంది. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే నిర్ణయాలను రిషి నవంబర్ 17 దాకా వాయిదా వేశారు. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే సన్నాహాలే ఇందుకు కారణమని హంట్ చెప్పారు. కేబినెట్ సమావేశంలోనూ ప్రధానిగా పార్లమెంటు తొలి భేటీలోనూ రిషి చేతికి హిందువులకు పవిత్రమైన దీక్షా కంకణం (మంత్రించిన ఎర్ర తాడు) ధరించి పాల్గొన్నారు. దీనిపై చర్చ జరుగుతోంది. దుష్ప్రభావాలు పోయి మంచి జరగడానికి దీనిని ధరిస్తే దేవుడు రక్షగా ఉంటాడని హిందువులు నమ్ముతారు. హిందూ మత విశ్వాసాలకు చెందిన దీనిని ధరించడంతో రిషి తాను నమ్ముకున్న సంప్రదాయాలను ఎంతో గౌరవిస్తారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

గ్రహశకలానికి తోకలు!



గ్రహశకలాల కక్ష్యను మార్చి భూమికి వాటి ముప్పును తప్పించే లక్ష్యంతో నాసా నెల క్రితం డబుల్ ఆస్టిరాయిడ్ రీడైరెక్షన్ (డార్ట్) ఉపగ్రహంతో డిడిమోస్ గ్రహశకలాన్ని విజయవంతంగా ఢీకొట్టించడం తెలిసిందే. ఫలితంగా డిడిమోస్ నుంచి బయటికి పొడుచుకొచ్చిన రెండు తోకలను హబుల్ టెలిస్కోప్ తాజాగా గుర్తించింది. దాని చుట్టూ కమ్ముకున్న ధూళి మేఘాలను కూడా గమనించింది. తోకలు పుట్టుకు రావడం అనూహ్యమని నాసా అంటోంది. వీటితో గ్రహశకలానికి ఏం సంబంధమో తేల్చే పనిలో ఉన్నట్టు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రకటించింది. డార్ట్ ఢీకొట్టడం వల్ల డైమోర్ఫస్ కక్ష్యలో డిడిమోస్ తిరిగే వేగంలో 32 నిమిషాల మేరకు మార్పు వచ్చినట్టు తేలింది! ఇలా మొత్తం 18 విశేషాలను హబుల్ ఇప్పటికి గుర్తించింది.

నోటి ద్వారా కరోనా టీకా

బీజింగ్: సూది(సిరంజీ)తో అవసరం లేకుండా నోటి ద్వారా తీసుకొనే కోవిడ్–19 టీకా చైనాలోని షాంఘై నగరంలో బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ తరహా టీకా ప్రపంచంలో ఇదే మొదటిదని చెబుతున్నారు. టీకా తీసుకున్న తర్వాత 5 సెకండ్ల పాటు శ్వాస పీల్చుకోవడం ఆపాల్సి ఉంటుంది. ఒక్కొక్కరికి మొత్తం వ్యాక్సినేషన్ ప్రక్రియ 20 సెకండ్లో పూర్తవుతుంది. ఈ టీకా తీసుకుంటే ఒక కప్పు టీ తాగినట్లే ఉందని షాంఘై వాసి ఒకరు తన అనుభవాన్ని పంచుకున్నారు. ఇన్‌హేలర్ లాగా నోటి ద్వారా తీసుకొనే ఈ టీకాను బూస్టర్ డోసుగా ఉచితంగా ఇస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. సూదితో కంటే ఇది సులభంగా అందజేయవచ్చన్నారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 27 । అక్టోబర్ । 2022



దుర్గమ్మ సేవలో జ్ఞానాచార్య

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మను తమిళనాడు తిరువన్నామలైకి చెందిన శ్రీ నందాల్‌మఠం 39వ తరం మఠాధిపతి శివరాజా జ్ఞానాచార్యగురు బుధవారం దర్శించుకున్నారు.



రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

మచిలీపట్నంలోని డీఎస్పీ కార్యాలయం, ఇనగుదురు, గూడూరు పోలీస్ స్టేషన్లను ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. -8లో▸



పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్

మచిలీపట్నంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసులు వాడే ఆయుధాలను ప్రదర్శించి, వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. -8లో▸

గృహోత్తర కసరత్తు



- ఉమ్మడి కృష్ణా జిల్లాకు 25,232 టిడ్కో ఇళ్లు మంజూరు
- మౌలిక వసతులకు రూ.301.27 కోట్లు కేటాయింపు
- శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు
- డిసెంబర్ 21న సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నగర, పట్టణ ప్రాంతాల్లో గృహ వసతి లేని పేదల కోసం ఆంధ్రప్రదేశ్ పట్టణ నివాస, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీ టిడ్కో) ఆధ్వర్యంలో గృహ నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. డిసెంబర్ 21వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ఇళ్లను లాంఛనంగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కృష్ణా జిల్లాకు 13,712 ఇళ్లు మంజూరయ్యాయి. మచిలీపట్నం కార్పొరేషన్‌లో 2,304, గుడివాడ మునిసిపాలిటీలో 8,912, ఉయ్యూరులో 2,496 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే 9,152 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 4,512 ఇళ్ల నిర్మాణ పనులు తుది దశకు చేరాయి, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ నగర పాలక సంస్థకు 6,576, మునిసిపాలిటీల వారీగా జగ్గయ్యపేటకు 3,168, నందిగామ 240, తిరువూరుకు 1,152 చొప్పున మొత్తం 11,520 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 1,536 ఇళ్లు పూర్తి కాగా, 6,624 ఇళ్ల నిర్మాణాలు తుదిదశకు చేరాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ఇళ్ల నిర్మాణాలను వాటి విస్తీర్ణాన్ని బట్టి మూడు కేటగిరీలుగా విభజించారు. కేటగిరీ-1 కింద 300 చదరపు అడుగులు, కేటగిరీ-2 కింద 365 చదరపు అడుగులు, కేటగిరీ-3 కింద 430 చదరపు అడుగులుగా విభజించారు. గృహ వసతిలేని పేదలందరికీ కేటగిరీ-1 కింద, 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇళ్లను ప్రభుత్వం ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోంది. ఇలాంటి ఇళ్లు ఉమ్మడి జిల్లాలో 8,496 ఉన్నాయి. మిగిలిన ఇళ్లకు లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేసి, వారి పేరుతో రిజిస్ట్రేషన్‌లు చేయించనున్నారు.

మౌలిక వసతుల కల్పనకు నిధులు

టిడ్కో గృహాలు మంజూరు చేసిన ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రధానంగా వాటర్ ట్యాంకుల నిర్మాణం, విద్యుత్, మురుగు కాలువలు, సీసీ రోడ్లు, అంతర్గత రోడ్లు, కల్వర్టులు, ఈఎల్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్, చదును చేయటం, స్టామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణం వంటి పనులు చేస్తున్నారు. ఈ పనుల కోసం రూ.301.27 కోట్ల నిధులు వెచ్చిస్తున్నారు. ఈ పనుల పురోగతిపై అధికారులు రోజువారీ సమీక్ష చేస్తున్నారు. డిసెంబర్ 21వ తేదీ నాటికి పనులు పూర్తయ్యేలా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు, మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొంటున్నారు. ప్రధానంగా గుడివాడలో మంజూరైన 8,912 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మౌలిక వసతులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 18 లక్షల లీటర్ల సామర్థ్యంగల వాటర్ ట్యాంకు నిర్మాణం, 2.5 కిలోమీటర్ల పైపు లైను పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని, కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలన చేసి తగు సూచనలు చేశారు. విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని జక్కంపూడి కాలనీల్లో మౌలిక వసతులకు సంబంధించిన పనులు వేగవంతంగా చేసేందుకు చర్యలు తీసుకొంటున్నారు.

కృష్ణా జిల్లా...	
మునిసిపాలిటీ/ కార్పొరేషన్	మౌలిక వసతులకు కేటాయించిన నిధులు (రూ.కోట్లల్లో)
ఉయ్యూరు	22.97
గుడివాడ	59.34
మచిలీపట్నం	40.21
మొత్తం	122.52

ఎన్టీఆర్ జిల్లా.....	
మునిసిపాలిటీ/ కార్పొరేషన్	మౌలిక వసతులకు కేటాయించిన నిధులు (రూ.కోట్లల్లో)
జగ్గయ్యపేట	19.20
నందిగామ	5.32
విజయవాడ	132.88
తిరువూరు	21.34
మొత్తం	178.74

పనులు వేగవంతం



టిడ్కో గృహాలకు సంబంధించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నాం. బ్యాంకర్లతో మాట్లాడి లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయిస్తున్నాం. మౌలిక వసతుల కల్పన పనులు శరవేగంగా సాగుతున్నాయి. టిడ్కో ఇళ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులు రోజువారీ సమీక్షలు నిర్వహించి, లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. డిసెంబరు 21వ తేదీ నాటికి మొదటి దశ పనులు పూర్తయ్యేలా పనులను వేగవంతం చేశాం.

- చిన్నోడు, టిడ్కో ఎస్ఈ, ఉమ్మడి కృష్ణా జిల్లా

నేడు దుర్గమ్మకు గాజుల అలంకరణ



గాజుల దండలు సిద్ధం చేస్తున్న మహిళలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): యమ ద్వితీయను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గురువారం గాజుల ఉత్సవం జరగనుంది. అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణాన్ని గాజులతో అలంకరించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అమ్మవారి అలంకరణ నిమిత్తం అవసరమైన గాజుల దండలను పలువురు సేవా బృంద సభ్యులు సిద్ధం చేస్తున్నారు. ఉత్సవం అనంతరం అమ్మవారికి అలంకరించిన గాజులను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తామని దుర్గ గుడి అధికారులు తెలిపారు.

కార్తిక మాసోత్సవాలు ప్రారంభం

కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రి ప్రాంగణంలోని మల్లేశ్వర స్వామి ఆలయం (బాలాలయం)లో స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. నటరాజస్వామి ఆలయం సమీపంలోని కుంకుమార్చన వేదిక వద్ద సహస్ర లింగార్చన జరిగింది. ఆలయ అర్చకులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించగా, పలువురు ఉభయ దాతలు సేవలో పాల్గొన్నారు. సాయంత్రం మల్లేశ్వర స్వామి, నటరాజ స్వామి ఆలయ ప్రాంగణాల్లో ఆకాశ దీపాలను వెలిగించారు. ఆలయ ఈఓ భ్రమరాంబ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.



దుర్గమ్మ దర్శనానికి క్యూలైన్లలో ఉన్న భక్తులు

న్యూస్‌రీల్

సజావుగా ఫ్యామిలీ డాక్టర్



లబ్బీపేట (విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎన్టీఆర్ జిల్లాలో ట్రయల్ రన్ పూర్తి చేసుకుని సజావుగా సేవలు అందిస్తోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. ఆమె బుధవారం జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను సందర్శించి, ఫ్యామిలీ డాక్టర్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న సేవలు, మందుల లభ్యత, వైద్య పరీక్షలను సమీక్షించారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులకు రిఫర్ చేయాలని, మధుమేహం, రక్తపోటు వంటి నాన్ కమ్యూనికల్ వ్యాధులతో బాధపడుతున్న వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మోతీబాబు, డాక్టర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి పాండురంగ స్వామి ఉత్సవాలు



మచిలీపట్నం టౌన్: స్థానిక చిలకలపూడిలో వేంచేసియున్న పాండురంగస్వామి ఉత్సవాలు నవంబర్ మూడు నుంచి ఎనిమిదో తేదీ వరకు జరుగుతాయని ఆలయ నిర్వాహకుడు టేకి నరసింహం బుధవారం తెలిపారు. కార్తిక శుద్ధ దశమిని పురస్కరించుకుని మూడో తేదీ ఉదయం గోపూజ, శ్రీ గణపతి పూజ, గురు పూజ, లక్ష్మీగణపతి హోమం, సాయంత్రం పల్లకీ ఉత్సవంతో జరుగుతాయని పేర్కొన్నారు. నాలుగో తేదీన ఉదయం సత్యనారాయణస్వామి వ్రతాలు, బ్రహ్మోత్సవం, రాత్రికి శ్రీ రుక్మిణీ, పాండురంగస్వామి కల్యాణం, ఐదో తేదీన ద్వాదశి పారాయణ, విష్ణు సహస్రనామ పారాయణ, మధ్యాహ్నం పాండురంగస్వామి రథోత్సవం ఆరో తేదీన శ్రీలక్ష్మీ సుదర్శనహోమం, ఏడో తేదీన రుక్మిణి అమ్మవారికి కుంకుమ పూజలు, మహన్యాస రుద్రాభిషేకం, రాత్రికి సహస్ర దీపారాధనలు, పండరీ భజనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎనిమిదో తేదీ ఉదయం గోపాలకాల ఉత్సవం నిర్వహించిన అనంతరం ఉదయం 7.30 గంటల నుంచి చంద్ర గ్రహణం కారణంగా ఆలయాన్ని మూసివేస్తామని వివరించారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరిగే నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళం సమర్పించారు. విశాఖపట్నం సాగర్‌నగర్‌కు చెందిన డబ్బీరు నారాయణ మూర్తి పట్నాయక్, సావిత్రమ్మ పేరిట గణపతి పట్నాయక్ కుటుంబం ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి ఈ విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

4న వాహనాల వేలం

భవానీపురం (విజయవాడ పశ్చిమ): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) భవానీపురం స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 16 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లను నవంబర్ నాలుగో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు వేలం వేస్తామని స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ద్విచక్ర వాహనానికి ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రిఫండబుల్)గా రూ.5 వేలు, కారుకు రూ.10 వేలు చొప్పున చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలంలో వాహనాన్ని పాడుకున్న నగదుకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బహిరంగ వేలానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం పి.వంశీరామ్ (ఎస్ఈబీ సబ్ ఇనస్పెక్టర్) 91829 79919, వి.వి. వేణుగోపాలరావు (హెడ్ కానిస్టేబుల్)ను 99493 69538ను సంప్రదించాలని కోరారు.

డిసెంబర్ 21న సామూహిక గృహప్రవేశాలు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలోని జగనన్న కాలనీల్లో డిసెంబర్ 21వ తేదీన సామూహిక గృహప్రవేశాలు నిర్వహించేందుకు 12 వేల ఇళ్లను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, నాడు-నేడు పనుల ప్రగతి, గ్రామ/వార్డు సచివాలయ నిర్మాణాలు, స్పందన గ్రీవెన్స్ తదితర అంశాలపై బుధవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ 21వ తేదీన జిల్లా వ్యాప్తంగా 12,264 ఇళ్లను పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పేదల సొంతింటి కలను నేరవేర్చాలన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామూహిక గృహ ప్రవేశాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఇసుక, సిమెంట్, మెటల్ వంటి నిర్మాణ సామగ్రిని ఎప్పటికప్పుడు సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

3,743 నిర్మాణాలు పూర్తి

నిర్మాణాల్లో రూఫ్ కాస్టింగ్ దశలో ఉన్న 12,264 ఇళ్లలో ఇప్పటికే 3,743 ఇళ్లు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. మిగిలిన 8,473 ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీదేవి, డీఈఓ సి.వి.రేణుక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంత శిక్ష వేశావు దేవుడా..

- రోడ్డు ప్రమాదంలో తల్లీబిడ్డలు దుర్మరణం
- లంకమ్మ మాన్యం వద్ద బైక్‌ని ఢీకొన్న సెప్టిక్ ట్యాంక్ ట్రాక్టర్



ప్రహాస్ మృతదేహం వద్ద విలపిస్తున్న తాతయ్య



చలమేశ్వరరావు, శ్రీవల్లి, ప్రహాస్ (ఫైల్)

అవనిగడ్డ: ఆ దంపతుల అన్యోన్యతను చూసి విధికి కన్ను కుట్టిందో.. లేక తల్లీబిడ్డల ప్రేమను చూసి మృత్యువు పగబట్టిందో ఏమో.. రోడ్డు ప్రమాదం తల్లీబిడ్డల జీవితాలను నిర్దాక్షిణ్యంగా చిదిమేసింది. భార్యాబిడ్డలను దూరం చేసి ఆ యువకుడిని ఒంటరిని చేసింది. ఎంత శిక్ష వేశావు దేవుడా.. అంటూ అతను కన్నీరుమున్నీరుగా విలపించాడు. అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీబిడ్డలు మృత్యువాత పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక రెండో వార్డుకు చెందిన తోట చలమేశ్వరరావు, శ్రీవల్లి (32) దంపతులు. శ్రీవల్లి నడకుదురు సచివాలయంలో ఉద్యోగి. చలమేశ్వరరావు స్థానికంగా ఒక ప్రైవేటు స్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వారికి ఏడేళ్ల క్రితం వివాహమైంది. 14 నెలల క్రితం కుమారుడు ప్రహాస్ జన్మించాడు. రెండు నెలల క్రితం ప్రహాస్ తొలి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. చలమేశ్వరరావు, శ్రీవల్లి దంపతులు తమ కుమారుడు ప్రహాస్‌తో కలిసి బుధవారం అశ్వారావుపాలెంలోని తమ బంధువుల ఇంట జరిగే వేడుకకు బైక్‌పై బయలుదేరారు. లంకమ్మ మాన్యం మలుపు వద్ద ముందు వెళ్తున్న సెప్టిక్ ట్యాంకు ట్రాక్టర్ సైడ్ ఇవ్వడంతో చలమేశ్వరరావు ముందుకు వెళ్లే ప్రయత్నం చేశారు. ఇంతలో డ్రైవర్ ట్రాక్టర్‌ను కుడివైపునకు తిప్పడంతో ట్రక్కు బైక్‌కు తగిలి ముగ్గురూ కింద పడిపోయారు. ప్రహాస్, శ్రీవల్లికి రోడ్డు దెబ్బలు బలంగా తగిలాయి. తీవ్రంగా గాయపడిన వారిని హుటాహుటీన అవనిగడ్డలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే ప్రహాస్ మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. శ్రీవల్లి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలిస్తుండగా మార్గంమధ్యలో మరణించింది. ఎంతో అల్లారుముద్దుగా చూసుకుంటున్న కుమారుడు, భార్య ఇద్దరూ తన కళ్లెదుటే మరణించడంతో చలమేశ్వరరావు విలపిస్తున్న తీరు చూపరులను కలచి వేసింది. ఈ ఘటనతో అవనిగడ్డ రెండో వార్డులో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఊపిరి ఆడనిద్దాం

ఆడబిడ్డను బతకనిద్దాం.. ఎదగనిద్దాం..

- కృష్ణా జిల్లాలో తగ్గిపోతున్న ఆడపిల్లల సంఖ్య
- ప్రతి వెయ్యిమంది అబ్బాయిలకు 888 మందే అమ్మాయిలు
- బాలికా నిష్పత్తిలో కృష్ణా జిల్లాకు 24వ స్థానం
- ఉమ్మడి జిల్లాలో 1000 అబ్బాయిలకు 964 అమ్మాయిలు
- బాలికా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నా.. అంతరం పెరుగుతుండటంపై ఆందోళన

ఉమ్మడి కృష్ణాలో రెండేళ్లలో బాలబాలికల నిష్పత్తి ఇలా

సంవత్సరం	అబ్బాయిలు	అమ్మాయిలు	నిష్పత్తి
2020-21	29,420	28,515	1000 : 969
2021-22	27,747	26,766	1000 : 964



మచిలీపట్నం: ఒకప్పుడు ఆడబిడ్డ పుట్టిందంటే మహాలక్ష్మి అనే వారు.. బంగారు తల్లి ఇంట్లో అడుగు పెట్టగానే లక్ష్మీకళ వచ్చిందని సంబరపడే వారు. కాలం మారుతోంది. ఇప్పుడు ఆడపిల్ల చాలా మందికి భారమైపోతోంది. అందుకే పుట్టక ముందో.. పురిట్లోనే.. లేక పుట్టిన తరువాతో ఉసురు తీస్తున్నవారూ కనిపిస్తున్నారు. ఫలితంగా స్త్రీ, పురుష నిష్పత్తిలో గణనీయమైన తేడా కనిపిస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో ఈ నిష్పత్తి మెరుగ్గానే ఉన్నప్పటికీ, కృష్ణా జిల్లాలో పరిస్థితి దారుణంగా ఉంది. ఇది ఇలానే కొనసాగితే భవిష్యత్‌లో కృష్ణా జిల్లా అబ్బాయిలకు పిల్ల దొరక్క, పెళ్లికాని ప్రసాదులుగా మిగిలిపోవాల్సిన ప్రమాదం తప్పదు.

ఇదిగో లెక్క..

- 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు వరకు లెక్క తీయగా కృష్ణా జిల్లాలో జరిగిన జననాల్లో 3,188 మగపిల్లలు ఉంటే, 2,832 మంది అమ్మాయిలు పుట్టారు. దీంతో బాలికా నిష్పత్తి ప్రతి వెయ్యి మంది బాలురకు 888గా నమోదైంది.
- ఎన్టీఆర్ జిల్లాలో బాలికల నిష్పత్తి మెరుగ్గానే ఉంది. ఇక్కడ 6,367 మంది అబ్బాయిలు, 6,268 అమ్మాయిలు పుట్టారు. ఈ లెక్కన ప్రతి వెయ్యి మంది బాలురకు బాలికలు 984 మంది ఉన్నారు.
- రాష్ట్రంలో బాలికా నిష్పత్తి ప్రతి వెయ్యి మందికి 937 మంది కాగా, మిగతా జిల్లాలతో పోలిస్తే, కృష్ణా జిల్లా బాగా వెనుకన ఉండటం ఆందోళన కలిగించే అంశం.

బడిఈడు పిల్లల్లోనూ..

జనన గణాంకాలే కాదు, పాఠశాలల్లో ప్రస్తుతం ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లోనూ అమ్మాయిల సంఖ్య తక్కువే ఉంది.

- కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 2,22,147 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 1,16,303 మంది అబ్బాయిలు ఉంటే, 1,05,844 మంది మాత్రమే అమ్మాయిలు. ఈ లెక్కన అబ్బాయిలు కంటే 10,459 మంది అమ్మాయిలు తక్కువగా ఉన్నారన్న మాట.
- ఎన్టీఆర్ జిల్లాలో 3,04,527 మంది చదువుతుండగా, వీరిలో 1,62,290 మంది అబ్బాయిలు, 1,42,237 మంది అమ్మాయిలు ఉన్నారు. ఇక్కడ అబ్బాయిల కంటే అమ్మాయిలు 20,053 మంది తక్కువగా ఉన్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా...

బాలికా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నా, కొడుకే కావాలనే అవివేకంతో చాలా మంది ఆడపిల్లలను గర్భంలోనే ఛిదిమేస్తున్నారు. కాసుల కక్కుర్తితో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఇందుకు ప్రోత్సహిస్తున్నారనే ప్రచారం ఉంది. స్కానింగ్ సెంటర్ల నిర్వహణపై వైద్య ఆరోగ్యశాఖ మరింత నిఘా పెట్టి.. పరిస్థితి అదుపు చేయకపోతే ప్రభుత్వ సంకల్పానికి తూట్లు పడటమే కాకుండా అబ్బాయిలు పెళ్లిళ్లకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చే ప్రమాదం పొంచి ఉంది.

బాల్య వివాహాలపై నిఘా..

ఆడపిల్లల అంతరం పెరిగిపోతుండగా, మరో పక్క బాల్య వివాహాలు సమాజాభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయి. కృష్ణా జిల్లాలో 856, ఎన్టీఆర్ జిల్లాలో 40 బాల్య వివాహాలను నిలిపివేసినట్లు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. అయితే 2021-22 సంవత్సరంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 68,993 మంది గర్భిణులు నమోదైతే, ఇందులో 250 మంది టీనేజర్స్ గర్భం దాల్చినట్లు వైద్య , ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. అంటే 18 ఏళ్లు నిండకుండానే వీరికి వివాహం జరిగిందన్న మాట.



అప్రమత్తం చేశాం..

జనన రేటులో బాలికా నిష్పత్తి తగ్గుతుండటంపై దృష్టిసారించాం. దీనిపై క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బందిని అప్రమత్తం చేశాం. కృష్ణా వెనుకంజలో ఉండటంపై వాస్తవ గణాంకాలను కూడా పరిశీలన చేస్తున్నాం. బాలికలకు అన్ని రంగాల్లో అరుదైన అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

- డాక్టర్ జీ. గీతాబాయి, డీఎంహెచ్ఓ, కృష్ణా జిల్లా



స్కానింగ్ సెంటర్లపై నిఘా

ప్రతి ఇంటా ఆడపిల్ల ఉంటేనే, ఆ ఇల్లు కళ కళలాడుతుంది. బాలికా సంక్షేమం కోసం ప్రస్తుత ప్రభుత్వం కూడా ఎంతో శ్రద్ధ చూపుతోంది. ఆడపిల్లలను కాపాడుకునేలా గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చేయకుండా, ఎన్టీఆర్ జిల్లాలో స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాం. సచివాలయం కేంద్రంగా దీనిపై ప్రజానీకానికి చైతన్యం కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నాం.

- డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్ఓ, ఎన్టీఆర్ జిల్లా

క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్య అందించాలి

-కలెక్టర్ ఢిల్లీరావు



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఎ.కొండూరు(తిరువూరు): నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను నేర్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. మండలంలోని కృష్ణారావుపాలెం గురుకుల కళాశాలలో బుధవారం రాత్రి నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. తరగతి గదుల్లో 9వ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో పాఠ్యాంశాలు బోధించారు. డార్మిటరీని పరిశీలించి పాఠశాలలో మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు సబ్జెక్టులపై శ్రద్ధ వహించి చదవాలన్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కళాశాలలో మొక్కలు నాటి పెంచాలని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా కృష్ణా జలాలు సరఫరా చేయించటానికి సన్నాహాలు చేస్తున్నామని, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఐదేళ్లు దాటిన వారందరికీ రక్త పరీక్షలు చేయించనున్నట్లు తెలిపారు. రేపూడి భూ వివాద విషయంలో ఆర్ఐ, తహసీల్దార్‌పై జాయింట్ కలెక్టర్ నివేదిక అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు పి.నాగమల్లేశ్వరి, జె.జమలమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రమోహనరావు, పెదబాబు పలు శాఖల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీలంతా వైఎస్సార్ సీపీతోనే..

జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఉదయకిరణ్

కృష్ణలంక(విజయవాడ తూర్పు): రాష్ట్రంలోని బీసీలందరూ వైఎస్సార్ సీపీతోనే ఉన్నారని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయకిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు చేసిన మేలుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామినేటెడ్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాజ్యసభ, మంత్రి వర్గం అన్ని పదవుల్లో బీసీలకు వాటా కల్పించి బీసీల ఆత్మగౌరవం నిలబెట్టారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలంతా 175 సీట్లలో వైఎస్సార్ సీపీని గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇస్తారన్నారు.

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్

కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణాజిల్లా ఎస్పీ జాషువా



బైనాక్యులర్ వినియోగాన్ని వివరిస్తున్న ఎస్పీ జాషువా

కోనేరుసెంటర్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి.జాషువా పాల్గొని, విద్యార్థులతో కలిసి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ, సంఘ విద్రోహ శక్తులను నిరోధించడానికి వినియోగించే అత్యాధునిక ఆయుధాలు, ఏకే-47, మెషిన్ గన్లు, రివాల్వర్లు పిస్టల్‌లు, గ్రెనేడ్లు, టియర్ గ్యాస్ షెల్, వైర్ లెస్ సెట్, డీహెచ్ఎండీ, హెచ్‌హెచ్ఎండీ, బాంబు డిస్పోజల్ సిబ్బంది వినియోగించే పరికరాలు, బాడీ వార్న్ కెమెరాలు ప్రదర్శించి, వాటి గురించి వివరించారు. నేరం జరిగినప్పుడు క్లూస్ టీం ఏ విధంగా ఆధారాలు సేకరించేది, వారి దర్యాప్తులో ఉపయోగించే పరికరాలు, వైట్ కాలర్, లోన్ యాప్, ఓటీపీ వంటి నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఐటీ వింగ్ సిబ్బంది ప్రదర్శించిన పోస్టర్లు, డాగ్ స్క్వాడ్ వినియోగించే పరికరాలు, పోలీసు జాగిలాలు, మ్యానుఫ్యాక్, మహిళా కానిస్టేబుళ్ల విధి నిర్వహణలో ఉపయోగించే దిశ మొబైల్ రెస్ట్ వాహనం మొదలగు వాటి పని తీరు గురించి వివరించారు. ఎస్పీ స్వయంగా ఆయుధాల పనితీరు ఏ విధంగా ఉంటుంది, వాటిని ఎలా హ్యాండిల్ చేయాలి తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఆద్యంతం ఆసక్తితో ఆయుధాల ప్రదర్శనను తిలకించారు. ఎస్పీతో మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్.వెంకట రామాంజనేయులు, సెబ్ అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, డీఎస్పీలు భరత్ మాతాజీ, మాసూం బాషా, రాజీవ్ కుమార్, విజయ్ కుమార్, సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నం కార్పొరేషన్‌కు ఫోరం జరిమానా

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ నిర్లక్ష్యం కారణంగా ఓ వ్యక్తి డ్రెయిన్‌లో పడి చనిపోయిన ఘటనకు సంబంధించి వినియోగదారుల కమిషన్ కార్పొరేషన్‌కు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పింది. వివరాల ప్రకారం మచిలీపట్నం ఎన్‌జీవో కాలనీకి చెందిన కె.రామకృష్ణ 2017 డిసెంబర్ 31వ తేదీ తెల్లవారుజామున మార్నింగ్ వాక్‌కు వెళుతుండగా లక్ష్మీటాకీసు సెంటర్‌లో డ్రెయిన్‌లో పడి మరణించాడు. దీనిపై భార్య కేడీఎన్ శ్రీదేవి మునిసిపల్ అధికారులు డ్రెయినేజీ మూయకుండా వదిలివేయడం వల్లే తన భర్త చనిపోయాడని, అందుకు నష్టపరిహారం చెల్లించాలని మునిసిపల్ అధికారులకు విన్నవించింది. అయినా స్పందన లేకపోవటంతో 2019 డిసెంబర్ 31వ తేదీన ఆమె వినియోగదారుల ఫోరంలో పిటీషన్ దాఖలు చేశారు. ఫోరం అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, లక్ష్మీరాయలు విచారించిన అనంతరం ఫిర్యాదుదారుకు రూ.10 లక్షలను దరఖాస్తు చేసిన తేదీ నుంచి 9 శాతం వడ్డీతో సహా నష్టపరిహారం కింద చెల్లించాలని, వ్యాజ్యం ఖర్చుల నిమిత్తం మరో రూ.5 వేలు, తీర్పు చెప్పిన తరువాత 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం



లారీలో ఇరుక్కుపోయిన మోటర్ బైక్, చిత్రంలో తీవ్రంగా గాయపడిన నరేష్

పామర్రు: రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన పామర్రులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొవ్వ మండలం పెడసనగల్లు గ్రామానికి చెందిన శ్రీను, నరేష్ మోటార్ బైక్‌పై తాపీ పనుల నిమిత్తం పామర్రుకు వస్తున్నారు. వీరు పామర్రు-చల్లపల్లి ప్రధాన రహదారిలో పామర్రు శివారు శ్యామలాపురం వద్దకు చేరుకోగా వారి ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి ఎదురుగా కురుమద్దాలి నుంచి అవనిగడ్డ వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టారు. దీంతో నరేష్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, శ్రీనుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలం చేరుకుని క్షతగాత్రులను మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో నరేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పామర్రు ఎస్ఐ మాణిక్యాలరావు తెలిపారు.

సరికొత్తగా ఫార్మటివ్ పరీక్షలు

- ఎస్‌సీఈఆర్టీ నుంచి ప్రశ్నపత్రం
- ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఒకే విధానం
- నవంబర్ 2 నుంచి పరీక్షలు ప్రారంభం
- ఈ విద్యా సంవత్సరంలో ఇవే తొలి పరీక్షలు
- 1 నుంచి 8వ తరగతి వరకు క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఓఎంఆర్ షీట్
- విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేసేందుకు ప్రయోగం



పరీక్షలపై తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

మచిలీపట్నం: విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి, భవిష్యత్ చదువులకు పాఠశాల స్థాయిలోనే పటిష్టమైన పునాదులు వేసేలా విద్యాశాఖ సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. యూనిట్ టెస్టుల స్థానంలో తీసుకొచ్చిన ఫార్మటివ్ పరీక్షలను సైతం తాజాగా క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్మెంట్(సీబీఏ) పేరుతో మరింత పటిష్టంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 1 నుంచి 10 వ తరగతి వరకు నవంబర్ 2 నుంచి 5 వరకు సీబీఏ/ఫార్మటివ్ పరీక్షలు నిర్వహించనున్నారు. 9,10 తరగతులకు గతంలో మాదిరే ఫార్మటివ్ పరీక్షలు నిర్వహిస్తుండగా, 1 నుంచి 8 తరగతుల వారికి మాత్రం క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్మెంట్ పేరిట పరీక్షలకు అంతా సిద్ధం చేశారు. పాఠశాల స్థాయిలో జరిగే పరీక్షల్లో తొలిసారిగా ఓఎంఆర్ షీట్‌ను వినియోగిస్తున్నందున, దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారులు తాహెరా సుల్తానా, సీవీ రేణుక ప్రత్యేక దృష్టి సారించారు.

ఒకే విధానంలో పరీక్షలు

ప్రైవేటు పాఠశాలల్లో ఇప్పటివరకు యాజమాన్యాల ఇష్టానుసారం పరీక్షలు నిర్వహించుకునేవారు. ప్రశ్నపత్రాలను కూడా వారే సొంతంగా తయారు చేసుకుని, ర్యాంకుల పేరుతో విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి పెట్టేవారు. ఇలాంటి వాటికి ఇక పూర్తి స్థాయిలో చెక్ పడినట్లే. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకే విధానంలో, ఒకే సమయంలో ఫార్మటివ్, సమ్మెటివ్ పరీక్షలు నిర్వహించేలా విద్యాశాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. ప్రైవేటు పాఠశాలల్లో సైతం ఎస్‌సీఈఆర్టీ రూపొందిన ప్రశ్నపత్రాలతోనే పరీక్షలు నిర్వహించాలి.

జాతీయ స్థాయిలో పోటీ పడేలా...

నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేలా పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యాప్రమాణాలు సైతం పెంచేలా కార్యక్రమాలు అమలు చేస్తోంది. జాతీయ విద్యావిధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మన విద్యార్థులు ఇతర రాష్ట్రాలతో పోటీ పడేలా పరీక్షల విధానంలోనూ మార్పులు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే పాఠశాల స్థాయిలో ఓఎంఆర్ షీట్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. చైల్డ్ ఇన్ఫోలో నమోదైన వివరాల మేరకు పాఠశాల యూడైస్ కోడ్, విద్యార్థి పేరు, గుర్తింపు సంఖ్యతో ముద్రించిన ఓఎంఆర్ షీట్‌లను ఎస్‌సీఈఆర్టీ నుంచి డీసీఈబీ, అక్కడ నుంచి ఎమ్మార్సీలకు పంపించి, పరీక్ష జరిగే ముందు రోజు పాఠశాలలకు పంపించేలా తగిన ఏర్పాట్లు చేశారు. ఓఎంఆర్ షీట్లు కేవలం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ఇవ్వనున్నారు.

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
కృష్ణా	1,900	2,22,147
ఎన్టీఆర్	1,604	3,04,527

ఇదో గొప్ప మార్పు



పాఠశాల స్థాయిలో జరిగే పరీక్షల్లో ఇదో గొప్పమార్పుగా చెప్పవచ్చు. పోటీ పరీక్షలన్నీ కంప్యూటర్ బేస్డ్, ఓఎంఆర్ షీట్ ఆధారంగానే జరుగుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఉన్నతాధికారులు ఇటువంటి చక్కని ఆలోచన చేశారు. ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నందున, ఏమైనా ఇబ్బందులు ఎదురైనా, ఎంఈవో స్థాయిలో వాటిని సకాలంలో పరిష్కరించేలా ఏర్పాట్లు చేశారు.

– తాహెరా సుల్తానా, డీఈవో కృష్ణాజిల్లా

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పరీక్షల విధానంలో మార్పులు అవసరం. ఓఎంఆర్ విధానంపై పాఠశాల స్థాయి విద్యార్థులకు అవగాహన ఉంటేనే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చు. పరీక్షల నిర్వహణకు ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి. విద్యార్థులకు తగిన అవగాహన కల్పించాలి.

–డి.దేవానందరెడ్డి, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్

ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తన సొంత పనుల నిమిత్తం పాఠశాలకు సెలవు ప్రకటించిన ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు పడింది. ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం రెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో ఎస్.అన్నే ప్రసూన ప్రసాద్ ఎస్జీటీగా పని చేస్తోంది. ఆమె విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సొంత పనుల నిమిత్తం పాఠశాలకు సెలవు ప్రకటించింది. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం పలు దినపత్రికల్లో ప్రచురితమైంది. ప్రసూన ప్రసాద్ విధుల్లో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారని, ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా వ్యవహరించినట్లు ఆ శాఖ అధికారులు చేపట్టిన విచారణలో తేలింది. ఈ విషయంపై రెడ్డిగూడెం మండల విద్యాశాఖాధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉపాధ్యాయురాలు ప్రసూన ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ డీఈఓ సీవీ రేణుక ఉత్తర్వులు జారీ చేశారు.

చర్చి ఫాదర్ ఆత్మహత్య

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): పాతబస్తీలోని ఒక చర్చిలో సహాయ ఫాదర్‌గా పని చేస్తున్న యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే కొండ్రు బాబు తన తల్లిదండ్రులతో కలిసి ఉంగుటూరు మండలంలో నివాసం ఉంటున్నారు. బాబు సోదరుడు కొండ్రు రాజు పాస్టర్‌గా శిక్షణ తీసుకుని పాతబస్తీలోని సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చిలో సహాయ ఫాదర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం సాయంత్రం తన అన్న, ఇతర కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. బుధవారం ఉదయం చర్చి ప్రాంగణంలోని ఫాదర్స్ క్వార్టర్స్‌లో ఉరి వేసుకున్నారు. దీనిపై చర్చి నిర్వాహకులు ఫోన్ ద్వారా మృతుని సోదరుడు బాబుకు సమాచారమందించారు. బాబు ఫిర్యాదుపై వన్‌టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో పశ్చిమబెంగాల్ వాసి మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: 16వ నంబర్ జాతీయ రహదారిపై బాపులపాడు మండలం బొమ్ములూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. హైవేపై డివైడర్ పక్కన ఆపి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ వేగంగా ఢీకొనటంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే.. బొమ్ములూరు టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై డివైడర్ వెంబడి సిమెంట్ లోడుతో ఉన్న లారీ ఆపి ఉండటంతో ఏలూరు వైపు వెళుతున్న కంటైనర్ లారీ నడుపుతున్న వ్యక్తి అదుపుతప్పి వేగంగా ఢీకొట్టాడు. దీంతో కంటైనర్ లారీ నడుపుతున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన సూరజ్ మాల్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోవటంతో పోలీసులు స్థానికుల సహకారంతో అతి కష్టం మీద బయటకు తీశారు. నిర్లక్ష్యంగా రహదారి డివైడర్ పక్కన లారీని ఆపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గురైన లారీని క్లీనర్‌కు నడపమని అప్పగించి, డ్రైవర్ నిద్రించటం వల్లే దుర్ఘటన జరిగిందని పోలీసుల విచారణలో వెల్లడి కావటంతో ఆ కంటైనర్ లారీ డ్రైవర్‌పై కూడా కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ పథకాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వరాలు

ఏపీ రజక అభివృద్ధి సంస్థ చైర్మన్ పొన్నాడ మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నాడ మోహనరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వరాల వంటివని ఆంధ్రప్రదేశ్ రజక అభివృద్ధి సంస్థ చైర్మన్, శ్రమశక్తి అవార్డు గ్రహీత పొన్నాడ మోహనరావు అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం రజక అభివృద్ధి సంస్థ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసిన సమయంలో సీఎం వైఎస్ జగన్ పేద ప్రజలకు అందించిన ఆర్థిక సహాయం వెల కట్టలేనిదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా అమలు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారన్నారు. ముఖ్యంగా రజక వృత్తిదారులకు జీవో నం.59 ద్వారా ఆర్థిక సహాయం అందించారన్నారు. రాష్ట్రంలోని రజకులందరి తరఫున సీఎం వైఎస్ జగన్‌కు అభినందనలు తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాలలో రజకులు ఎస్సీలుగా పరిగణిస్తున్నారని, రాష్ట్రంలో కూడా ఎస్సీ జాబితాలో చేర్చాలని రాష్ట్రంలోని రజక సంఘాల పెద్దలు అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ అంశాన్ని సీఎం వైఎస్ జగన్ పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. వాల్మీకుల డిమాండ్లను అధ్యయనం చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసిన తరహాలో రజకుల సమస్యలపై కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రజక అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి పి.కమ్మన్న, కోశాధికారి జి.సుబ్బన్న, ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు రామారావు, ఊకోటి శేషగిరిరావు, చాకలి ఐలమ్మ ట్రస్ట్ అధ్యక్షుడు కందకట్ల శ్రీనివాసరావు, కుందేటి వెంకటేశ్వరరావు, జేటీ రాజేంద్రప్రసాద్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు



మహిళా పోలీసులతో కలిసి కేకు కట్ చేస్తున్న ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు, చిత్రంలో ఎస్పీ

కోనేరుసెంటర్: ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు బుధవారం బందరు సబ్-డివిజన్ పరిధిలోని బందరు డీఎస్పీ కార్యాలయం, ఇనగుదురుపేట పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మచిలీపట్నం వచ్చిన ఆయన తొలుత డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బంది గౌరవవందనాన్ని స్వీకరించారు. జిల్లా ఎస్పీ పి జాషువా పూల మొక్కతో డీఐజీకి స్వాగతం పలికారు. అడిషనల్ ఎస్పీ ఎన్.వెంకటరామాంజనేయులు, సెబ్ ఏఎస్పీ అస్మాఫర్హీన్, ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్ తదితరులు డీఐజీకి పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో డీఐజీ ఎస్పీతో కలిసి మొక్కలు నాటారు. డీఎస్పీ కార్యాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలించిన డీఐజీ సీసీ రూమ్, రికార్డుల రూమ్‌లను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణలో సిబ్బంది పక్కాగా ఉండాలని సూచించారు. డీఎస్పీ కార్యాలయం నిర్వహణ, పరిశుభ్రత, రిసెప్షన్ వ్యవస్థ, కంప్యూటర్ గదిని పరిశీలించి ఆయన సిబ్బందిని అభినందించారు. సచివాలయం మహిళా పోలీసులతో మాట్లాడి సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తనకు తెలియజేయవచ్చని చెప్పారు. దిశ యాప్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయం మహిళా పోలీసులతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించిన ఆయన సిబ్బంది పనితీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి.జాషువా, ఏఎస్పీలు ఎన్.వెంకటరామాంజనేయులు, అస్మాఫర్హీన్, ప్రసాద్, డీఎస్పీలు భరత్‌మాతాజీ, మాసూం బాషా, రాజీవ్‌కుమార్, సీఐలు శ్రీధర్‌కుమార్, కొండయ్య, వీరయ్యగౌడ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డీఐజీ

గూడూరు(పెడన): గూడూరు పోలీస్ స్టేషన్‌ను ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ అంతా క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. నేరాల నియంత్రణకు పలు సూచనలు ఇచ్చారు. అంతకు ముందు స్టేషన్‌కు వచ్చిన డీఐజీ మండలంలోని మహిళా పోలీసులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. గ్రామాల్లో పరిస్థితులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. మహిళా పోలీసులుగా బాధ్యతలు స్వీకరించాక సాధించిన విజయాలు ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు అరికట్టడంలో మహిళా పోలీసులు క్రియాశీల పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు దిశ యాప్ డౌన్లోడ్ చేసుకోవడం ద్వారా తక్షణ సహాయం అందుతుందన్న విషయంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి.జాషువా, ఏఎస్పీ ఎన్.వి.రామాంజనేయులు, డీఎస్పీ మాసూమ్ బాషా, సీఐలు పి.వీరయ్య గౌడ్, కొండయ్య, శివాజీ, శ్రీనివాస్, ఎస్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకుమార్‌కు జాతీయ స్థాయి అవార్డు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రా లయోలా కళాశాల ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ తుమ్మల శ్రీకుమార్ మూడు దశాబ్దాలుగా సైన్స్ రంగంలో చేస్తున్న కృషికి గాను జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఆవిష్కార్ ఫౌండేషన్, షోలాపూర్ వారు ఇటీవల విభిన్న రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారికి ఆవిష్కార్ అచీవర్స్ అవార్డ్స్-2022 పేరుతో అందజేశారు. అందులో భాగంగా సైన్స్ రంగంలో చేస్తున్న కృషికి గాను విజయవాడకు చెందిన తుమ్మల శ్రీకుమార్‌కు జాతీయ బెస్ట్ ఇన్‌స్పిరేషన్ టీచర్స్ అవార్డు అందజేశారు. డాక్టర్ శ్రీకుమార్ ఫిజిక్స్ అధ్యాపకుడిగా సైన్స్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పర్యావరణ పరిరక్షణ, గ్లోబల్ వార్మింగ్ ముప్పు వంటి అనేక అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. మూడు దశాబ్దాలుగా ఆయన చేస్తున్న కృషికి తగిన ఫలితంగా జాతీయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా శ్రీకుమార్‌ను బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్ అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో గోవర్ధన మహోత్సవం



పటమట(విజయవాడతూర్పు): పటమట రామలింగేశ్వరనగర్‌లోని ఇస్కాన్ మందిరంలో బుధవారం గోవర్ధన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. దశాబ్దాల క్రితం కృష్ణుడు ఇంద్రుడి గర్వాన్ని అణిచి గోవర్ధనుడి మహిమను తెలియజేస్తూ బృందావన వాసులు, గోపికలతోను కార్తిక ద్వితీయ రోజున గోవర్ధన పూజ చేయించారని పురాణాలు చెబుతాయని ఇస్కాన్ విజయవాడ అధ్యక్షుడు చక్రదారి దాసు అన్నారు. ఈ మహోత్సవాన్ని పురస్కరించుకొని నాటి నుంచి వైష్ణవులందరూ గోవర్ధన పూజను నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా అన్నకూటను తయారుచేసి వందలాది తినుబండారాలతో అత్యద్భుతంగా అలంకరించారు. అనంతరం గో పూజ చేసి, గోమాతతో గిరి గోవర్ధన ప్రదక్షిణం చేయించారు.

రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఓపెన్ హౌస్



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విజయవాడ రైల్వే ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ బంగార్రాజు, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పాల శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు ఆయుధాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుల సేవలు ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విధుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన పోలీసుల త్యాగాలను వివరించారు. అనంతరం పోలీసు శాఖలోని విభాగాలు, శాంతిభద్రతల పర్యవేక్షణ, నేరాల నియంత్రణకు ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానం, వైర్‌లెస్ సెట్‌ల పనితీరు తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. సిద్దార్థ లా కళాశాల, జాక్ అండ్ జిల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రకు ముస్లింల పయనం



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): నగరంలోని మొహమ్మదీయ హజ్ ఉమ్రా సర్వీసెస్ ఆధ్వర్యంలో 100 మంది ముస్లింలు మక్కా సందర్శన ఉమ్రా యాత్రకు బుధవారం సాయంత్రం పంజా సెంటర్ నుంచి పయనమయ్యారు. హజ్ కమిటీలో సభ్యులైన మహమ్మద్ హబీబుర్ రహమాన్ మెరాజ్ నేతృత్వంలో మొహమ్మదీయ హజ్ ఉమ్రా సర్వీసెస్ ఆధ్వర్యంలో యాత్రకు వెళ్లారు. యాత్రకు బయలుదేరేముందు పంజా సెంటర్ లో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జెండా ఊపి యాత్రికులు వెళ్లే బస్సులను ప్రారంభించారు. యాత్రికులకు కుటుంబసభ్యులు వీడ్కోలు పలికారు. మహమ్మద్ హబీబుర్ రహమాన్ మెరాజ్, మత గురువులు మాట్లాడుతూ ప్రతి ముస్లిం తన జీవితకాలంలో కనీసం ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలన్నారు. ఇస్లామీయ కేలండర్ లోని జిల్ –హజ్జ (బక్రీదు నెలలో)లో ఈ కార్యం నిర్వహిస్తారన్నారు. ఆ నెలలో మక్కా యాత్ర చేస్తే హజ్ యాత్ర అంటారని, సంవత్సర కాలంలో ముస్లింలు ఎప్పుడైన మక్కా యాత్ర చేస్తే దానిని ఉమ్రా అంటారన్నారు.

ఖోఖో పోటీలకు ఎంపిక

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): నవంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు ప్రకాశం జిల్లా ఈదరలో జరిగే సీనియర్ పురుషుల, మహిళల రాష్ట్ర స్థాయి ఖోఖో చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు కొత్తపేట హిందూ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. మహిళల జట్టుకు గంటా మోనికా, పురుషుల జట్టుకు బి.హరిసాయిబాబు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఇటీవల గన్నవరంలో జరిగిన జిల్లా ఎంపికలో చూపిన ప్రతిభ ద్వారా ఈ ఎంపికలు లభించాయని తెలిపారు. అదే విధంగా ఇటీవల ప్రకాశం జిల్లా అర్ధవీడులో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో హిందూ హైస్కూల్ బాలురు వి.ఏ సుబాబు, ఎల్.బాలసాయికృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి నాల్గో స్థానం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కేవీవీ మోహనరావు విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.లక్ష్మి, ఎంవీ సత్య ప్రసాద్‌ను అభినందించారు.

కొండ ప్రాంతాల అభివృద్ధికి కృషి

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



ప్రభుత్వ పథకాల లబ్ధిపై ఆరా తీస్తున్న దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తదితరులు

గుణదల(విజయవాడ తూర్పు): కొండ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. నియోజకవర్గంలోని 2వ డివిజన్ పరిధిలోని కుమ్మరి బజార్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. పేదలకు భరోసా కల్పించి అండగా నిలిచేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే నవరత్నాల ద్వారా పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి వంటి పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఎటువంటి అవకతవకలు తావులేకుండా, పారదర్శకంగా పాలన సాగిస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ రూపొందించి అమలు పరుస్తున్న పథకాల ద్వారా రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోందని తెలిపారు.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి..

తూర్పు నియోజకవర్గం పరిధిలోని కొండ ప్రాంతాల్లో గత మూడు దశాబ్దాలుగా వేలాది మంది పేదలు నివసిస్తున్నారని అవినాష్ చెప్పారు. గుణదల, మాచవరం, చుట్టుగుంట, మొగల్రాజపురం, క్రీస్తురాజపురం తదితర ప్రాంతాల్లో గతంలో మౌలిక వసతులు కొరవడ్డాయన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు పెద్ద ఎత్తున కల్పిస్తున్నామని తెలిపారు. కాలిబాటలు, మెట్ల మార్గాలు, విద్యుత్, భూగర్భ డ్రెయినేజీ వంటి సదుపాయాలు కల్పించామన్నారు. కొట్లాది రూపాయల నిధులతో కొండ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో పేదల ఇళ్ల పట్టాల సమస్యపై దృష్టి సారిస్తామన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు కోటి నాగులు, రాఘవులు, చందా కిరణ్ తేజ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కార్తిక మాసోత్సవ పూజలు ప్రారంభం



కృష్ణలంక శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



శివగిరిపై పూజలు చేస్తున్న యువతులు



పటమటలో పూజలు చేస్తున్న మహిళలు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): నియోజకవర్గ వ్యాప్తంగా కార్తిక మాసోత్సవ పూజలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్తికమాసం మొదటి రోజు శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. కృష్ణలంక మెట్లబజార్ చివరన కృష్ణానది కరకట్ట వెంబడి వేం చేసి ఉన్న శ్రీఅన్నపూర్ణా సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి వార్ల దేవస్థానం శివనామస్మరణతో మారుమోగింది. తెల్లవారుజామున 5 గంటల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు బారులుతీరి శివుడిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాలను శివాలయం చైర్మన్ మూలంరెడ్డి సుబ్బారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి నవంబర్ 23వ తేదీ వరకు శ్రీ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వారి మాసదీక్షగా అభిషేకం జరుగుతుందన్నారు. అలాగే నవంబర్ 13న ఉదయం 11 గంటలకు బిలార్చన, సాయంత్రం 5 గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. కృష్ణలంక సర్వీస్ రోడ్డులోని శంకరమఠం, పద్మావతి ఘాట్ వెంబడి ఉన్న మార్వాడి శివాలయం భక్తులతో కళకళలాడాయి.

శివగిరిపై కార్తిక పూజలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక వాగ్దేవి జ్యోతిర్లింగ క్షేత్రం(శివగిరి)పైన కార్తిక మాసం మొదటి రోజైన బుధవారం శివలింగానికి భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, రుద్ర హోమంతో పాటుగా సాయంత్రం ప్రదోక్షపూజ, శివ కల్యాణంలో పాల్గొన్నారు. భక్తులు పాల్గొని శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జునశర్మ మాట్లాడుతూ కార్తిక మాసం అన్ని రోజులు శివగిరిపై అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తుల ప్రతిమలను మొగల్రాజపురం పరిసర ప్రాంతాల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శివనామస్మరణ చేశారు.

వైభవంగా శివ కల్యాణోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కార్తిక మాసం ప్రారంభ సందర్భంగా బుధవారం పటమట గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో గంగాధరేశ్వర స్వామి స్ఫటిక లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వయంగా శివలింగానికి అభిషేకాలు చేశారు. అనంతరం జరిగిన శివ కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రహణ శాంతి కోసం నవగ్రహ సూర్య హోమం జరిగింది.

రేపు సి.రాఘవాచారి తృతీయ వర్ధంతి సభ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విశాలాంధ్ర పత్రిక పూర్వ సంపాదకులు సి.రాఘవాచారి తృతీయ వర్ధంతి సభను శుక్రవారం సాయంత్రం 6 గంటలకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సి.రాఘవాచారి ట్రస్ట్ సభ్యులు ప్రకటనలో తెలిపారు. విశాలాంధ్ర పత్రిక సంపాదకులు ఆర్వీ రామారావు సభకు అధ్యక్షత వహిస్తారని, పాత్రికేయుడు, రచయిత, మానవ హక్కుల కార్యకర్త ఆకార్ పటేల్ అతిథిగా హాజరై 2047లో భారతదేశం–అమృతకాలంలో ఏమి ఆశించాలి? అనే అంశంపై మాట్లాడతారని చెప్పారు.

నేడు సిమెంట్ గోడౌన్స్‌లో వైద్యశిబిరం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): రాణిగారితోట, 18వ డివిజన్‌లోని సిమెంట్ గోడౌన్స్‌లో దేవినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో ప్రముఖ వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన రోగులకు ఉచితంగా మందులు ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని రాణిగారితోట, కృష్ణలంక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): తనను కొట్టడమే కాకుండా తల్లిని దూషించిన బాబాయిపై ఓ యువకుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదు చేశారు. వించిపేట గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన పఠాన్ అబ్రర్‌ఖాన్ తండ్రి ఆసిఫ్‌ఖాన్‌తో కలిసి ట్రాక్టర్ డిస్పోజల్ షాపులో పని చేస్తుంటాడు. మంగళవారం సాయంత్రం అబ్రర్‌ఖాన్ బాబాయి షాకవాజ్‌ఖాన్‌కు మరో వ్యక్తికి గొడవ జరుగుతుండటంతో అడ్డుకున్నాడు. దీంతో షాకవాజ్‌ఖాన్ అబ్రర్‌ఖాన్‌ను నెట్టి నీకెందుకు రా అని ప్రశ్నించాడు. దీంతో అబ్రర్‌ఖాన్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇది జరిగిన కొంత సమయం తర్వాత షాకవాజ్‌ఖాన్ అన్నయ్య ఇంటికి వచ్చి అబ్రర్‌ఖాన్ గురించి ఆరా తీశాడు. ఇంట్లో అబ్రర్‌ఖాన్ లేడని చెప్పిన వదినను ఇష్టం వచ్చినట్లు దూషించాడు. రాత్రి 10–30 గంటల సమయంలో మహంతిపురం నుంచి వస్తున్న అబ్రర్‌ఖాన్‌ను అడ్డగించిన బాబాయి షాకవాజ్‌ఖాన్ చేతులతో ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. దీంతో జరిగిన ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ):భర్త వేధింపులపై వివాహిత ఫిర్యాదు చేయగా పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. విజయవాడ రూరల్ గ్రామమైన అంబాపురానికి చెందిన తుమ్మల వెంకటలక్ష్మీ, రామాంజనేయులు భార్యాభర్తలు. వీరికి వివాహమై 11 ఏళ్లు అవుతుండగా, ఇద్దరు పిల్లలున్నారు. వెంకటలక్ష్మీ, రామాంజనేయుల వివాహ సమయంలో భారీగానే కట్నకానుకలను ఇచ్చారు. గత కొంత కాలంగా రామాంజనేయులు భార్యను పుట్టింటికి వెళ్లి రూ. 10 లక్షలు తీసుకురావాలని వేధిస్తున్నాడు. గతంలో ఒక సారి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొంత కాలం కాపురం సవ్యంగా సాగినా మళ్లీ ఇబ్బందులు పెట్టడంతో ఆమె పుట్టింటికి చేరింది. భర్త వేధింపులపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దుర్గమ్మకు గాజుల విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో గురువారం జరిగే గాజుల అలంకారం నిమిత్తం విజయవాడ గొల్లపూడికి చెందిన భక్తులు రూ. 25 వేల విలువైన గాజులను విరాళంగా అందచేశారు. గొల్లపూడి ఆర్యవైశ్య సేవా సంఘం రెండు విడతలుగా రూ.25 వేల విలువైన గాజులను ఆలయ ఈవో భ్రమరాంబకు అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. సంఘ అధ్యక్షులు మద్దాళి శ్రీనివాస్‌కుమార్, జనరల్ సెక్రటరీ చన్న పద్మావతి, చన్న సాంబశివరావులతో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో ఆర్థికాభివృద్ధి

పాయకాపురం(విజయవాడరూరల్) మహిళలు వృత్తి నైపుణ్యం పెంచుకుంటే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షుడు ఎం.కృష్ణప్రభు అన్నారు. ప్రకాష్‌నగర్‌లోని ఎంబీ విజ్ఞాన కేంద్రం, రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఐద్వా రాష్ట్ర సహాయం కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు రోటరీ క్లబ్ అందచేస్తున్న శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కన్వీనర్ వి.రామారాజు మహిళల స్వయం ఉపాధి కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. రోటరీక్లబ్ ప్రతినిధులు కెఎస్ఎన్ బాబు, శ్రీనివాస ఆర్య, రామ్మోహనరెడ్డి, భగవాన్, ఝాన్సీ, కె.సరోజ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ తీరు పరిశీలన



సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): విధుల నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా బుధవారం ఆయన 60వ డివిజన్ ప్రకాష్‌నగర్ ప్రాంతంలోని పలు వీధుల్లో పారిశుద్ధ్య, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్వహణ విధానాన్ని పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. విధుల్లో పారిశుద్ధ్య కార్మికులు, శానిటరీ సెక్రటరీల పని తీరును పరిశీలించి, విధులకు సకాలంలో హాజరు కావాలని కార్మికుల హాజరు వివరాలు నోటీసు బోర్డులో ఉంచాలని సూచించారు. ప్రతి నిత్యం చెత్త సేకరణకు, డ్రెయిన్లు శుభ్రపరిచేందుకు సిబ్బంది వస్తున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌లోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్, చెత్త వేయింగ్ మిషన్ పనితీరు పరిశీలించారు. ఎక్సెల్ ప్లాంట్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో చెత్త వాహనాలు నిలిచిపోవడం చూసి రెండో వేయింగ్ మిషన్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలనీ, ప్లాంట్ చుట్టూ మిగిలిపోయిన ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, ఫోర్ లైన్ వచ్చే విధంగా రోడ్లను వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ పర్యటనలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వ సహకారం

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మల్లాది విష్ణును సత్కరిస్తున్న ఐసీఏఐ సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చెప్పారు. గవర్నర్‌పేట ఆలీబేగ్ స్ట్రీట్‌లోని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను పరిశీలించి, పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు ఎవరిని సంప్రదించాలి, అనుమతులు ఎలా పొందాలనే అంశాలపై అవగాహనకు ఇలాంటి సదస్సులు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కలెక్టర్, ప్రభుత్వ అధికారులు, బ్యాంకు అధికారులు, పారిశ్రామిక ప్రోత్సాహక సంస్థలతో ప్రత్యేకంగా వర్క్ షాప్ నిర్వహించాలని విష్ణు సదస్సు నిర్వాహకులకు సూచించారు. ఎంఎస్ఎంఈలకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న బడుగు వికాసం ద్వారా ఆర్థికంగా సహాయం చేస్తోందన్నారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ చైర్ పర్సన్ గద్దం శ్రీతా శ్రీరేన్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ యాత్ర పేరుతో దేశంలోని 75 నగరాల్లో బస్సు యాత్ర ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఐసీఏఐ అవగాహన కల్పిస్తోందన్నారు. ఐసీఏఐ వైస్ చైర్మన్ వీర్ల నరేంద్రబాబు, కార్యదర్శి ఎస్.రవికిషోర్, కోశాధికారి నారాయణ తోపాటుగా జిల్లా పరిశ్రమల సమాఖ్య, ఎస్బీఐ, ఫ్యాప్సీ, ఎస్ఐడీబీఐ సిబ్బంది పాల్గొని పరిశ్రమల స్థాపనకు అవసరమైన పత్రాలు, అనుమతులు, బ్యాంకుల నుంచి రుణం పొందడం, కాలుష్య నియంత్రణ మండలి, విద్యుత్ శాఖ నుంచి అవసరమైన అనుమతులు, జీఎస్టీ చెల్లింపు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సు అనంతరం ఎమ్మెల్యే విష్ణును నిర్వాహకులు సత్కరించారు. విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింలకు ప్రభుత్వం అండగా ఉంటుంది



దేవినేని అవినాష్ కు వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు

గుణదల(విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటుందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ముస్లింలకు సామాజికంగా, ఆర్థికంగా భరోసా కల్పించే దిశగా సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. రాజకీయ పరంగా ప్రాతినిధ్యం కల్పిస్తూ ముస్లింలను ప్రోత్సహిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని చెప్పారు. ముస్లింల అభ్యున్నతి కోసం వైఎస్సార్ షాదీ తోఫా వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అంతకు ముందు ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర కార్యదర్శి షేక్ హిమవలి, ఉపాధ్యక్షులు అబ్దుల్ అజ్మతుల్లా, మౌలాలీ పాల్గొన్నారు.

త్వరలో రవాణాశాఖ నాన్ టెక్నికల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు



మాట్లాడుతున్న సంఘం జోనల్ అధ్యక్షుడు రాజుబాబు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రవాణా శాఖ నాన్ టెక్నికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీకి నవంబర్‌లో ఎన్నికలు జరుగుతాయని రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు చెప్పారు. బందరురోడ్డులోని రవాణాశాఖ ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం సంఘం జోనల్ కార్యవర్గ సమావేశం జరిగింది. రాజుబాబు మాట్లాడుతూ జోనల్ స్థాయిలో ఉద్యోగులు వివిధ అంశాలపై చేసుకున్న అర్జీలను పరిష్కరించేందుకు, ఖాళీలైన పోస్టులను భర్తీతో పాటుగా ఉద్యోగులకు పదోన్నతుల కల్పించే విధంగా అధికారులతో చర్చలు జరుపుతున్నామన్నారు. నూతన రాష్ట్ర కార్యవర్గ ఏర్పడిన తర్వాత శాఖాపరంగా ఉద్యోగులకు సంబంధిందించిన పాలసీ విషయాలను చర్చించి వాటిని పరిష్కరించే విధంగా సంఘం తరుపున కార్యాచరణ ప్రకటన చేస్తామన్నారు. జోనల్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న విషయాలపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా వినతి పత్రం ద్వారా తెలియజేస్తామన్నారు. సంఘం జోనల్ కార్యవర్గ సభ్యులు జి.ఉషాసుందరి, కేవీవీ నాగమురళి, బి.మధుసూదనరావు, కె.సతీష్, అబ్దుల్ సత్తార్, ఎం.ఆనంద్‌కుమార్, బి.చంద్రశేఖర్, కేవీఆర్ రాజు, జోగారావు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదు



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

భవానీపురం(విజయవాడ పశ్చిమ):మానవ ఇంద్రియాల్లో ప్రధానమైన కళ్లకు సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం తగదని ఏపీఎస్‌ఆర్టీసీ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యాధరపురం ఆర్టీసీ డిపోలో సంధ్య నేత్ర వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ ఎం.భార్గవరామ్, మేనేజర్ పి.రాజేష్ నేతృత్వంలో బుధవారం ఏర్పాటు చేసిన కంటి పరీక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళ్లు అనేవి మనకు దేవుడిచ్చిన అపురూపమైన నిధి అని, వాటిని జాగ్రత్తగా చూసుకోవడం మన విధి అన్నారు. ఎలాంటి కంటి సమస్యలు ఎదురైనా వెంటనే నేత్ర వైద్య నిపుణుల దగ్గర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా బస్ డ్రైవర్లు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా తగిన మూల్యం చెల్లించుకోవల్సి వస్తుందన్నారు. ఈ వైద్య శిబిరంలో 92 మంది ఆర్టీసీ సిబ్బంది పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశారు. డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామివార్లకు సహస్ర దీపాలంకరణ





కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై బుధవారం గంగా పార్వతి (దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లకు సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నటరాజ స్వామి వారి కళావేదిక వద్ద ఆది దంపతుల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తుల చుట్టూ ఏర్పాటు చేసిన సహస్ర దీపాలను భక్తులు, ఆలయ అధికారులు, సిబ్బంది వెలిగించారు. కార్తిక మాసం నెల రోజుల పాటు సహస్ర దీపాలంకరణ సేవ జరుగుతుందని పేర్కొన్నారు. సేవలో పాల్గొనే అవకాశాన్ని దేవస్థానం భక్తులకు కల్పిస్తుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

– ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)

వీఎంఆర్‌డీయే టౌన్‌ప్లానింగ్ అధికారి అరెస్టు

- పలు ప్రాంతాల్లో సోదాలు చేసిన ఏసీబీ బృందాలు
- రూ.2.07 కోట్ల అక్రమ ఆస్తుల గుర్తింపు
- అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచిన అధికారులు



వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ ఆఫీసర్ వర్ధనపు శోభన్‌బాబు (నిలబడి ఉన్న వ్యక్తి) సమక్షంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

సాక్షి, అమరావతి/విజయనగరం క్రైమ్: ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న కేసులో విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) టౌన్‌ప్లానింగ్ అధికారి వర్ధనపు శోభన్‌బాబును ఏసీబీ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. విశాఖపట్నంలోని శోభన్‌బాబు కార్యాలయంతోపాటు గాజువాకలోని ఆయన నివాసం, పాలకొల్లులోని ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లల్లో ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం నుంచి విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఏసీబీ విజయనగరం డీఎస్పీ పి.రామచంద్రరావు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, మహేష్, రమణ, శ్రీకాకుళం ఏసీబీ సీఐలు భాస్కర్ , హరి, పాలకొల్లు సీఐ శ్రీనివాసరావు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. శోభన్‌బాబుకు ఏలూరు, రాజమండ్రిలో ప్లాట్‌లు, తాడేపల్లిగూడెంలో ఇల్లు, విశాఖ లాసన్‌బే కాలనీలో ఫ్లాట్, విశాఖ సిటీలో మూడు స్థలాలు, డెంకాడలో ఫామ్‌హౌస్, రూ.23 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, సుమారు పావుకిలో బంగారం, పావుకిలో వెండి, ఇన్సూరెన్స్, ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ రామచంద్రరావు తెలిపారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం శోభన్‌బాబు రూ.2.07 కోట్ల అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్టుగా ఏసీబీ అధికారులు నిర్ధారించారు. శోభన్‌బాబును అరెస్టు చేసి విశాఖపట్నంలోని ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరిచారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పెనుమంచి గ్రామానికి చెందిన శోభన్‌బాబు 1987లో టౌన్‌ప్లానింగ్ అధికారిగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. 1997లో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పదోన్నతి పొందారు. 2019 నుంచి వీఎంఆర్‌డీఏ టౌన్‌ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్నారు.

రామాయపట్నం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు

- జాతీయ రహదారిని ఆనుకొని చేవూరు వద్ద నిర్మాణం
- దగదర్తి స్థానంలో కొత్త పోర్టు అభివృద్ధి
- డీపీఆర్ సిద్ధం చేస్తున్న ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్
- రాష్ట్ర ఏవియేషన్ సలహాదారు భరత్‌రెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రామాయపట్నం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. రామాయపట్నం వద్ద పోర్టుకు తోడు పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గతంలో ప్రతిపాదించిన దగదర్తి స్థానంలో పోర్టు, పారిశ్రామిక పార్కుకు దగ్గరగా ఉండేలా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయనున్నారు. దగదర్తి కంటే రామాయపట్నం ఎయిర్‌పోర్టు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు అనువుగా ఉండటం ఇందుకు కారణంగా చెబుతున్నారు. ఇందుకోసం జాతీయ రహదారి–16కు ఆనుకొని ఉన్న చేవూరు వద్ద సుమారు 2,064.44 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ మేరకు భూసేకరణ పనులు కూడా ప్రారంభించినట్లు రాష్ట్ర ఏవియేషన్ సలహాదారు, ఏపీ ఏవియేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఏడీసీఎల్) ఎండీ వీఎన్ భరత్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. రామాయపట్నం పోర్టుకు సమీపంలో గుడ్లూరు మండలంలోని మోచెర్ల, చేవూరు, పొట్లూరు గ్రామాల్లో విస్తరించి ఉన్న అటవీ భూమిని ఇందుకోసం వినియోగించుకుంటామన్నారు. అటవీ శాఖకు చెందిన ఈ భూమికి మరో చోట భూమిని కేటాయిస్తామని చెప్పారు. జాతీయ రహదారికి ఒకవైపు పోర్టు, మరోవైపు ఎయిర్‌పోర్టు ఉండేలా చూస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) బాధ్యతను ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు భరత్‌రెడ్డి తెలిపారు. రెండు నెలల్లో డీపీఆర్ పూర్తి అవుతుందన్నారు. తర్వాత రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం పొందుతామని చెప్పారు. ఆ తర్వాత నిర్మాణ పనులు ప్రారంభించేలా ఏపీఏడీసీఎల్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని వెల్లడించారు.

కోర్టు తీర్పు రాగానే భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

కాగా కోర్టు తీర్పు రాగానే భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు భరత్‌రెడ్డి తెలిపారు. భూసేకరణకు సంబంధించిన అంశంపై ఇప్పటికే కోర్టులో వాదనలు పూర్తయ్యాయన్నారు. త్వరలోనే దీనిపై తీర్పు వెలువడుతుందన్నారు. దీంతో ప్రస్తుతానికి ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనలో భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన షెడ్యూల్ ఖరారు కాలేదని చెప్పారు.

● తెలంగాణ

నేటినుంచి తెలంగాణలో మళ్లీ 'భారత్‌జోడో యాత్ర'

దీపావళి విరామం తర్వాత మక్తల్ నుంచి ప్రారంభం కానున్న రాహుల్ పాదయాత్ర

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' గురువారం నుంచి తెలంగాణ రాష్ట్రంలో పునఃప్రారంభం కానుంది. ఉదయం 6:30 గంటలకు నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద యాత్రను ప్రారంభించనున్నారు. ఉదయం నడకలో భాగంగా అక్కడి నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం, పెద్దచెరువు, దండుక్రాస్, గొల్లపల్లి క్రాస్‌రోడ్డు, కచ్వార్ గ్రామం మీదుగా 12 కిలోమీటర్లకు పైగా నడిచి జక్లేర్ గ్రామానికి చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం బస చేసిన తర్వాత సాయంత్రం 4 గంటలకు మళ్లీ పాదయాత్రను ప్రారంభించి జక్లేర్ క్రాస్‌రోడ్డు, గుడిగండ్ల మీదుగా 14.5 కి.మీ. ప్రయాణించి యెలిగండ్ల గ్రామానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం పాదయాత్రను కొనసాగిస్తారు. ఈ యాత్ర నవంబర్ 7 వరకు జరగనుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో పాదయాత్ర సాగనుంది. యాత్ర ముగిసిన ప్రదేశంలోనే ఆయన బస చేయనున్నారు. కాగా, నవంబర్ 4న ఆయన యాత్రలో మరోమారు విరామం తీసుకుంటారు. ఈనెల 23న కర్ణాటక నుంచి నారాయణపేట జిల్లా కృష్ణా మండలం గూడేబల్లేరు గ్రామానికి రావడం ద్వారా తెలంగాణలోకి ప్రవేశించిన రాహుల్ మొదటిరోజు యాత్ర తర్వాత దీపావళి విరామం తీసుకున్న విషయం తెలిసిందే.

నేతన్నలను చావుదెబ్బ కొడుతున్నారు

- కేంద్రంపై మంత్రి కేటీఆర్ ధ్వజం
- టీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ ఎంపీ రాపోలు ఆనంద్‌భాస్కర్

సాక్షి, హైదరాబాద్: నేత కార్మికులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు చేయూత ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం చావు దెబ్బ కొడుతోందని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అంతేస్థాయిలో పరిపుష్టి కలిగిన చేనేత రంగం ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. బీజేపీకి రాజీనామా చేసిన రాజ్యసభ మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ హయాంలో చేనేత రంగానికి ప్రత్యేక పాలసీ ఏదీ లేదని, పత్తి సాగు ఎక్కువగా ఉన్న భారత్‌లో చేనేత రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నా ప్రోత్సాహం కరువైందని దుయ్యబట్టారు. తెలంగాణకు చెందిన చేనేత కార్మికులు సూరత్, ముంబై, భివండి వంటి ప్రాంతాల్లో అత్యంత నైపుణ్యంతో వస్త్రోత్పత్తిలో కీలకంగా పనిచేస్తున్నారని చెప్పారు. వారిని సొంత రాష్ట్రానికి రప్పించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కాకతీయ టెక్స్‌టైల్ పార్క్, సిరిసిల్ల అపారెల్ పార్క్, మెగా పవర్‌లూమ్ క్లస్టర్ వంటి అనేక ప్రాజెక్టుల ఏర్పాటుకు సాయం కోరుతున్నా కేంద్రం స్పందించడం లేదని పేర్కొన్నారు. ఎనిమిదేళ్ల కాలంలో నేత కార్మికులకు ఉద్దేశించిన 8 పథకాలను కేంద్రం రద్దు చేసిందని కేటీఆర్ విమర్శించారు. చేనేత రంగంపై 5 శాతం పన్ను విధించిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. చేనేత కార్మికుల సమస్యల పట్ల సంపూర్ణ అవగాహన ఉన్న రాపోలు ఆనంద్ భాస్కర్ సేవలు బీఆర్‌ఎస్ విస్తరణలో ఉపయోగించుకుంటామని కేటీఆర్ ప్రకటించారు. తెలంగాణ భూగర్భాన్ని నదీ జలగర్భంగా మార్చిన గొప్ప నేత కేసీఆర్ అని రాపోలు ప్రశంసించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక అవమానాలు ఎదుర్కొన్నానని, బీజేపీ తనకు గుర్తింపు ఇవ్వకుండా హింసకు గురిచేసిందని వాపోయారు. జాతీయస్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా బీఆర్‌ఎస్ ఆవిర్భవిస్తుందన్నారు.

● తెలంగాణ

టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు ఎర?

- నలుగురు శాసనసభ్యుల కొనుగోలుకు విఫలయత్నం
- గువ్వల బాలరాజు, పైలట్ రోహిత్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రేగా కాంతారావుపై వల

సాక్షి, హైదరాబాద్ : ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన నలుగురు ఎమ్మెల్యేల కొనుగోలు యత్నం తీవ్ర దుమారం రేపింది. దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. మునుగోడు ఉప ఎన్నికలను ప్రభావితం చేసే రీతిలో ఓ జాతీయ పార్టీ అండదండలతో జరిగిన వ్యూహాత్మక బేరసారాలు జరిగినట్టు ఆరోపణలు రావడం రాజకీయంగా ప్రకంపనలు సృష్టించింది. తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని టీఆర్‌ఎస్ నేరుగా ఆరోపించగా.. ఆ నలుగురు హార్డ్‌కోర్ టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను మేము ఏం చేసుకుంటామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కొట్టిపారేశారు. ఈ సంఘటనపై సీబీఐతో కాని, సుప్రీంకోర్టు న్యాయమూర్తితో కాని విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు (అచ్చంపేట), బీరం హర్షవర్ధన్‌రెడ్డి(కొల్లాపూర్), పైలట్ రోహిత్‌రెడ్డి (తాండూరు), రేగా కాంతారావు(పినపాక) పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే భారీ ఎత్తున డబ్బులు, పదవులు, కాంట్రాక్టులు అప్పగిస్తామని ఎరవేసి ప్రలోభాలకు గురి చేస్తున్న ముగ్గురు వ్యక్తులను రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ పరిధిలోని అజీజ్ నగర్‌లో ఉన్న పీవీఆర్ ఫామ్‌హౌజ్‌పై దాడి చేసి, అరెస్ట్ చేసినట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర బుధవారం రాత్రి ప్రకటించారు. ఫరీదాబాద్‌కు చెందిన రామచంద్రభారతి, తిరుపతికి చెందిన సింహయాజులు, కేంద్ర మంత్రికి సన్నిహితుడని చెబుతున్న నందకుమార్ అనే ముగ్గురు వ్యక్తులు పట్టుబడినట్లు వెల్లడించారు. తిరుపతి అనే మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అంతకు ముందు సాయంత్రం ఐదు గంటలకు నలుగురు ఎమ్మెల్యేలు ఫామ్ హౌజ్‌కు చేరుకుని ముగ్గురు వ్యక్తులతో దాదాపు గంటన్నర పాటు చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ఆ తర్వాత సైబరాబాద్ కమిషనరేట్‌కు చెందిన స్పెషల్ ఆపరేషన్ టీమ్(ఎస్‌ఓటీ) ఈ దాడులు జరిపి ఫామ్‌హౌజ్‌ను దిగ్బంధం చేసింది. ఫామ్‌హౌజ్‌లో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు, సెల్‌ఫోన్‌లు, వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం జరిగినా పోలీసులు మాత్రం అధికారికంగా ధ్రువీకరించలేదు. ఒక్కో ఎమ్మెల్యేకు వంద కోట్ల రూపాయలు, పదవులు, కాంట్రాక్టులు ఇస్తామని ప్రలోభానికి గురిచేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా, బాలరాజు మినహా మిగిలిన ముగ్గురు కాంగ్రెస్ తరపున గెలిచి ఆ తర్వాత టీఆర్‌ఎస్‌లోకి పార్టీ ఫిరాయించారు.

ఎమ్మెల్యేలే సమాచారం ఇచ్చారు


దాడులు జరిగిన ఫామ్ హౌజ్ వద్ద కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ 'మమ్మల్ని ప్రలోభపెడుతున్నారని ఎమ్మెల్యేలు సమాచారం ఇచ్చారు. ఆ సమాచారం మేరకు మేము దాడులు నిర్వహించాం. ఫరీదాబాద్ పీఠాధిపతి మొత్తం ఈ వ్యవహారంలో మంతనాలు సాగించారు. డబ్బు, పదవులు, కాంట్రాక్టులు ఇస్తామని ప్రలోభపెట్టినట్లు ఎమ్మెల్యేలు చెప్పారు. ఈ కేసులో చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు. ఇదిలా ఉండగా తమను ప్రలోభపెట్టడానికి ప్రయత్నించిన వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడానికి ఆ నలుగురు ఎమ్మెల్యేలు ఇలా స్కెచ్ వేశారని సమాచారం. ఈ వ్యూహంలో భాగంగా బేరసారాల వ్యవహారాన్ని పోలీసులు రహస్య కెమెరాల్లో చిత్రీకరించినట్టు తెలిసింది. ఫామ్‌హౌస్ వద్ద రెండు బ్యాగుల్లోని రూ.15 కోట్ల నగదు, కారు (టీఎస్ 07 హెచ్‌ఎం 2777), సెల్‌ఫోన్లు, ఇతర పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ సంఘటన నేపథ్యంలో గతంలో రేవంత్‌రెడ్డి–చంద్రబాబుల ఓటుకు కోట్లు వ్యవహారం ప్రజల్లో మరోసారి చర్చకు వచ్చింది.

కేంద్ర నిధులతో మునుగోడు అభివృద్ధి

- బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- పార్టీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

మునుగోడు: అభివృద్ధికి దూరంగా ఉన్న మునుగోడు నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ నిధులతో మునుగోడును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ఎన్నికల స్టీరింగ్ కమిటీ చైర్మన్ వివేక్ వెంకటస్వామి, ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావుతో కలసి పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను గాలికి వదిలేసి కేవలం తన కొడుకు రాజకీయ భవిష్యత్, బిడ్డ వ్యాపారాలపై ప్రత్యేక దృష్టిపెట్టారని, అందుకు తన అధికారాన్ని వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ నేడు అప్పులపాలై కనీసం ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి చేరుకుందన్నారు. బీజేపీకి ఓట్లు వేస్తే పెన్షన్ రద్దుచేస్తామని ఆసరా లబ్ధిదారులను మంత్రి జగదీశ్‌రెడ్డి బెదిరిస్తున్నారని రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. కేంద్ర పథకం ద్వారా ప్రతి పేదవాడికి ఇంటి నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు సమానంగా కేటాయించాల్సిన స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్‌ను కేసీఆర్ కేవలం మూడు నియోజకవర్గాలకే మళ్లిస్తున్నారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు.

కార్తిక మాసోత్సవాలకు కొండపల్లి ఖిల్లా సిద్ధం



కొండపల్లిలో ఆధునికీకరించిన కొండపల్లి ఖిల్లా ముఖద్వారం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న కొండపల్లి ఖిల్లా బుధవారం నుంచి ప్రారంభం కానున్న కార్తిక మాసోత్సవాలకు సిద్ధమైంది. ప్రతి ఏటా వనమహోత్సవాల సందర్భంగా ఖిల్లా సందర్శించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాక రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలి వస్తారు. సందర్శకుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని పర్యాటక శాఖ అన్ని ఏర్పాట్లూ చేసింది. పూర్వం సిరిసంపదలు, సరస్వతీ, సంగీత శిల్ప కళలకు నిలయంగా ఉన్న రాజదుర్గం నేడు పర్యాటకులకు గత వైభవం చాటుతోంది.

కొండపల్లి ఖిల్లాగా రూపాంతరం

కొండపల్లిలో ఎత్తయిన కొండల మీద అభేద్యమైన దుర్గాన్ని కొండవీటి రెడ్డిరాజు ప్రోలాయ వేమారెడ్డి 1350లో నిర్మించారు. కృష్ణా, గుంటూరు జిల్లాలు అప్పట్లో రెడ్డిరాజుల పాలనలో ఉండేవి. రెండు జిల్లాల మధ్య రాత్రి వేళ దివిటీలతో సంజ్ఞలు చేసుకునేవారు. రెడ్డిరాజుల తర్వాత కొండపల్లి దుర్గం ఒడిశా గజపతుల వశమైంది. 1463–82 మధ్య రెండవ మహ్మద్‌షా గజపతులను ఓడించి ఖిల్లా ఆక్రమించి ఖిల్లా కింద ఓ గ్రామం నిర్మించారు. ఆ గ్రామం కట్టుబడి సరిగ్గా సాగనందున కొండడు అనే ఒక యాచకుడిని, పల్లె అనే అతని భార్యను బలి ఇచ్చాడట. అప్పటి నుంచి ఆ గ్రామానికి కొండపల్లి అనే పేరు వచ్చిందని చెబుతారు. కొండ మీదకు వెళ్లేందుకు పూర్వం రెండు దారులు ఉండేవి. ఒకటి రాజబాట, రెండోది రహస్య మార్గం.



కొండపల్లి ఖిల్లా మ్యూజియంలో ఏర్పాటుచేసిన పురాతన శిల్ప సంపద



కొండపల్లి ఖిల్లాకు చేరే ఆహ్లాదకరమైన ఘాట్ రోడ్డు

గత వైభవానికి సాక్ష్యాలు

ఖిల్లాపైన సింహ ద్వారం దాటగానే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిన రాజసౌధాలు, సైనికులు నివసించే గృహాలు, ధాన్యాగారాలు, కారాగారం, గజశాల, అశ్వశాల, నర్తనశాల, రాణీమహల్, మార్కెట్‌యార్డు కనిపిస్తాయి. రాజభవనాల వెనుక కోనేరు కనిపిస్తుంది. దుర్గాన్ని శత్రువుల బారి నుంచి రక్షించుకునేందుకు నాలుగు వైపులా ఎత్తయిన, బలిష్టమైన నాలుగు బురుజులు ప్రత్యేకంగా నిర్మించారు.

రాయలవారి ముట్టడి

శ్రీకృష్ణదేవరాయలు 1516లో ఈ కోటను స్వాధీనం చేసుకునేందుకు మూడు నెలలు యుద్ధం చేశాడు. అప్పుడు విజయనగరం సైన్యానికి తాగటానికి తాగునీరు కోసం మంత్రి తిమ్మరుసు ఇబ్రహీంపట్నం మెయిన్‌రోడ్డు పక్కన ఒక బావి తవ్వించాడు. ఈ బావిని నేటికీ తిమ్మరుసు బావిగా పిలుస్తారు. తర్వాత ఈ కోట గోల్కొండ నవాబుల చేతుల్లోకి వెళ్లింది. వీరి కాలంలోనే ఈ కోటకు ఖిల్లా అనే ఉర్దూ పేరు పెట్టారు. గోల్కొండ సుల్తాన్ అయిన అబ్దుల్ హసన్‌తానీషా (1672–82) కాలంలో దుర్గానికి పడమటి దిక్కున గోల్కొండ దర్వాజా నిర్మించారు. ఈ ద్వారం నుంచి తానీషా తన సైన్యంతో గోల్కొండ వెళ్లేవాడు. దుర్గానికి ఉత్తరం వైపు బాలీహిస్సార్ (భోగం దాని మేడ) అనే భవనాన్ని నిర్మించారు. 1766 మార్చిలో జనరల్ క్లైవ్ లాయిడ్ ముస్లింలను ఓడించి ఖిల్లా స్వాధీనం చేసుకున్నారు.

ఆధునిక మ్యూజియం

గతంలో గజశాలగా ఉన్న భవనంలో మూడేళ్ల క్రితం సెంట్రల్ ఏసీ మ్యూజియం ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న పురావస్తు సంపదను పర్యాటకుల కోసం మ్యూజియంలో ఏర్పాటు చేశారు. రాత్రి వేళ ప్రదర్శించే లేజర్‌షో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ మహాదుర్గం అనేక మంది రాజుల చేతులు మారి భయంకరమైన దాడులకు గురై నేడు పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది.

వైఎస్సార్ పురస్కారాల కార్యక్రమానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు



ఏ కన్వెన్షన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సబ్ కలెక్టర్ అదితి సింగ్

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు నవంబర్ 1వ తేదీన నగరంలోని ఏ కన్వెన్షన్ హాలులో జరపతలపెట్టిన వైఎస్సార్ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఎచీవ్‌మెంట్, వైఎస్సార్ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డులను ప్రదానం చేసేందుకు వివిధ రంగాలకు చెందిన 30 మందిని ఎంపిక చేసిందన్నారు. అవార్డు గ్రహీతలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా లైజనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అవార్డీలకు స్వాగతం పలికి వైఎస్సార్ సెల్ఫీ పాయింట్ వద్దకు తీసుకుని వెళ్లాలని సూచించారు. సెల్ఫీ ఫొటో తీసిన అనంతరం వారికి కేటాయించిన ప్రత్యేక సీట్లలో ఆసీనులయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవార్డు గ్రహీతలు ఒక్కొక్కరికీ ఒక్కో టేబుల్‌ను వరుస క్రమంలో కేటాయిస్తారన్నారు. వైఎస్సార్ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్, వైఎస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డుల విశిష్టతను తెలుపుతూ ముద్రించిన బుక్‌లెట్లను ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలన్నారు. అవార్డుల ప్రదానోత్సవం తర్వాత ముఖ్యమంత్రితో అవార్డు గ్రహీతలు గ్రూప్ ఫొటో తీసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఏర్పాట్లలో ఎక్కడా లోటు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

పతక విజేతలకు డీఆర్‌ఎం అభినందన



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించిన డీఆర్‌ఎం శివేంద్రమోహన్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): జాతీయస్థాయిలో జరిగిన పలు టోర్నమెంట్లలో పతకాలు సాధించిన విజయవాడ డివిజన్ క్రీడాకారులను డీఆర్‌ఎం శివేంద్ర మోహన్, ఏడీఆర్‌ఎం డి.శ్రీనివాసరావు, డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్, సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర బి.టి అభినందించారు. ఇటీవల బెంగళూరులో జరిగిన జాతీయ ఓపెన్ అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో హెప్టాథ్లాన్‌లో రజత పతకం సాధించిన ఎం.సౌమ్య, ముంబైలో జరిగిన ఆల్ ఇండియా రైల్వే బిలియర్డ్స్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన ఎల్.దుర్గాప్రసాద్‌తో పాటు కాంస్య పతకం సాధించిన పి.జి బెన్ని టోర్నమెంట్ అనంతరం నగరానికి చేరుకుని, బుధవారం మర్యాదపూర్వకంగా డీఆర్‌ఎంను ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు. జాతీయస్థాయిలో డివిజన్‌కు గుర్తింపు తీసుకువచ్చిన డివిజన్ క్రీడాకారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని చారిత్రాత్మక విజయాలు సాధించాల్సిందిగా ఆకాంక్షించారు.

మహిళల రక్షణ కోసం మరిన్ని మార్పులు

- సిబ్బంది సంక్షేమానికి పోలీసు శాఖ పెద్దపీట
- విలేకరులతో ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు



విలేకరులతో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు, చిత్రంలో ఎస్పీ జాషువా

కోనేరుసెంటర్(మచిలీపట్నం): మహిళల రక్షణకు పోలీసుశాఖతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని మార్పులు తీసుకువస్తోందని ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రమైన మచిలీపట్నం విచ్చేసిన ఆయన బందరు డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మహిళలు సమాజంలో ఎదుర్కొనే నేరాలపై అవగాహన కలిగించేందుకు పోలీసుశాఖ నిరంతరం శ్రమిస్తోందన్నారు. మహిళలకు ఎటువంటి సమస్య ఉత్పన్నమైనా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేసే విధంగా చైతన్యపరుస్తున్నట్లు చెప్పారు. మహిళలకు సంపూర్ణంగా న్యాయం చేసేందుకు పోలీసుశాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని అన్నారు. మహిళల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసులను గడప గడపకు పంపి సమస్యలపై ఆరా తీయిస్తున్నట్లు చెప్పారు. అధికారుల దృష్టికి వచ్చిన మహిళల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

యాప్‌ల వినియోగంలో అప్రమత్తంగా...

లోన్‌యాప్‌ల పేరుతో ఇటీవల సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని డీఐజీ అన్నారు. రేంజ్ పరిధిలో ఇప్పటివరకు అనేక కేసులు నమోదు అయినట్లు చెప్పారు. కొంతమంది జరిగిన అన్యాయాన్ని పోలీసులకు చెప్పకుండా వారిలో వారే మథనపడిపోతున్నారన్నారు. అలాంటి కేసులు పోలీసుల దృష్టికి వస్తే బాధితుల ఇళ్లకు వెళ్లి మరీ ఫిర్యాదులు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రేంజ్ పరిధిలో ఇప్పటివరకు 30 మంది సైబర్ నేరగాళ్లను పట్టుకుని దాదాపు మూడు కోట్లు సీజ్ చేశామన్నారు. వారి నుంచి మరింత సమాచారం రాబట్టి లోతుగా విచారణ చేస్తున్నట్లు చెప్పారు. లోన్‌యాప్‌ల పేరుతో ఇతర దేశాల నుంచి నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిని సైతం ఆయా ప్రాంతాలకు వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ప్లేస్టోర్‌లో యాప్‌లను డౌన్‌లోడ్‌చేసుకునేటప్పుడు ఒకటికి పదిమార్లు ఆలోచించుకోవాలన్నారు. లోన్‌యాప్‌ల విషయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. లేదంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని అన్నారు. సైబర్ నేరాలకు గురైన బాధితుల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటుచేశామని, ఆ నంబరుకు ఫిర్యాదు చేస్తే సిబ్బంది వెంటనే స్పందిస్తారని వివరించారు.

చార్జ్‌షీట్‌ల విషయంలో మూడో స్థానం

అరవై రోజుల్లో చార్జ్‌షీట్‌లు వేసే విషయంలో 97.3 శాతంతో మన రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రధానంగా పోక్సో, రేప్ కేసుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీసుశాఖ అనేక మార్పులు తీసుకువచ్చాయన్నారు. పోలీస్‌స్టేషన్‌ల నిర్వహణ విషయంలో నిరంతరం మార్పులు చేసుకుంటూ వెళ్లాల్సి ఉందన్నారు. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌లకు అత్యధికంగా పేదలు వస్తుంటారన్నారు. పోలీసు శాఖలోకి అదే కోవకు చెందిన అనేక మంది సిబ్బంది వస్తుంటారన్నారు. కాబట్టి పేదల పక్షాన పోలీసు సిబ్బంది కచ్చితంగా ఉంటారన్నారు. తద్వారా సామాన్యులకు సమన్యాయం జరుగుతుందన్నారు. వీటితో పాటు రాజీ మార్గమే రాజమార్గం అనే నినాదంతో లక్షల్లో కేసులు పరిష్కరిస్తామన్నారు.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

పోలీసు సిబ్బంది సంక్షేమానికి పోలీసుశాఖ పెద్దపీట వేస్తోందన్నారు. సిబ్బంది ఎదుర్కొనే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపుతారన్నారు. సిబ్బంది సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఎల్లప్పుడూ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. పని ఒత్తిడి తగ్గించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. సిబ్బంది సైతం నిజాయతీతో విధులు నిర్వర్తించాలన్నారు. నిజాయతీని ఎంత ప్రోత్సహిస్తామో అవినీతికి పాల్పడే సిబ్బందిని అంతగా శిక్షించేందుకు వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో కృష్ణాజిల్లా ఎస్పీ పి.జాషువా పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



ఎఫ్‌సీఐ క్రికెట్ టోర్నమెంట్ కప్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ జిల్లాల జట్ల కెప్టెన్లు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు క్రికెట్ స్టేడియంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వార్షిక క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. పోటీలను ఎఫ్‌సీఐ జనరల్‌మేనేజర్ చంద్రశేఖర్ జోషి బుధవారం ప్రారంభించారు. టోర్నీలో జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో విజేతలుగా నిలిచిన నెల్లూరు, శ్రీకాకుళం, అమరావతి, కర్నూలు జట్లు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాయి. తాడేపల్లిగూడెం, కాకినాడ జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. గురువారం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌తో క్రికెట్ టోర్నమెంటు ముగిస్తుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీసీసీఐ క్యూరేటర్ రమేష్, శ్రీనివాస రావు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం ॥ 27-10-2022

● ఫుడ్ ఎంట్రప్రెన్యూర్


అనల్ కొటాక్

అనల్ కొటాక్‌ను
గుజరాత్ ఎంగెస్ట్ ఫుడ్ ఎక్స్‌పర్ట్‌గా శ్లాఘిస్తారు.
చిన్న వయసులో జాతీయ స్థాయిలో
గుజరాతీ వంటలకు గుర్తింపు తేవడమే
ఆమె ఘనత.
యూ ట్యూబ్‌లో వీడియోలతోపాటు
మూడు నగరాల్లో
'ది సీక్రెట్ కిచెన్' పేరుతో
నడుపుతున్న సొంత రెస్టరెంట్లు
కిటకిటలాడుతుంటాయి.
ఇంటి ఫంక్షన్‌లో వంటవాళ్లు రాకపోయేసరికి
అనుకోకుండా గరిటె పట్టిన అనల్
నేడు బాండీలో కరెన్సీకి పోపేస్తోంది.

ఆమె వంటకు క్యూ కడతారు





పెళ్లయ్యాక, కోడలి హోదాలో ఒక రెస్టరెంట్ ప్రారంభించాలంటే ఎన్ని ఇబ్బందులుంటాయో అనల్‌ని అడగాలి.

'నేను వడోదరాలో నా తొలి రెస్టరెంట్‌ను ప్రారంభించాలనుకున్నాను. దాని పని రాత్రి పది దాకా జరిగేది. అప్పుడు ఇల్లు చేరేదాన్ని. అది చూసి ఇరుగుపొరుగు వారు మా అత్తగారి దగ్గరకు వెళ్లి ఏమిటేమిటో చెప్పేవారు. మీ కోడలు హోటలు నడిపితే ఇంట్లో వంట ఎవరు చేస్తారు? అత్తగారు అయ్యాక కూడా మీరే వండుతున్నారా? మీకు ఇప్పుడు మీ కోడలు సంపాదించాల్సినంత డబ్బు అవసరం ఏమొచ్చింది? బాగనే ఉన్నాయిగా మీకు... ఇలా మాట్లాడేవారు. కాని మా అత్తగారు, మామగారు, నా భర్త ఫుల్ సపోర్ట్ ఇచ్చారు. అందుకే మొదలైన రెండు నెలల్లో నా రెస్టరెంట్– ది సీక్రెట్ కిచెన్ సూపర్ హిట్ అయ్యింది' అంటుంది అనల్ కొటాక్.

అనల్‌కు ఇప్పుడు వడోదర, సూరత్, అహ్మదాబాద్‌లలో 'ది సీక్రెట్ కిచెన్' పేరుతో రెస్టరెంట్లు ఉన్నాయి. ఇవి కాక కెఫేలు ఉన్నాయి. ఆస్ట్రేలియాలో కూడా చైన్ రెస్టరెంట్లు ఉన్నాయి. ఇవన్నీ భర్త సపోర్ట్‌తో అనల్ నడుపుతోంది. ఫుడ్ ఎంట్రప్రెన్యూర్‌గా ఆమె సాధించిన ఈ విజయం సామాన్యమైనది కాదు.

మసాలా రహస్యం

'నాకు రెస్టరెంట్ ప్రారంభించాలనిపించింది. కాని జనం డబ్బు తీసుకుని ఆహారం అమ్మాలి. అది ఎంత రుచిగా ఉండాలి. మన దేశం మసాలాలకు పట్టుగొమ్మ. ఆ మసాలాల రహస్యం తెలుసుకోవాలనుకున్నాను. సొంతగా మసాలాలు తయారు చేశాను. ఆ రహస్య మసాలాలతో నా రెస్టరెంట్ 'ది సీక్రెట్ కిచెన్'లో వంటలు చేశాను. రెండు నెలల్లో పేరు వచ్చింది. ఎంత పేరంటే ముంబై నుంచి గుజరాతీలు వడోదరా వచ్చి మరీ తినడం మొదలెట్టారు' అంటుంది అనల్. గుజరాత్‌లో సౌత్ ఇండియన్ రెస్టరెంట్‌ను 'సౌత్‌ఏకె' పేరుతో తెరిచిందామె.

■ **వంట పిచ్చి**

'చిన్నప్పటి నుంచి నాకు వంట అంటే ఆసక్తి ఉండేది. మాది కలిగిన కుటుంబం. అమ్మమ్మ, నానమ్మ రకరకాల వంటలు చేసేవారు. వారిలాగా వండటం ఇప్పటికీ నాకు అసాధ్యం. కాని నేర్చుకున్నాను. నాకు హోటల్ మేనేజ్‌మెంట్ చేయాలని ఉండేది. మా నాన్న 'ఏంటి వంట చదువు చదువుతావా?' అన్నారు. దాంతో ఫ్యాషన్ డిజైనింగ్ చేశాను నిఫ్ట్‌లో. కాని వంట మీద ఆశైతే చావలేదు. అప్పుడే 'కలర్స్ గుజరాతీ' చానల్‌లో 'రసోయి షో' అని వచ్చేది. అందులో పాల్గొనాలని వెళితే నీకింకా 19 ఏళ్లే. ఇక్కడంతా 40 ఏళ్ల గృహిణులు ఉన్నారు... నువ్వు నెగ్గలేవు అని పంపించేశారు. మరుసటి సంవత్సరం నా పెళ్లికి మెహందీ జరుగుతుండగా ఆ చానల్ నుంచి అదే షో కోసం ఆడిషన్‌కు పిలిచారు. ఇంట్లో అమ్మకు మస్కా కొట్టి వెళ్లి ఇచ్చి సెలెక్ట్ అయ్యాను. పెళ్లయ్యాక ఆ షోలో పాల్గొంటే ఫైనల్ స్టేజీకు చేరి 'యంగెస్ట్ చెఫ్ ఆఫ్ గుజరాత్'గా అవార్డు అందుకున్నాను. ఆ పాపులారిటీతో అదే చానల్‌వారు వంట షోకు నన్ను యాంకర్‌గా తీసుకున్నారు. అలా నేను వంటల ప్రపంచంలో అడుగుపెట్టాను' అంటుంది అనల్.

■ **డిప్రెషన్**

'రెస్టరెంట్ బాగా నడుస్తున్నప్పుడు ప్రెగ్నెంట్ అయ్యాను. దాంతో అమ్మా నాన్న, అత్తమామలు పని తగ్గిచ్చుకో... బాబుకు టైమ్ ఇవ్వాలి అనడం మొదలెట్టారు. గర్భంతో ఆనందంగా ఉండాల్సిన సమయంలో నా పని నేను చేసుకోలేనా అని డిప్రెషన్ మొదలయ్యింది. చాలా బాధ పడ్డాను. కాని లోపలి నుంచి నా బిడ్డ నాకు ధైర్యం చెప్పినట్టు అనిపించింది. నేను నీకు బలమే అవుతానమ్మా... బలహీనతగా మారను అన్నట్టుగా భావించి మళ్లీ మామూలుగా పనిలో పడ్డాను. కొడుకు పుట్టాడు. వాడికి మూడేళ్లు. పొద్దున వెళ్లి తిరిగి రాత్రి ఎనిమిదికే వాణ్ణి చూస్తాను. కాని ఉన్నంతసేపు వాడికి పూర్తి సమయం ఇస్తాను. వాడికి మంచి అమ్మగా ఉంటూనే నేను సాధించాల్సిన విజయాలన్నీ సాధిస్తాను' అంది అనల్.

అనల్ ఇప్పుడు గృహిణుల కోసం తన సొంత మసాలాలను 'టిఎస్‌కె' బ్రాండ్ మీద అమ్ముతోంది కూడా. ఇంట్లో నలుగురి కోసం వండేది వంటే. కాని అందులో ప్రావీణ్యం, ప్రయత్నం ఉంటే వంటతో కూడా ఐశ్వర్యం పొందవచ్చు. అందుకు అనల్ ఒక ప్రత్యక్ష ఉదాహరణ.

స్పృహ

'నా కూతురు వయసు కూడా లేదు. ఈ అమ్మాయి నాకు ఏం చెబుతుంది' అనుకుంది ఒక అమ్మ.
అయితే ఆ అమ్మాయి చెప్పిన మంచిమాటలు విన్న తరువాత, ఆ అమ్మ తన దగ్గరకు వచ్చి
'చల్లగా జీవించు తల్లీ' అని ఆశీర్వదించింది.
నలుగురికి ఉపయోగపడే పనిచేస్తే అపూర్వమైన ఆశీర్వాదబలం దొరుకుతుంది.
అది మనల్ని నాలుగు అడుగులు ముందు నడిపిస్తుంది...

అమ్మలు మెచ్చిన కూతురు


గ్రామీణ ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సెహెర్ మీర్

పుల్వామా (జమ్ము–కశ్మీర్) జిల్లాలోని పంపోర్ ప్రాంతానికి చెందిన పదిహేడు సంవత్సరాల సెహెర్ మీర్ క్లాస్‌రూమ్‌లో పాఠాలు చదువుకోవడానికి మాత్రమే పరిమితం కావడం లేదు. సమాజాన్ని కూడా చదువుతోంది. ఈ క్రమంలోనే ఎన్నో సమస్యల గురించి తెలుసుకుంది. వాటి గురించి విచారించడం కంటే తన వంతుగా ఏదో ఒకటి చేయాలనుకుంది.

తన ఆలోచనలో భాగంగా మిత్రులతో కలిసి 'ఝూన్' అనే స్వచ్ఛందసంస్థను ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత, శుభ్రమైన న్యాప్‌కిన్‌ల వాడకం, రుతుక్రమం, అపోహలు... ఇలా ఎన్నో విషయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది మీర్.


సెహెర్ మీర్

మొదట్లో 'ఈ చిన్న అమ్మాయి మనకేం చెబుతుందిలే' అన్నట్లుగా చూశారు చాలా మంది. కొందరైతే సమావేశానికి పిలిచినా రాలేదు. ఆతరువాత మాత్రం ఒకరి ద్వారా ఒకరికి మీర్ గురించి తెలిసింది.

'ఎన్ని మంచి విషయాలు చెబుతుందో' అని మెచ్చుకున్నారు.

నెలసరి విషయాలతో పాటు మానసిక ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ గురించి కూడా తన బృందంతో కలిసి ఊరూరు తిరుగుతూ అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది మీర్.


కొద్దిమందితో మొదలైన 'ఝూన్'లో ఇప్పుడు యాభై మందికి పైగా టీనేజర్స్ ఉన్నారు.

'ఝూన్‌లో పనిచేయడం ద్వారా నాకు తెలిసిన నాలుగు మంచి విషయాలను పదిమందికి తెలియజేయడంతో పాటు, రకరకాల గ్రామాలకు వెళ్లడం ద్వారా సామాజిక పరిస్థితులను తెలుసుకోగలుగుతున్నాను' అంటుంది నుహా మసూద్.

'తెలిసో తెలియకో రకరకాల కారణాల వల్ల నెలసరి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోక పోవడం వల్ల చాలామంది అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో మహిళలు శానిటరీ న్యాప్‌కిన్‌లను కొనకపోవడానికి కారణం డబ్బులు లేక కాదు, ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో అనుకోవడం, ఇది చాలా రహస్య విషయం, ఎవరికీ తెలియకూడదు అనుకోవడం! ఈ పరిస్థితులలో మెల్లగా మార్పు తీసుకువచ్చినందుకు సంతోషంగా ఉంది' అంటుంది మీర్.

'ఝూన్' ఎన్నో భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుంది. వాటిని అందుకోవడానికి చురుగ్గా అడుగులు వేస్తోంది.

యంత్ర తంత్రం తెలిసిన తరం



రోబో అంటే యూత్‌కు
నిన్న... వినోదం.
నేడు ... విజ్ఞానం, అధ్యయనం.
రేపు... లక్ష్యాన్ని చేధించడం.
భవిష్యత్‌లో ఉద్యోగుల పనితీరులో
మార్పు రావడానికి రోబోలు,
మిలీనియల్స్ కీలక పాత్ర
పోషించబోతున్నారనేది సాంకేతిక
రంగ విశ్లేషకుల మాట. రోబోలపై
మిలీనియల్స్ ఇష్టాన్ని, స్నేహాన్ని
చూస్తే అది నిజమే అనిపిస్తుంది...

చెన్నైకి చెందిన ఆశ్రితకు హైస్కూల్ రోజుల నుంచి సైన్స్ ఫిక్షన్ సినిమాలలో రోబో సినిమాలు అంటే తెగ ఇష్టం. రోబో కాప్, వాల్–ఇ, బ్లేడ్ రన్నర్....మొదలైన హాలీవుడ్ సినిమాల నుంచి రజనీకాంత్ 'రోబో' సినిమా వరకు బోలెడు విషయాలు మాట్లాడుతుంది.

రోబోలపై ఆమె ఆసక్తి సినిమాలకే పరిమితం అయితే పట్టించుకోనక్కర్లేదు. టెకీ ఫ్యాషన్ బాటలో రోబోటిక్స్ రంగంలో భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుంటుంది.

కాల్పనిక బాట నుంచి బయలుదేరి రోబోటిక్స్ రంగంలో కెరీర్ వెదుక్కుంటున్న వారిలో ఆశ్రితలాంటి వాళ్లు ఎంతోమంది ఉన్నారు. ఇలాంటి వారి కోసం మైక్రో–రోబోటిక్స్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, మెడికల్ రోబోటిక్స్, రోబోట్ మోషన్ ప్లానింగ్.... ఇలా ఎన్నో రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

యూత్ పల్స్

తొలి హ్యూమనాయిడ్ రోబోట్ 'ఎరిక్' నుంచి నిన్నా మొన్నటి 'సోఫియా' వరకు రకరకాల రోబోల గురించి దిల్లీకి చెంది ప్రీతి అనర్గళంగా మాట్లాడగలదు. ఆమెకు రోబోటిక్స్ ఇంజనీర్ కావాలనేది కల.

'రోబోటిక్ ఇండస్ట్రీలో యూత్‌కు అపారమైన అవకాశాలు ఉన్నాయి. అయితే అవి ఉద్యోగాలు మాత్రమే కాదు ఎప్పటికప్పుడు మనలోని సృజనాత్మకతను తట్టిలేపే సవాళ్లు' అంటుంది ప్రీతి.

ప్రపంచవ్యాప్తంగా రోబోటిక్స్ రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రోబోటిక్స్ ఆటోమేషన్ ఇంజనీర్, రోబోటిక్స్ వెల్డర్, రోబోటిక్స్ టెక్నీషియన్స్, కంట్రోల్స్ ఇంజనీర్, రోబోటిక్స్ పర్‌సెప్షన్ అండ్ నెవిగేషన్ స్పెషలిస్ట్... ఇలా ఎన్నో ఉద్యోగ అవకాశాలు యూత్ కోసం ఎదురు చూస్తున్నాయి.

కోల్‌కతాకు చెందిన సోహ ప్లస్ టు చదువుతుంది. తన భవిష్యత్ కల... రోబో తయారీ! అలా అని కమ్మని కలలు కంటూ కూర్చోలేదు. లక్ష్యాన్ని చేరుకోవడానికి ఏ మార్గం ద్వారా వెళ్లాలి అనేదానిపై తనకు మంచి అవగాహన ఉంది.

'ఎక్స్‌ప్లోరింగ్ కట్టింగ్–ఎడ్జ్ రోబోటిక్స్' 'రైజ్ ఆఫ్ ది రోబోట్స్'లాంటి పుస్తకాలు ఎప్పుడూ తిరిగేస్తుంటుంది సోహ.

పుస్తకాలు చదవడంతో పాటు రోబో టెక్నాలజీపై దినపత్రికలలో వచ్చే ఆర్టికల్స్ కట్ చేసి దాచుకోవడం సోహకు ఇష్టం.

'రోబోలపై నా కలలను ఒక నోట్‌బుక్‌లో ఎప్పటికప్పుడు రికార్డ్ చేస్తుంటాను. వేరే వాళ్లకు అవి చదివితే నవ్వు రావచ్చు. అయితే నా కలలపై నాకు నమ్మకం ఉంది' అంటుంది సోహ.

భవిష్యత్‌లో ఉద్యోగుల పనితీరులో మార్పు రావడంలో మిలీనియల్స్, రోబోలు కీలకం అవుతారనేది ఒక అంచనా.

'రోబోల వల్ల ఉద్యోగాలు పోతాయి అనే భయం ఉంది. అయితే నెక్స్ట్ జెనరేషన్ రోబోలతో ఆ ప్రమాదం లేదు. అవి ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించడం మాత్రమే కాదు, పనితీరు, నైపుణ్యాలను మెరుగుపరుస్తాయి. 2025 నాటికి కొలబ్రెటివ్ బోట్స్ గణనీయంగా పెరగనున్నాయి' అంటున్నారు సాంకేతిక విశ్లేషకులు.

టెక్నాలజీ, హెల్త్‌కేర్, ఫైనాన్సియల్ సర్వీస్ రంగాలు మిలీనియల్ టాలెంట్‌కు ఆహ్వానం పలుకుతున్నాయి. దీనికి కారణం వారికి యంత్ర భాష తెలుసు. యంత్ర హృదయం తెలుసు. యంత్రుడి సహాయంతో తమను తాము ఎలా సృజనాత్మకంగా మలుచుకోవాలో కూడా బాగా తెలుసు!

సైబర్ టాక్

కేవైసీ అప్‌డేట్ చేస్తున్నారా?!


ప్రతీకాత్మక చిత్రం

బ్యాంక్/ఆధార్ కార్డ్ /పాన్‌కార్డ్‌ల కేవైసీ అప్‌డేట్ చేయమంటూ మన ఫోన్లకు మెసేజ్‌లు వస్తుంటాయి. లేదంటే, ఆ ఖాతాలు క్లోజ్ అవుతాయంటూ ఆ మెసేజ్ సూచిస్తుంటుంది. దీంతో అది నిజమే అని నమ్మి ఆ లింక్‌పై క్లిక్ చేసి, మన వివరాలను ఫిల్ చేస్తుంటాం. ఇటీవల కేవైసీ అప్‌డేట్ అనే మెసేజ్‌ల లింక్స్ వల్ల చాలా మంది ఆర్థికంగా మోసపోతున్నట్టు సైబర్ నివేదికలు చూపుతున్నాయి. కేవైసీతో పాటు క్యాష్‌బ్యాక్, క్రెడిట్‌కార్డ్ రివార్డ్ పాయింట్ల గడువు ముగిసిందని, వివరాలను ఇవ్వమంటూ మోసగాళ్లు మెసేజ్‌ల రూపంలో మోసాలకు పాల్పడుతున్నారు.

దేశం మొత్తం నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు దూసుకుపోతోందన్న విషయం మనకు తెలిసిందే. UPI అనేది డిజిటల్‌గా చెల్లింపులు చేయడానికి వేగవంతమైన పద్ధతిగా అపారమైన ప్రజాదరణను పొందుతోంది. వినియోగదారుడు నగదు/ చెక్కు చెల్లించడానికి మాత్రమే కాదు ఇతరత్రా బ్యాంక్ లావాదేవీలకు ఇంటర్నెట్ ద్వారా లాగిన్ అవడం అన్ని విధాలుగా సమయాన్ని ఆదా చేయడమే ఈ వేగానికి కారణమైంది. అయితే, సౌలభ్యం ఎప్పుడైనా దానికి సంబంధించిన బాధ్యతల వాటాతో వస్తుందన్నది నిజాన్నిగుర్తించాలి. అప్పుడే జరిగే అనర్థాలకు అడ్డుకట్ట వేయగలం. అని UPI యాప్‌లు అంటే గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎమ్‌లు నగదు లావాదేవీలలో పటిష్టమైనవి, సాంకేతికంగా అత్యంత సురక్షితమైనవిగా పేరొందాయి. అయితే ఫిషింగ్, విషింగ్, స్మిషింగ్, మాల్వేర్, ఐఎమ్ క్లోన్, ఇతర మార్గాలను ఉపయోగించి డబ్బును దొంగిలించడానికి స్కామర్‌లు సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలతో దాడి చేస్తున్నారు, జాగ్రత్త వహించండి.

■ **మోసాలు పలు విధాలు..**

బ్యాంక్/ఆధార్ కార్డ్/ పాన్ కార్డ్..ల KYC ని అప్‌డేట్ చేయమని వినియోగదారులను కోరుతూ సంక్షిప్త లింక్‌లతో కూడిన ఇ–మెయిల్ లేదా టెక్స్ట్ మెసేజ్ ఎవరికైనా రావచ్చు. తెలియక ఆ లింక్‌పై క్లిక్ చేసి, వివరాలను పూరించవచ్చు. అంతేకాదు, కొందరు బాధితులు OTP వివరాలను కూడా పూరిస్తారు. దీంతో పాటు బాధితుడి అన్ని వివరాలు స్కామర్ల ఫోన్‌కు ఫార్వర్డ్ అవుతాయి. తర్వాత వారు బాధితుడి ఖాతా నుండి నగదును సులువుగా బదిలీ చేసుకుంటారు.

■ **రివార్డ్ పాయింట్స్**

స్కామర్‌లు రీఫండ్ / క్యాష్ బ్యాక్/ క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్ల గడువు ముగియడం, వారి వివరాలను ఇవ్వడం వంటి సమస్యల కోసం వినియోగదారులను సంప్రదించేలా మోసగిస్తారు.

■ **మోసం చేసే విధానం..**

1. మోసగాళ్ళు సాధారణంగా తమ దృష్టిని ఆకర్షించడానికి ఫోన్ కాల్ చేస్తారు. వారు తమను తాము బ్యాంక్ ప్రతినిధుల్లా చెప్పుకుంటూ, KYC అప్‌డేట్‌లు, బోనస్ పాయింట్ల రిడెంప్షన్, క్యాష్ బ్యాక్‌ల వంటి సాధారణ సమస్య కోసం కాల్ చేస్తారు.
2. కాల్‌ని చట్టబద్ధంగా చేయడానికి, వారు అసలైన బ్యాంక్ ప్రక్రియను అనుకరిస్తారు. వారు మీ పుట్టిన తేదీ, పేరు, మొబైల్ నంబర్ వంటి ధృవీకరణ ప్రశ్నలను అడగడం కొనసాగిస్తారు.
3. స్కామర్లు సాధారణంగా ఒక తప్పుడు కథనాన్ని సృష్టిస్తారు. సమస్యను పరిష్కరించడానికి బాధితుడు తమ వ్యక్తిగత డేటాను ఇస్తుంటారు.
4. స్కామర్ బాధితుడిని ఒప్పించిన తర్వాత, వారు తమ ఫోన్‌లో అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేయమని అడుగుతారు. అవి, ఎనీ డెస్క్.. వంటి అత్యంత సాధారణ స్క్రీన్ షేరింగ్ యాప్స్ అయి ఉంటాయి. ఇవి ప్లే స్టోర్ / యాప్ స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయి.



■ **స్కామర్ల నుంచి కాపాడుకోవాలంటే...**

1. OTP ఎవరికీ షేర్ చేయవద్దు.
2. ఇతరుల నుంచి డబ్బును పొందడానికి మనం OTP చెప్పాల్సిన అవసరం లేదు
3. డబ్బు తీసుకోవడానికి క్యూఆర్ కోడ్‌లనూ స్కాన్ చేయాల్సిన అవసరం లేదు
4. మీ స్మార్ట్‌ఫోన్‌లో అనుమానాస్పద యాప్‌లను ఉపయోగించవద్దు
5. అధికారిక కస్టమర్ సర్వీస్ నంబర్‌లను మాత్రమే సంప్రదించండి
6. కార్డ్ నంబర్, CVV, గడువు తేదీలను ఎప్పుడూ ఎవరికీ షేర్ చేయవద్దు

5. AnyDesk లేదా మరేదైనా స్క్రీన్ షేరింగ్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసిన తర్వాత, ఇది సాధారణ యాప్ లాగా వినియోగదారు గోప్యతా అనుమతిని అడుగుతుంది. ఈ యాప్‌లు మీ ఫోన్‌లోని ప్రతిదానిని యాక్సెస్ చేయగలవని దయచేసి గమనించండి.
6. స్కామర్‌లు బాధితుడిని వారి ఫోన్‌కు వచ్చిన OTP అడుగుతారు. బాధితుడు కోడ్ చెబితే ఆ తర్వాత హ్యాకర్ ఫోన్ నుండి యాక్సెప్ట్ చేయమని కూడా అడుగుతాడు.
7. యాప్ అవసరమైన అన్ని అనుమతులను పొందినప్పుడు, కాలర్ బాధితుడి ఫోన్‌పై వారికి తెలియకుండానే పూర్తి నియంత్రణను పొందడం ప్రారంభిస్తాడు. మీ ఫోన్‌కు పూర్తి యాక్సెస్ పొందిన తర్వాత, స్కామర్ పాస్‌వర్డ్‌లను దొంగిలించి, బాధితుడి UPI ఖాతాతో లావాదేవీలు చేయడం ప్రారంభిస్తాడు.
8. స్కామర్లు డబ్బును దొంగిలించడానికి ఉపయోగించే ప్రత్యామ్నాయ పద్ధతులు ఇవి..

ఎ) మోసగాళ్లు ఎస్సెమ్మెస్ పంపి, దానిని మరొక నంబర్‌కు ఫార్వర్డ్ చేయమని బాధితుడిని అడుగుతారు. సందేశం పంపితే UPI ద్వారా బాధితుడి మొబైల్ నంబర్ లేదా ఖాతాను వారి మొబైల్‌కి లింక్ చేయడానికి స్కామర్‌కి యాక్సెస్ లభిస్తుంది.
బి) మోసగాళ్లు గూగుల్ ఫారమ్‌లతో ఉన్న ఎసెమ్మెస్‌లను పంపుతారు. వినియోగదారు పేరు / పాస్‌వర్డ్ మరియు OTP / UPI వివరాలను పూరించమని అడుగుతారు.
సి) ప్రత్యామ్నాయంగా గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎమ్ మొదలైన యాప్‌లలో స్కామర్ (కొనుగోలుదారుల వలె నటించడం) మీ వర్చువల్ చెల్లింపు చిరునామాకు (క్యూ ఆర్ కోడ్) పేమెంట్ రిక్వెస్ట్ పంపుతాడు.

■ **ఇతర జాగ్రత్తలు**

- సురక్షితమైన ఆన్‌లైన్ లావాదేవీ కోసం https:// లాక్ చిహ్నం కోసం సెర్చ్ చేయండి
- కాల్‌లో ఉన్నప్పుడు డబ్బును ఎప్పుడూ బదిలీ చేయవద్దు లేదా పొందవద్దు.
- తెలియనివారి నుంచి వచ్చిన మెసేజ్‌లలో షార్ట్ లింక్స్ ఫారాలని ఎప్పుడూ పూరించవద్దు.
- పొరపాటున మోసానికి గురైతే www.cybercrime.gov.in కు రిపోర్ట్ చేయచ్చు.
- మోసం జరిగిన గంట లోపల హెల్ప్‌లైన్ 1930కి కాంటాక్ట్ చేస్తే మీరు జరిపిన లావాదేవీల ఖాతాలను బ్లాక్ చేస్తారు. ఆ తర్వాత న్యాయం జరిగే దిశగా అడుగులు వేయడానికి ఆస్కారం ఉంటుంది.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

వియన్నా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-మిడిల్‌కూప్ ద్వయం 6-1, 6-3తో పెడ్రో కాచిన్-డీగో ష్వార్ట్జ్‌మన్ (అర్జెంటీనా) జోడీపై విజయం సాధించింది. 54 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం మూడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.

హంపి రెండో గేమ్ 'డ్రా'



మహిళల క్యాండిడేట్స్ చెస్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తన రెండో గేమ్‌ను 'డ్రా'గా ముగించింది. మొనాకోలో జరుగుతున్న ఈ టోర్నీలో అనా ముజిచుక్ (ఉక్రెయిన్)తో బుధవారం జరిగిన గేమ్‌ను హంపి 28 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. తొలి గేమ్‌లో హంపి 24 ఎత్తుల్లో గెలిచింది. ప్రస్తుతం హంపి 1.5-0.5తో ఆధిక్యంలో ఉంది. గురువారం విశ్రాంతి దినం. శుక్ర, శని వారాల్లో వీరిద్దరి మధ్య మరో రెండు గేమ్‌లు జరుగుతాయి.



శ్రీకాంత్ శుభారంభం

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, సమీర్ వర్మ శుభారంభం చేశారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ఆటగాడు, ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ 21-18, 21-18తో భారత్‌కే చెందిన ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ లక్ష్య సేన్‌ను ఓడించాడు. ఇతర మ్యాచ్‌ల్లో ప్రణయ్ 21-16, 16-21, 21-16తో డారెన్ లూ (మలేసియా)పై గెలుపొందగా... ప్రపంచ 31వ ర్యాంకర్ సమీర్ వర్మ 21-15, 21-23, 22-20తో ప్రపంచ ఆరో ర్యాంకర్ ఆంథోనీ జిన్‌టింగ్ (ఇండోనేసియా)ను బోల్తా కొట్టించాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో అర్జున్-ధ్రువ్ కపిల (భారత్) జోడీ 15-21, 16-21తో ఫజర్-మొహమ్మద్ రియాన్ (ఇండోనేసియా) ద్వయం చేతిలో ఓడిపోయింది.

భారత్ 5 ఆస్ట్రేలియా 5



కౌలాలంపూర్: సుల్తాన్ ఆఫ్ జొహార్ కప్ జూనియర్ హాకీ టోర్నీలో భారత జట్టు తొలి 'డ్రా' నమోదు చేసింది. ఆస్ట్రేలియా జట్టుతో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌ను భారత్ 5-5తో 'డ్రా'గా ముగించింది. మ్యాచ్ చివరి నిమిషంలో అమన్‌దీప్ గోల్ చేసి భారత్‌ను ఆదుకున్నాడు. శారదానంద్ తివారి (8వ, 35వ ని.లో) రెండు గోల్స్... బాబీ సింగ్ ధామి (2వ ని.లో), అర్జీత్ సింగ్ హుండల్ (18వ ని.లో) ఒక్కోగోల్ సాధించారు. ఆరు జట్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో భారత్ నాలుగు మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. రెండు విజయాలు, ఒక 'డ్రా', ఒక ఓటమితో భారత్ ఏడు పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను శుక్రవారం బ్రిటన్ జట్టుతో ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ఫైనల్ చేరుతుంది.

భారత్ జోరు సాగనీ...


కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి

ప్రపంచకప్‌లాంటి మెగా ఈవెంట్‌లో తొలి మ్యాచే కఠిన ప్రత్యర్థితో ఎదురై అందులో అద్భుత విజయం సాధిస్తే ఇక తర్వాతి మ్యాచ్‌లకు తిరుగేముంటుంది? ఇకపై జరిగే మ్యాచ్‌లన్నీ సులువుగానే అనిపిస్తాయి. ప్రస్తుతం భారత జట్టు సరిగ్గా అలాంటి స్థితిలోనే ఉంది. పాకిస్తాన్‌ను ఓడించిన తర్వాత రెండో పోరులో ఒక అసోసియేట్ టీమ్‌ను జట్టు ఎదుర్కోబోతోంది. గెలుపు విషయంలో ఎలాంటి సందేహాలు లేకున్నా టీమిండియా ఎలా ఆధిక్యం ప్రదర్శించనుందో, నెదర్లాండ్స్ ఏ మేరకు పోటీనిస్తుందో చూడాలి.



- నేడు నెదర్లాండ్స్‌తో మ్యాచ్
- ఆత్మవిశ్వాసంతో టీమిండియా
- కేఎల్ రాహుల్‌పై దృష్టి
- సంచలనంపై డచ్ బృందం ఆశలు
- మధ్యాహ్నం గం. 12:30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

సిడ్నీ: అంతర్జాతీయ టి20ల్లో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా తలపడని భారత్, నెదర్లాండ్స్ తొలి సమరానికి సన్నద్ధమయ్యాయి. ఈ పోరుకు వరల్డ్‌కప్ వేదిక అవుతోంది. 'గ్రూప్-2'లో పాక్‌ను ఓడించిన భారత్ సమరోత్సాహంతో ఉండగా, శ్రీలంక చేతిలో ఓడిన నెదర్లాండ్స్ తమ ప్రదర్శనను మరింత మెరుగు పర్చుకోవాలని పట్టుదలగా ఉంది. బలాబలాల దృష్ట్యా చూస్తే రోహిత్ సేన సహజంగానే ఫేవరెట్ కాగా, బుధవారం ఇంగ్లండ్‌పై ఐర్లాండ్ ప్రదర్శన చూస్తే ఏమాత్రం అలసత్వం దరి చేరనీయకుండా ఉండటం కూడా ముఖ్యం.

అదే జట్టుతో...

పాక్‌తో మ్యాచ్‌లో కోహ్లి బ్యాటింగ్ చూశాక అతని ఆట గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. బలహీన బౌలింగ్ ఉన్న నెదర్లాండ్స్‌పై అతను చెలరేగితే మరెన్నో రికార్డులు ఖాయం. అయితే టాప్-4లో మరో ముగ్గురు ఆటగాళ్లకు ఈ మ్యాచ్ ద్వారా తగినంత బ్యాటింగ్ ప్రాక్టీస్ అవసరం ఉంది. ఓపెనర్లుగా వరుసగా విఫలమవుతున్న రోహిత్, రాహుల్‌లతో పాటు సూర్యకుమార్ కూడా లయ అందుకోవాల్సి ఉంది. గత ఐదు టి20ల్లో కలిపి రోహిత్ 64 పరుగులే చేశాడు. ఈ నేపథ్యంలో రోహిత్ ఫామ్ అందుకోవడం జట్టుకు ఎంతో అవసరం. చిన్న జట్టుపైనైనా రాహుల్ తన ముద్ర వేస్తాడా చూడాలి. తర్వాతి స్థానాల్లో హార్దిక్, దినేశ్ కార్తీక్ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించగలరు. కాబట్టి ఆందోళన లేదు. పాక్‌తో మ్యాచ్‌లో అక్షర్‌ను ముందుగా పంపించినా, ఈసారి అలాంటి అవసరం ఉండకపోవచ్చు. బౌలింగ్‌లో కూడా భారత్ జట్టులో ఎలాంటి మార్పులు ఉండవని కోచ్ పారస్ మాంబ్రే చేసిన వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. డచ్ టీమ్ టాప్-8లో ఒక్కరూ ఎడంచేతి వాటం బ్యాటర్ లేరు కాబట్టి అశ్విన్‌కంటే లెగ్ స్పిన్నర్ చహల్ మెరుగైన ప్రత్యామ్నాయం అనిపించింది. అయితే గెలిచిన జట్టులో మార్పులు ఉండబోవని స్పష్టమైంది. ముగ్గురు పేసర్లు షమీ, భువనేశ్వర్, అర్ష్‌దీప్ పెద్దగా అనుభవం లేని డచ్ బ్యాటర్లను ఇబ్బంది పెడితే ఆరంభంలోనే భారత్‌కు పట్టు చిక్కుతుంది.

డి లీడ్‌పై దృష్టి...

ఈ ప్రపంచకప్ 'సూపర్ 12'లో ఆడుతున్న ఏకైక అసోసియేట్ జట్టు నెదర్లాండ్స్. దాంతో చాలా కాలం తర్వాత వారికి పెద్ద జట్లను ఎదుర్కొనే అవకాశం దక్కింది. ఈ క్రమంలో భారత్‌తో పోరులో డచ్ బృందం తమ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంది. 2022లో ఎక్కువ సంఖ్యలో టి20 మ్యాచ్‌లు ఆడి వరల్డ్ కప్‌లోకి అడుగుపెట్టింది. రెండు అనవసర రనౌట్‌లు లేకపోతే తొలి మ్యాచ్‌లో శ్రీలంకను ఓడించేది కూడా! మ్యాక్స్ ఒడౌడ్, విక్రమ్‌జిత్ సింగ్, అకర్‌మన్, టామ్ కూపర్ ఆ జట్టులో కీలక ఆటగాళ్లు. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ ముందుండి స్ఫూర్తిదాయకంగా జట్టును నడిపిస్తున్నాడు. ప్రధాన బౌలర్ మీకెరెన్ ఫామ్‌లో ఉండటం జట్టుకు సానుకూలాంశం. దిగ్గజాల నుంచి ప్రశంసలు అందుకుంటున్న ఆల్‌రౌండర్ బాస్ డి లీడ్‌పై కూడా అందరి దృష్టి ఉంది. క్వాలిఫయింగ్ సమరంలో రెండు సార్లు జట్టును గెలిపించి అతను 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. గతంలో దక్షిణాఫ్రికాతో పాటు ఐపీఎల్‌లో బెంగళూరు తరఫున ఆడిన వాన్ డర్ మెర్వ్ గాయం నుంచి కోలుకోకపోతే షారిజ్ అహ్మద్‌కు చోటు దక్కుతుంది. 2009, 2014 టి20 ప్రపంచకప్‌లలో ఇంగ్లండ్‌ను ఓడించిన రికార్డు నెదర్లాండ్స్‌కు ఉంది.

పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు బాగా అనుకూలమైన పిచ్. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ 200 పరుగులు చేసింది. ప్రస్తుతం సిడ్నీలో స్వల్ప వర్షం ఉన్నా... మ్యాచ్ రోజు ఎలాంటి అంతరాయం ఉండదని వాతావరణ శాఖ సమాచారం.

'డక్‌వర్త్'తో ఐర్లాండ్ సంచలనం


ఐర్లాండ్ ఆటగాళ్ల సంబరం


బట్లర్

- ఇంగ్లండ్‌కు షాక్
- టి20 ప్రపంచకప్ టోర్నీ

మెల్‌బోర్న్: పోరాటపటిమకు కాస్త అదృష్టం కూడా తోడు రావడంతో టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో ఐర్లాండ్ మరో సంచలనం సృష్టించింది. క్వాలిఫయింగ్ టోర్నీలో మాజీ చాంపియన్ వెస్టిండీస్‌ను బోల్తా కొట్టించిన ఐర్లాండ్ తాజాగా 'సూపర్ 12' దశలోనూ ఊహించని ఫలితం సాధించింది. 'డక్‌వర్త్ లూయిస్' పద్ధతి కలిసి రావడంతో ఐర్లాండ్ జట్టు 2010 విశ్వవిజేత, పటిష్టమైన ఇంగ్లండ్‌కు ఐదు పరుగుల తేడాతో షాక్ ఇచ్చింది. బుధవారం జరిగిన 'గ్రూప్-1' మ్యాచ్‌లో ముందుగా ఐర్లాండ్ 19.2 ఓవర్లలో 157 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆండ్రీ బాల్బిర్నీ (47 బంతుల్లో 62; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) చక్కని పోరాటం చేశాడు. టకర్ (27 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. మిగతా బ్యాటర్లను లివింగ్‌స్టోన్ (3/17), మార్క్ వుడ్ (3/34), స్యామ్ కరన్ (2/31) క్రీజులో నిలువనీయలేదు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ వర్షంతో ఆట నిలిచే సమయానికి 14.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది. ఓపెనర్లు బట్లర్ (0), హేల్స్ (7)లను ఆరంభంలోనే జోష్ లిటిల్ (2/16) పెవిలియన్ చేర్చగా, స్టోక్స్ (6)ను హ్యాండ్ అవుట్ చేయడంతో ఇంగ్లండ్ 29 పరుగులకే కీలకమైన 3 వికెట్లను కోల్పోయింది. మలాన్ (35; 2 ఫోర్లు), బ్రూక్ (18; 1 ఫోర్) కాసేపు నిలిచినప్పటికీ జట్టు స్కోరు 86 పరుగుల వద్ద సగం వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో మొయిన్ అలీ (12 బంతుల్లో 24 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), లివింగ్‌స్టోన్ (1 నాటౌట్) జట్టును ఆదుకునే ప్రయత్నం చేయగా 14.3 ఓవర్లలో 105/5 స్కోరు వద్ద వర్షంతో మ్యాచ్ నిలిచింది. తర్వాత కొనసాగలేదు. 'డక్‌వర్త్ లూయిస్' లెక్కల ప్రకారం అప్పటికి 111 పరుగులు చేస్తే ఇంగ్లండ్ గెలిచేది. అయితే 6 పరుగుల దూరంలో ఉండటంతో చివరకు 5 పరుగులతో ఐర్లాండ్ గెలిచినట్లు ప్రకటించారు.

న్యూజిలాండ్, అఫ్గానిస్తాన్ మ్యాచ్ రద్దు

మెల్‌బోర్న్ మైదానంలోనే న్యూజిలాండ్ అఫ్గానిస్తాన్ జట్ల మధ్య జరగాల్సిన 'గ్రూప్-1' మరో మ్యాచ్ వర్షం వల్ల అసలు ప్రారంభమే కాలేదు. ఇంగ్లండ్ లక్ష్యఛేదనలో ఉండగానే మొదలైన వాన తగ్గకపోవడంతో ఆటకు అవకాశం లేకపోయింది. దీంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు.

2 ప్రపంచకప్‌లలో ఇంగ్లండ్‌పై ఐర్లాండ్‌కు ఇది రెండో విజయం. 2011 వన్డే ప్రపంచకప్‌లోనూ ఇంగ్లండ్‌కు షాక్ ఇచ్చింది.

1 టి20 ప్రపంచకప్ టోర్నీ రెండో దశలో ఐర్లాండ్ గెలవడం ఇదే తొలిసారి.

టి20 ప్రపంచకప్‌లో నేడు


దక్షిణాఫ్రికా X బంగ్లాదేశ్ (ఉ.గం. 8:30 నుంచి)
భారత్ X నెదర్లాండ్స్ (మ.గం. 12:30 నుంచి)
పాకిస్తాన్ X జింబాబ్వే (సా.గం. 4:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

ప్రాక్టీస్‌కు భారత్ దూరం

సిడ్నీ: నెదర్లాండ్స్‌తో మ్యాచ్ నేపథ్యంలో బుధవారం భారత జట్టు ఎలాంటి ప్రాక్టీస్‌లో పాల్గొనలేదు. టీమ్ సాధన కోసం కేటాయించిన ప్రాక్టీస్ గ్రౌండ్ హోటల్ గది నుంచి 40 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉంది. దాంతో మ్యాచ్ ముందు రోజు అంత దూరం ప్రయాణించడం ఇష్టం లేక ఆటగాళ్లు ప్రాక్టీస్‌ను వద్దనుకున్నారు. మరోవైపు ప్రాక్టీస్ తర్వాత భారత జట్టుకు సరైన భోజనం లభించలేదనే అంశంపై ఐసీసీ దృష్టి పెట్టింది. సమస్యను పరిష్కరిస్తామని ఐసీసీ వర్గాలు వెల్లడించాయి.

సినిమా


మిషన్ కంబోడియా


కార్తీ

కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సర్దార్'. రాశీ ఖన్నా, రజీషా విజయన్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. ఇందులో చంద్రబోస్ అలియాస్ 'సర్దార్', ఆయన తనయుడు ఇన్‌స్పెక్టర్ విజయ్ ప్రకాష్ పాత్రల్లో మెప్పించారు కార్తీ. ఈ చిత్రానికి సీక్వెల్ ప్రకటిస్తూ ఓ వీడియోను రిలీజ్ చేసింది చిత్ర బృందం. పోలీసాఫీసర్‌గా రాజీనామా చేసి, 'రా' (రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్) ఏజెంట్‌గా చేరాలన్న ఆఫర్‌కు విజయ్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం, విజయ్ కొత్త మిషన్ కంబోడియాలో ఆరంభం కానున్నట్లుగా టీజర్‌లో చూపించడం జరిగింది. హీరో కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్, నిర్మాత లక్ష్మణ్ కాంబినేషన్‌లోనే ఈ సీక్వెల్ తెరకెక్కనుంది.

చివరి పేజీ షురూ

నిఖిల్ సిద్ధార్థ, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం '18 పేజెస్'. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు పల్నాటి సూర్య ప్రతాప్ దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి జీఏ2 పిక్చర్స్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ '18 పేజెస్' చివరి పేజీ (షెడ్యూల్) ప్రారంభమైంది. ''కార్తికేయ 2' విడుదల, ప్రమోషన్స్, సక్సెస్ సెలబ్రేషన్స్ కోసం కొంచెం విరామం తీసుకున్న తర్వాత నిఖిల్ తాజాగా '18 పేజెస్' షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఈ సినిమా చివరి షెడ్యూల్ ప్రారంభమైంది. డిసెంబర్ 23న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, కెమెరా: వసంత్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: శరణ్ రాపర్తి (గీతా ఆర్ట్స్), అశోక్ బంద్రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: బాబు.


నిఖిల్, అనుపమ

ఎల్. విజయలక్ష్మికి ఎన్టీఆర్ అవార్డు



అలనాటి అందాల తార, ప్రముఖ నర్తకి ఎల్. విజయలక్ష్మిని ఎన్టీఆర్ అవార్డు వరించింది. తెనాలిలో జరుగుతున్న ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ నటించిన అన్ని సినిమాలు ఏడాది పాటు పెమ్మసాని (రామకృష్ణ) థియేటర్లో ప్రదర్శితమవుతున్నాయి. ఇక్కడ జరిగే కార్యక్రమంలో ప్రతి నెలా ఎన్టీఆర్ కుటుంబం నుండి ఒకరు పాల్గొంటారు. ఎన్టీఆర్‌తో పనిచేసిన ఒక లెజెండరీ పర్సన్‌కు ప్రతి నెలా అవార్డు, గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తారు. అక్టోబర్ నెలకిగాను ఎన్టీఆర్ పురస్కారానికి ఎల్. విజయలక్ష్మి ఎంపికయ్యారు. బాలనటిగా 'సిపాయి కూతురు' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన ఆమె 'జగదేకవీరుని కథ, ఆరాధన, గుండమ్మ కథ, నర్తనశాల, పూజా ఫలం, బొబ్బిలి యుద్ధం, రాముడు-భీముడు, భక్త ప్రహ్లాద' వంటి ఎన్నో సినిమాల్లో నటించారు. ముఖ్యంగా ఎన్టీఆర్‌తో సుమారు 15 సినిమాలకు పైగా నటించారు విజయలక్ష్మి. 50 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకొని ఇండస్ట్రీకి దూరంగా అమెరికాలో స్థిరపడ్డారామె. ఈ నెల 30న తెనాలిలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోవడానికి ఆమె ఇక్కడికి రానున్నారు. కాగా 'ఎన్టీఆర్ శతజయంతి' కార్యక్రమానికి గౌరవ అధ్యక్షుడిగా నందమూరి బాలకృష్ణ, అధ్యక్షుడిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బుర్రా సాయిమాధవ్ వ్యవహరిస్తున్నారు.

అలీ నిర్మాత కావడం సంతోషం - ఎస్వీ కృష్ణారెడ్డి


ఎస్వీ కృష్ణారెడ్డి, అలీ, శివబాలాజీ, బ్రహ్మానందం, అచ్చిరెడ్డి, శ్రీపురం కిరణ్, కొణతాల మోహన్

''అలీతో నేను తీసిన బ్లాక్‌బస్టర్ మూవీ 'యమలీల' విడుదలై 2023కి 30 ఏళ్లవుతుంది. అయినా ఇప్పటికి అలీ ఫ్రెష్‌గా ఉన్నాడు. వేయి చిత్రాలకుపైగా నటించిన అలీ 'అందరూ బాగుండాలి అందులో నేనుండాలి' చిత్రం ద్వారా నిర్మాత స్థాయికి ఎదగడం సంతోషంగా ఉంది'' అని దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. అలీ, నరేష్ ప్రధాన పాత్రల్లో శ్రీపురం కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అందరూ బాగుండాలి అందులో నేనుండాలి'. అలీ సమర్పణలో అలీవుడ్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై అలీబాబ, కొణతాల మోహన్‌కుమార్, శ్రీ చరణ్ ఆర్. నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ చిత్రం టీజర్, ట్రైలర్‌ను ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి, నటుడు బ్రహ్మానందం లాంచ్ చేశారు. బ్రహ్మానందం మాట్లాడుతూ- ''నేను, అలీ ఒకే టైమ్‌లో కెరీర్ స్టార్ట్ చేశాం. నటుడిగా ఎదుగుతూ వచ్చిన అలీ ఎందరో సీనియర్ నటులతో నిర్మించిన ఈ సినిమా గొప్ప విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమా చూసిన ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది'' అన్నారు అలీ. ''ఇలాంటి సినిమా చేసే అవకాశం ఇచ్చిన అలీగారికి థ్యాంక్స్'' అన్నారు కొణతాల మోహన్‌కుమార్. ''ఈ సినిమాను అందరూ ఆశీర్వదించాలి'' అన్నారు శ్రీపురం కిరణ్. ''మలయాళంలో విజయం సాధించిన 'వికృతి' మూవీని రీమేక్ చేయాలనుకుని, ఆ చిత్రనిర్మాతను అడిగితే వారే వాళ్లకు ఇచ్చాం అన్నారు. అదే సినిమా 'ఆహా'కు రావడం హ్యాపీగా ఉంది'' అన్నారు 'ఆహా' ప్రతినిధి బాలబొమ్మల శ్రీనివాస్. చిత్ర సంగీతదర్శకుడు రాకేష్ పళిడమ్ పాల్గొన్నారు.

మిస్ రెబల్


మేఘా ఆకాష్

మేఘా ఆకాష్, రాహుల్ విజయ్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'మాటే మంత్రము'. అభిమన్యు బద్దీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. బిందు ఆకాష్ (మేఘా ఆకాష్ తల్లి) సమర్పణలో ఎ. సుశాంత్ రెడ్డి, అభిషేక్ కోట నిర్మిస్తున్నారు. ఈ సినిమా నిర్మాతల్లో ఒకరైన సుశాంత్ రెడ్డి కథ అందించారు. అక్టోబరు 26 మేఘా బర్త్ డే సందర్భంగా 'మాటే మంత్రము'లోని ఆమె క్యారెక్టర్ నేమ్, లుక్‌ను రిలీజ్ చేశారు. ''గోవా బ్యాక్‌డ్రాప్‌లో సాగే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. ఇందులో కావ్య అనే రెబల్ అమ్మాయిగా నటించారు మేఘా ఆకాష్. రెండు పాటలు మినహా షూటింగ్ పూర్తి చేశాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: హరి గౌర, కెమెరా: మనోజ్ రెడ్డి. చిత్రయూనిట్ పేర్కొంది.

టిల్లు మళ్లీ వస్తున్నాడు


సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన హిట్ మూవీ 'డీజే టిల్లు'కి సీక్వెల్‌గా 'డీజే టిల్లు స్క్వేర్' రూపొందనుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి, వచ్చే మార్చిలో చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. అనుపమా పరమేశ్వరన్ నాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకుడు. 'డబుల్ ఫన్.. డబుల్ రొమాన్స్' అని ట్వీట్ చేశారు సిద్ధు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రామ్ మిరియాల, కెమెరా: సాయి ప్రకాష్.

టీజర్ బాగుంది - మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్


జస్వంత్, తలసాని, సందీప్

''తెలుగు చిత్ర పరిశ్రమకి యువతరం రావాల్సిన అవసరం ఉంది. కొత్త తరాన్ని ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. 'ఎర్రర్ 500' టీజర్ బాగుంది. యూనిట్ ఎంతో ప్యాషన్‌తో చేసిన ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. జస్వంత్ పడాల, నక్షత్ర త్రినయని ప్రధాన పాత్రల్లో సందీప్ మైత్రేయ ఎస్. దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎర్రర్ 500'. యు. బాలరెడ్డి (ఇన్ఫోసిటీ బిల్డర్స్) నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ని తలసాని శ్రీనివాస్ యాదవ్ విడుదల చేశారు. జస్వంత్ మాట్లాడుతూ- ''ఎర్రర్ 500' అందరికీ కనెక్ట్ అయ్యే కథ. నన్ను హీరోగా పరిచయం చేసిన బాలరెడ్డిగారికి థ్యాంక్స్'' అన్నారు. ''వినోదాత్మకంగా రూపొందిన చిత్రమిది. 'బిగ్ బాస్' ఫేం జస్వంత్‌ని హీరోగా లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. త్వరలో సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అన్నారు సందీప్. ఈ చిత్రానికి కెమెరా: శశాంక్ శ్రీరామ్- ప్రశాంత్ మన్నె, సంగీతం: ఫణి కల్యాణ్.

ఉమాపతి ప్రేమ


అనురాగ్, అవిక

అనురాగ్, అవికా గోర్ జంటగా నటించిన చిత్రం 'ఉమాపతి'. తమిళ హిట్ 'కలవాని' సినిమాను సత్య ద్వారపూడి దర్శకత్వంలో 'ఉమాపతి' పేరుతో నిర్మాత కె. కోటేశ్వరరావు రీమేక్ చేశారు. ''ఉమాపతి' మంచి ప్రేమకథా చిత్రం. గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో వినోదానికి పెద్ద పీట వేశాం. త్వరలో సినిమా రిలీజ్ తేదీ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శక్తీ కాంత్ కార్తీక్, కెమెరా: రాఘవేంద్ర.

ఎమోషనల్ రుద్రప్ప


రమేష్

రమేష్ హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'రుద్రప్ప'. ఎస్ఎంఎల్ ప్రొడక్షన్ సమర్పణలో హేమంత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ''విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఫ్యామిలీ డ్రామాతో పాటు ఎమోషనల్ మూవీగా రూపొందుతున్న చిత్రం ఇది. వైవిధ్యమైన కథతో ప్రయోగాత్మకంగా రూపొందిస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: భరత్, కెమెరా-ఆర్ట్: పీఆర్ సుధీర్.

షరతులు వర్తిస్తాయి


చైతన్యా రావ్

చైతన్యా రావ్, భూమి శెట్టి ముఖ్య తారలుగా శ్రీష్, కృష్ణకాంత్, నాగార్జున్ నిర్మించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమార స్వామి (అక్షర కుమార్) దర్శకుడు. ఈ సినిమా టైటిల్ లోగోను తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ రిలీజ్ చేసి, మాట్లాడుతూ - ''యూనివర్సల్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు. ''ఒక అర్బన్ టౌన్ సెటప్‌లో వాస్తవికతకు అద్దం పడుతూ జరిగే కుటుంబకథా చిత్రంగా ఈ సినిమా ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (మంగళవారం ముగింపు)	
సెన్సెక్స్ ▽ 288	నిఫ్టీ ▽ 74
59,544	17,656

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,076	▽	132
డోజోన్స్	31,927	△	90
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,056	△	93
డాక్స్	13,196	△	143
షాంఘై	2,999	△	23
నికాయ్	27,432	△	182

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

గ్లాండ్ ఫార్మా లాభం 20% డౌన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ సంస్థ గ్లాండ్ ఫార్మా సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 20 శాతం తగ్గి రూ.241 కోట్లు నమోదు చేసింది. వ్యయాలు రూ.731 కోట్ల నుంచి రూ.786 కోట్లకు ఎగశాయి. టర్నోవర్ రూ.1,080 కోట్ల నుంచి రూ.1,044 కోట్లకు వచ్చి చేరింది. యూఎస్, యూరప్, కెనడా, ఆస్ట్రేలియా మార్కెట్ల నుంచి టర్నోవర్ 3 శాతం పెరిగి రూ.747 కోట్లుగా ఉంది. ఆదాయం భారత విపణి నుంచి 42 శాతం తగ్గి రూ.73 కోట్లకు, ఇతర మార్కెట్ల నుంచి 3 శాతం క్షీణించి రూ.224 కోట్లకు పడిపోయింది. క్రితం ముగింపుతో పోలిస్తే గ్లాండ్ ఫార్మా షేరు ధర బీఎస్‌ఈలో బుధవారం 1.57 శాతం పెరిగి రూ.2,224.20 వద్ద స్థిరపడింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, పీఎన్‌బీ ఎఫ్‌డీ రేట్ల పెంపు



న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీలు) వడ్డీ రేట్లను పెంచాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎఫ్‌డీలపై రేట్లను పెంచడం ఒక నెలలో ఇది రెండో పర్యాయం. వివిధ కాల పరిమితులపై రూ.2 కోట్ల వరకు చేసే ఎఫ్‌డీలపై 0.50 శాతం వరకు పెంచింది. రికరింగ్ డిపాజిట్ల రేట్లను కూడా పెంచింది. సవరించిన రేట్లు అక్టోబర్ 26 నుంచే అమల్లోకి వచ్చాయి. పీఎన్‌బీ సైతం రూ.2 కోట్ల వరకు ఎఫ్‌డీలపై రేట్లను సవరించింది. వారం వ్యవధిలో రేట్లను సవరించడం రెండో సారి. ఈ రేట్లు ఈ నెల 26 నుంచి అమల్లోకి వచ్చాయి. గరిష్ఠంగా 0.75 శాతం వరకు రేట్లను పెంచింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-10-2022	
విశాఖ	500-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
26-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	490-00
వరంగల్	492-00
రిటైల్ ధర	5.50

ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా

- సంప్రదింపులు, అధ్యయనం కోసం కమిటీ
- ఐఆర్‌డీఏఐ నిర్ణయం



న్యూఢిల్లీ: దేశంలో ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమాను (సార్వత్రిక ఆరోగ్య బీమా) చేరువ చేసే లక్ష్యంతో.. బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) 15 మంది సభ్యులతో 'హెల్త్ ఇన్సూరెన్స్ కన్సల్టేటివ్ కమిటీ'ని (ఆరోగ్య బీమా సంప్రదింపుల కమిటీ) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. రెండేళ్ల కాలానికి ఈ కమిటీని నియమించింది. ఈ కమిటీకి ఐఆర్‌డీఏఐ సభ్యుడైన రాకేశ్ జోషి నేతృత్వం వహిస్తారు. హెల్త్ ఇన్సూరెన్స్ సజావుగా నిర్వహించుకునేందుకు, వ్యాపార సులభతర నిర్వహణకు సూచనలు ఇవ్వాలని ఐఆర్‌డీఏఐ కోరింది. దేశంలో ప్రతి కుటుంబం ఆరోగ్య బీమా కలిగి ఉండడం అవసరమని పేర్కొంది. ''దేశంలో హెల్త్ ఇన్సూరెన్స్ విస్తరణను పెంచాలి. ఇందుకు అడ్డుగా ఉన్న సవాళ్లు, సమస్యలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు అవసరమైన సిఫారసులు చేయాలి''అని కమిటీని కోరింది. డేటా విశ్లేషణ సహా పలు విధానాల అమలులో ప్రామాణిక విధానాలను కూడా కమిటీ సూచించనుంది. మారుతున్న ఆరోగ్య సంరక్షణ అవసరాలకు తగ్గట్టు హెల్త్ ఇన్సూరెన్స్ కూడా ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందాలని ఐఆర్‌డీఏఐ పేర్కొంది. ఆరోగ్య సంరక్షణ వ్యయాలను తట్టుకునేందుకు రక్షణగా బీమాను కొనుగోలు చేస్తున్న వారి.. అన్ని రకాల అవసరాలను తీర్చేలా ఉండాలని అభిప్రాయపడింది.

కంపెనీల ఐటీ రిటర్నుల దాఖలుకు గడువు పెంపు

నవంబర్ 7 వరకూ పొడిగింపు



న్యూఢిల్లీ: వ్యాపార సంస్థలు 2022-23 అసెస్‌మెంట్ సంవత్సరానికి గాను ఆదాయ పన్ను రిటర్నులను దాఖలు చేసేందుకు గడువును నవంబర్ 7 వరకూ పొడిగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. వాస్తవానికి ఇది అక్టోబర్ 31తో ముగిసిపోనుంది. ఆడిట్ రిపోర్టుల దాఖలుకు గత నెలలో డెడ్‌లైన్‌ను పొడిగించిన నేపథ్యంలో తాజాగా ఐటీఆర్ ఫైలింగ్ గడువును కూడా పొడిగించినట్లు కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. దేశీ కంపెనీలు 2021-2022 ఆర్థిక సంవత్సరానికి గాను ఐటీ రిటర్నులను అక్టోబర్ 31లోగా సమర్పించాల్సి ఉంది.

డాబర్ చేతికి బాద్‌షా మసాలా

- 51 శాతం వాటా కొనుగోలుకి రెడీ
- క్యూ2 నికర లాభం రూ. 491 కోట్లు



న్యూఢిల్లీ: బాద్‌షా మసాలాలో మెజారిటీ వాటా(51 శాతం) కొనుగోలు చేసేందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు దేశీ ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం డాబర్ ఇండియా తాజాగా పేర్కొంది. ఇందుకు దాదాపు రూ. 588 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. తద్వారా వేగవంత వృద్ధిలోనున్న మసాలా దినుసుల విభాగంలోకి ప్రవేశించేందుకు డాబర్‌కు వీలు చిక్కనుంది. డీల్ ప్రకారం రూ. 1,152 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో బాద్‌షా సొంతం చేసుకోనుంది. మిగిలిన 49 శాతం వాటాను సైతం ఐదేళ్ల తదుపరి కొనుగోలు చేయనున్నట్లు తెలియజేసింది. ఆహార సంబంధ బిజినెస్‌ను మరింత విస్తరించే వ్యూహంలో భాగంగా బాద్‌షా కొనుగోలుకి తెరతీసినట్లు డాబర్ పేర్కొంది. వెరసి రూ. 25,000 కోట్ల విలువైన బ్రాండెడ్ మసాలా దినుసుల విభాగంలోకి ప్రవేశించనుంది. దీంతో రానున్న మూడేళ్లలో ఫుడ్ బిజినెస్ ఆదాయాన్ని రూ. 500 కోట్లకు చేర్చే వీలున్నట్లు డాబర్ తెలియజేసింది. 1958లో ఏర్పాటైన బాద్‌షా మసాలా 2021-22లో రూ. 189 కోట్ల టర్నోవర్ సాధించింది.

రూ. 2.5 డివిడెండ్

ఈ ఆర్థిక సంవత్సరం (2022-23) రెండో త్రైమాసికంలో డాబర్ ఇండియా కన్సాలిడేటెడ్ నికర లాభం స్వల్పంగా 3 శాతం క్షీణించి రూ. 491 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2021-22) ఇదే కాలంలో లాభం రూ. 505 కోట్లుగా నమోదైంది. వాటాదారులకు షేరుకి రూ. 2.5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఈ కాలంలో మొత్తం ఆదాయం 6 శాతం పుంజుకుని రూ. 2,986 కోట్లను అధిగమించింది. గత క్యూ2లో రూ. 2,818 కోట్ల టర్నోవర్ సాధించింది.

క్రూడ్ మళ్లీ 100 డాలర్లకు..!

- 2 మిలియన్ బ్యారెళ్ల ఉత్పత్తికి కోత
- ఒపెక్ తాజా నిర్ణయంతో ప్రతికూలతలు
- 90 డాలర్లకు తగ్గకపోవచ్చు
- అనలిస్టుల అంచనాలు



న్యూఢిల్లీ: చమురు ధరలు మళ్లీ బ్యారెల్‌కు 100 డాలర్లను దాటిపోతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చమురు ఎగుమతి దేశాల సమాఖ్య (ఒపెక్) రోజువారీ 2 మిలియన్ బ్యారెళ్ల మేర చమురు ఉత్పత్తిని (అంతర్జాతీయ సరఫరాలో 2 శాతం) తగ్గించాలని తీసుకున్న నిర్ణయం ఇందుకు దారితీస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం బ్రెంట్ బ్యారెల్ ధర 92 డాలర్ల స్థాయిలో ట్రేడ్ అవుతోంది. ఒపెక్ తాజా నిర్ణయం నవంబర్ నుంచి అమల్లోకి రానుంది. దీంతో అప్పటికి ధరలు పెరిగిపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒపెక్ నిర్ణయం మేరకు ఉత్పత్తిలో కోత 2023 డిసెంబర్ వరకు అమల్లో ఉండనుంది. ''చమురు ధరల విషయంలో సానుకూల అంచనాలతో ఉన్నాం. శీతాకాలంలో గ్యాస్ నుంచి చమురుకు మళ్లడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతుంది. ఓఈసీడీ వ్యూహాత్మక చమురు నిల్వల విడుదల ముగింపు, చమురు ఉత్పత్తికి కోత విధించడానికి అదనంగా, రష్యా చమురు దిగుమతులపై యూరప్ విధించిన నిషేధం డిసెంబర్ 5 నుంచి అమల్లోకి రానుంది. దీంతో చమురు మార్కెట్ మరింత కఠినంగా మారనుంది''అని యూబీఎస్‌కు చెందిన విశ్లేషకులు స్టానోవో, గోర్డాన్ అంచనా వ్యక్తం చేశారు. సాధారణంగా ఒపెక్ భేటీ ఆరు నెలలకు ఓసారి జరుగుతుంటుంది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైతే అసాధారణ సమావేశాన్ని నిర్వహించే అవకాశం కూడా లేకపోలేదని విశ్లేషకులు అంటున్నారు.

విపరిణామాలు..

మరోవైపు బ్రెంట్ క్రూడ్ ధర ఇటీవలి 82 డాలర్ల కనిష్ట స్థాయి నుంచి 12 శాతం ఇప్పటికే పెరగడం గమనార్హం. ''రోజువారీగా 2 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉత్పత్తికి కోత విధించాలన్న ఒపెక్ నిర్ణయం పలు ప్రతికూలతలకు దారితీస్తుంది. కొన్ని సభ్య దేశాలు ఈ లక్ష్యాలను చేరుకోవడంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అధిక ద్రవ్యోల్బణం కారణంగా జీవన వ్యయం పెరిగిపోయి ఇబ్బంది పడుతున్న వినియోగదారుడికి ఉపశమనం కల్పించాలన్న లక్ష్యంతో యూఎస్ ఉంది. మరి ఒపెక్ నిర్ణయం అమలైతే ఈ లక్ష్యానికి విఘాతం కలుగుతుంది''అని క్విల్టర్ చెవియెట్ ఈక్విటీ రీసెర్చ్ అనలిస్ట్ జామీ మడాక్ వివరించారు. ఓపెక్ సభ్య దేశం రష్యా అయితే మరింత తక్కువ ఉత్పత్తి చేస్తున్నట్టు కొందరు అనలిస్టులు చెబుతున్నారు. 8 లక్షల బ్యారెళ్ల మేర నికర సరఫరా మార్కెట్లో తగ్గుతుందని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ కమోడిటీస్ డైరెక్టర్ పాల్ హికిన్ అంచనా వేశారు. ఒపెక్ నిర్ణయం వచ్చే కొన్ని నెలలకు క్రూడ్‌కు బేస్ ధరను నిర్ణయించినట్టు చెప్పారు. ''2020 మే నెలలో క్రూడ్ ధరలు మైనస్‌కు పడిపోయిన సమయంలో ఒపెక్ చమురు ఉత్పత్తికి భారీ కోత విధించింది. ఆ తర్వాత పెద్ద ఎత్తున ఉత్పత్తికి కోత పెట్టాలని ఒపెక్ నిర్ణయించడం మళ్లీ ఇదే. ఇప్పుడు బ్రెంట్ బ్యారెల్ కనీసం 90 డాలర్ల కంటే తగ్గకుండా ఉండాలని (బేస్) ఒపెక్ ప్లస్ దేశాలు భావిస్తుండొచ్చు. ఆయిల్ మార్కెట్ కొత కాలంగా బేరిష్ ట్రెండ్‌లో ఉన్నాయి. అమెరికా వ్యూహాత్మక చమురు నిల్వల విడుదల అక్టోబర్‌తో ముగిసిపోతుంది. చైనా లాక్‌డౌన్‌లు, మొత్తం మీద డిమాండ్‌పై ప్రభావం చూపిస్తాయి. అలాగే, రష్యాపై ఆంక్షలు కూడా చమురు ధరలను నిర్ణయిస్తుంది''అని పాల్ హికిన్ అంచనా వేశారు.

ఎనర్జీ స్టోరేజ్ రంగంలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: ఎనర్జీ స్టోరేజ్, స్మార్ట్ గ్రిడ్ రంగంలో అంతర్జాతీయంగా 2022 జనవరి-సెప్టెంబర్‌లో రూ.2.05 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ మొత్తం 66 శాతం పెరిగిందని స్వచ్ఛ ఇంధన కన్సల్టింగ్ కంపెనీ మెర్కామ్ క్యాపిటల్ నివేదిక వెల్లడించింది. ఎనర్జీ స్టోరేజ్ విభాగంలో 92 డీల్స్‌కుగాను రూ.1.8 లక్షల కోట్ల నిధులు వెల్లువెత్తాయి. మిగిలిన మొత్తం స్మార్ట్ గ్రిడ్, ఇంధన సామర్థ్యం విభాగాలు కైవసం చేసుకున్నాయి. ఇంధన నిల్వ సంస్థలు శిలాజ ఇంధనాల నుండి పునరుత్పాదక ఇంధనాలకు మారడంలో కీలక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నందున పెట్టుబడులు పెరుగుతూనే ఉంటాయని మెర్కామ్ సీఈవో రాజ్ ప్రభు తెలిపారు.

శుద్ధ ఇంధనాలు, ఇన్‌ఫ్రాకు ప్రాధాన్యం ఇవ్వాలి

- విద్య, ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి అవసరం
- ఏఐఐబీని కోరిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: పర్యావరణ అనుకూల శుద్ధ ఇంధనాలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర ప్రాధాన్య రంగాల్లో పెట్టుబడులు పెంచాలని ఆసియా మౌలిక అభివృద్ధి బ్యాంకు (ఏఐఐబీ)ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. అలాగే, విద్య, ఆరోగ్యంపైనా పెట్టుబడుల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏఐఐబీ బోర్డ్ ఆఫ్ గవర్నర్ల ఏడో వార్షిక సమావేశాన్ని ఉద్దేశించి మంత్రి సీతారామన్ మాట్లాడారు. ప్రాధాన్య రంగాల్లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఏఐఐబీని కోరారు. విపత్తులను ఎదుర్కొనే మౌలిక సదుపాయాలు, సామాజిక మౌలిక సదుపాయాలు, డిజిటల్ సదుపాయాలు, విద్య, ఆరోగ్య సదుపాయాల కల్పన ప్రాధాన్యతలను మంత్రి గుర్తు చేశారు. ఈ రంగాల్లో చెప్పుకోతగ్గ మార్పును తీసుకొచ్చేందుకు మరిన్ని పెట్టుబడుల అవసరం ఉందన్నారు. ఏఐఐబీ సభ్య దేశాల విస్తృత మౌలిక అవసరాలను చేరుకోవడం కేవలం ప్రభుత్వాలు చేసే కేటాయింపులతోనే సాధ్యం కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

స్వావలంబన బాటలో భారత్..

భారత్ స్వావలంబన ఆర్థిక వ్యవస్థ బాటలో ఉన్నట్టు గుర్తు చేశారు. దీంతో కరోనా మహమ్మారి కారణంగా ఏర్పడిన ప్రతికూల ప్రభావాలను సమర్థంగా అధిగమించినట్టు చెప్పారు. పెద్ద ఎత్తున నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టడం, లక్ష్యాలకు అనుగుణమైన విధానాలు.. సవాళ్ల మధ్య బలంగా నిలబడేందుకు సాయపడినట్టు వివరించారు.

భవిత

బాలికలకు సీబీఎస్‌ఈ ఆర్థిక చేయూత

కుటుంబంలో ఏకైక సంతానంగా ఉన్న ఆడపిల్లల చదువును ప్రోత్సహించేందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ)..స్కాలర్‌షిప్స్‌ను అందిస్తోంది. తల్లిదండ్రులకు ఏకైక బాలికా సంతానంగా ఉన్న, ప్రతిభ కలిగిన విద్యార్థినుల కోసం సింగిల్ గర్ల్ చైల్డ్ స్కాలర్‌షిప్ (ఎస్‌జీసీఎస్) పేరుతో 2006 నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తోంది. పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన ప్రతిభావంతులైన బాలికలు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత, ఆసక్తి గల వారు నవంబర్ 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు

- విద్యార్థిని తల్లిదండ్రులకు ఏకైక కుమార్తె(సింగిల్ గర్ల్ చైల్డ్) అయి ఉండాలి.
- సీబీఎస్‌ఈలో పదోతరగతి ఉత్తీర్ణులై, సీబీఎస్‌ఈ అనుబంధ పాఠశాలల్లో 11వ తరగతిలో ప్రవేశం పొంది ఉండాలి.
- పదోతరగతి పరీక్షల్లో కనీసం 60శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించాలి.
- విద్యార్థిని ట్యూషన్ ఫీజు నెలకు రూ.1500 కంటే మించకూడదు.
- 11,12వ తరగతి చదువుతున్న విద్యార్థినులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
- సీబీఎస్‌ఈ బోర్డుకు సంబంధించి ఎన్‌ఆర్‌ఐ విద్యార్థిని అయితే ట్యూషన్ ఫీజు నెలకు రూ.6000కు మించకుండా ఉంటే స్కాలర్‌షిప్‌కు అర్హురాలే అవుతుంది.
- విద్యార్థిని ఏకైక సంతానం అని రుజువు చేయడానికి సంబంధించి సీబీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఫార్మెట్లో ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్/ఎడీఎం / ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్/నోటరీ అటెస్ట్ చేసిన ఒరిజినల్ అఫిడవిట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

స్కాలర్‌షిప్ వ్యవధి

- స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులు 11వ తరగతి తర్వాత ప్రతి ఏటా రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది.
- స్కాలర్‌షిప్ రెన్యువల్ చేయించుకోవాలంటే.. విద్యార్థిని 11వ తరగతి నుంచి ఆపై తరగతుల్లో కనీసం 50శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించాలి.
- విద్యార్థిని సత్ప్రవర్తనతో పాటు స్కూలు హాజరు శాతం కూడా బాగుండాలి.
- ఒకవేళ విద్యార్థిని స్కూలు లేదా కోర్సు మారాలనుకుంటే.. బోర్డు ముందస్తు అనుమతి తీసుకుంటేనే స్కాలర్‌షిప్ కొనసాగుతుంది.
- స్కాలర్‌షిప్ ఒక్కసారి రద్దయితే తిరిగి పునరుద్ధరించరు.

స్కాలర్‌షిప్ మొత్తం

విద్యార్థినులకు రెండేళ్ల పాటు నెలకు రూ.500 చొప్పున ఈ స్కాలర్‌షిప్ మొత్తాన్ని అందిస్తారు. ఈ మొత్తం నేరుగా విద్యార్థినుల బ్యాంకు ఖాతాలో జమచేస్తారు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 14.11.2022
- వెబ్‌సైట్: cbse.gov.in

మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్

ప్రతిభ కలిగిన మైనారిటీ విద్యార్థులకు కోసం కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను అందిస్తోంది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అందించే ఈ స్కాలర్‌షిప్‌లకు 2022-23 విద్యాసంవత్సరానికి ప్రకటన వెలువడింది.

అర్హతలు

జైన,బౌద్ధ, సిక్కు, జొరాస్ట్రియన్, ముస్లిం, క్రిస్టియన్ వర్గాలకు చెందిన వారు ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. గత ఏడాది రాసిన అకడమిక్ పరీక్షల్లో కనీసం 50శాతం మార్కులను పొంది ఉండాలి. అకడమిక్ ప్రతిభ, పుట్టిన తేదీ, కుటుంబ ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఇలా: అర్హత, ఆసక్తిగల వారు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్

ఇంటర్ లేదా తత్సమాన విద్యార్హత, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఈ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.2 లక్షలకు మించకూడదు. అడ్మిషన్, ట్యూషన్ ఫీజుల కింద ఇంటర్(10+2) విద్యార్థులకు ఏడాదికి రూ.7000; ఇంటర్ స్థాయిలో ఒకేషనల్/టెక్నికల్ కోర్సులు చదివే విద్యార్థులకు ఏడాదికి రూ.10,000; డిగ్రీ, పీజీ స్థాయి విద్యార్థులకు ఏడాదికి రూ.3000 స్కాలర్‌షిప్‌గా అందిస్తారు. మెయింటెనెన్స్ అలవెన్స్ కింద ఇంటర్ స్థాయి కోర్సులు చదువుతున్న హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.380, డే స్కాలర్ విద్యార్థులకు నెలకు రూ.230; డిగ్రీ, పీజీ చదువుతున్న హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.570, డే స్కాలర్ వారికి రూ.300; పీహెచ్‌డీ, ఎంఫిల్ చేస్తున్న హాస్టల్ అభ్యర్థులకు నెలకు రూ.1200, డే సాల్కర్ విద్యార్థులకు రూ.550 స్కాలర్‌షిప్‌గా చెల్లిస్తారు.

మెరిట్ కం, మీన్స్ స్కాలర్‌షిప్

ప్రభుత్వ గుర్తింపు పొందిన యూనివర్సిటీల్లో ప్రొఫెషనల్/టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఈ స్కీం కింద దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.2,50,000 మించకూడదు.స్కాలర్‌షిప్:అర్హులైన అభ్యర్థులకు కోర్సు ఫీజు కింద ఏడాది రూ.20వేలు, మెయింటెనెన్స్ అలవెన్స్ కిందహాస్టల్ ఖర్చుల కోసం నెలకు రూ.1000, డే స్కాలర్‌కి నెలకు రూ.500 చెల్లిస్తారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఎటువంటి స్కాలర్‌షిప్ లభించదు.

- పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ స్కీమ్‌కు దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబర్ 31,2022
- మెరిట్ కమ్ మీన్స్ బేస్డ్ స్కాలర్‌షిప్ స్కీమ్‌కు చివరి తేదీ: నవంబర్ 15,2022
- వెబ్‌సైట్: https://scholarships.gov.in
- వెబ్‌సైట్: www.minorityaffairs.gov.in

స్కాలర్‌షిప్



హయ్యర్ ఎడ్యుకేషన్

చదువుకు ఊతం.. విద్యారుణం

» ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర అన్ని కోర్సులకూ రుణం
» స్వదేశీ, విదేశీ విద్యకు బ్యాంకుల విద్యా రుణాలు
» కనిష్టంగా రూ.4 లక్షలు గరిష్టంగా రూ.15లక్షల వరకు
» కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సింగిల్ విండో విధానం
» విద్యాలక్ష్మి పోర్టల్ పేరిట ఆన్‌లైన్‌లో దరఖాస్తు సదుపాయం
» మహిళా విద్యార్థులను ప్రోత్సహించేలా ఇంట్రస్ట్ సబ్సిడీ స్కీమ్

భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నా.. సమున్నత అవకాశాలు అందుకోవాలన్నా.. ఉన్నత విద్యతోనే సాధ్యం! అందుకే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నత విద్య కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతారు. అందుకోసం ఎంట్రన్స్ టెస్ట్‌ల్లో ప్రతిభ చూపేందుకు కృషిచేస్తుంటారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపినా.. భారీగా ఉండే ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి. దీంతో ప్రతిభ ఉన్నప్పటికీ.. నిరాశకు గురవుతున్న వైనం! ఇలాంటి విద్యార్థులకు అండగా నిలుస్తోంది..విద్యారుణం!! దేశంలోని పలు బ్యాంకులు ఎడ్యుకేషన్ లోన్స్ అందిస్తున్నాయి. ఇంజనీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్ తదితర ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్న నేపథ్యంలో.. ఎడ్యుకేషన్ లోన్స్, అందుకునేందుకు అర్హతలు, నియమ నిబంధనలపై ప్రత్యేక కథనం..

- బీటెక్..కాసింత పేరున్న కళాశాలల్లో ఏడాదికి రూ. 60 వేల నుంచి రూ.లక్షన్నర కుపైగా ఫీజు ఉంది.
- ఎన్‌ఐటీల్లో సెమిస్టర్‌కు రూ.65 వేల నుంచి రూ.70 వేలు; ఐఐటీల్లో సెమిస్టర్‌కు రూ.లక్ష వరకు ఫీజు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.
- ఐఐఎంలలోనైతే ఎంబీఏ ప్రోగ్రామ్‌కు రూ.20 లక్షలకు పైగానే ఫీజులు.
- సంప్రదాయ డిగ్రీ కోర్సులను చదవాలన్నా.. మూడేళ్లకు రూ.50 వేల వరకు ఫీజు ఉంటుంది.
- మరి విదేశీ విద్య అంటే.. సగటున రూ.50 లక్షల వరకు వ్యయం అవుతుంది.

బ్యాంకుల వెన్నుదన్ను

భారీ ఫీజుల కారణంగా ఎందరో ప్రతిభావంతులైన విద్యార్థులు, అర్హతలు ఉన్నా.. ఉన్నత విద్య అవకాశాలు తలుపు తట్టినా..వాటిని అందుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఇలాంటి విద్యార్థులు తమ కలలను నెరవేర్చుకునేలా.. బ్యాంకులు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. విద్యా రుణాల పేరుతో ఉన్నత విద్యకు ఊతం ఇస్తున్నాయి. విద్యార్థులు తమ కలల కెరీర్‌కు సోపానం వేసే కోర్సుల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నాయి.

గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్స్‌కే

ప్రస్తుతం విద్యా రుణాలను అందిస్తున్న బ్యాంకులు కొన్ని అర్హత నిబంధనలను పేర్కొంటున్నాయి. ముఖ్యంగా ఏఐసీటీఈ, యూజీసీ, విద్యా శాఖ, ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ యూనివర్సిటీస్ గుర్తింపు ఉన్న కళాశాలలు, కోర్సులనే విద్యా రుణ మంజూరులో పరిగణనలోకి తీసుకుంటాయి. అంటే.. సదరు ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకే విద్యా రుణం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి లభిస్తుంది. అంతే కాకుండా ప్రవేశం పొందిన విధానాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

ఎంట్రన్స్‌లో అర్హత

విద్యార్థులు ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత ద్వారా ప్రవేశం పొందితేనే విద్యా రుణం దరఖాస్తుకు అర్హత కల్పిస్తున్నాయి. అంటే.. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ద్వారా కన్వీనర్ కోటాలో సీటు దక్కించుకున్న వారికే విద్యా రుణం పొందే అవకాశం ఉంటుంది. మేనేజ్‌మెంట్ కోటాలో చేరాలనుకునే వారికి ఎడ్యుకేషన్ లోన్‌కు అర్హత ఉండదు. కొన్ని బ్యాంకులు మాత్రమే తమ అంతర్గత విధి విధానాల ప్రకారం మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశం పొందిన వారికి సైతం అవకాశం కల్పిస్తున్నాయి. ఈ బ్యాంకులు అధిక శాతం ప్రైవేట్ సెక్టార్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రం ఎంట్రన్స్‌లో మెరిట్ పొందిన వారికే విద్యా రుణ మంజూరు విషయంలో ప్రాధాన్యం ఇస్తున్నాయి.

రూ.10 లక్షలు, రూ.20 లక్షలు

- ప్రస్తుతం బ్యాంకులు విద్యా రుణాల మంజూరు.. రుణ మొత్తం విషయంలో రెండు రకాల విధానాలు అమలు చేస్తున్నాయి. అవి..
- మన దేశంలోని ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు గరిష్టంగా రూ.పది లక్షలు రుణం మంజూరు చేస్తున్నాయి.
- విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్ లభించిన వారికి గరిష్టంగా రూ.20 లక్షల వరకూ రుణం అందిస్తున్నాయి.

మూడు శ్లాబ్‌లలో రుణాలు

- విద్యా రుణాలను అందించే క్రమంలో బ్యాంకులు మూడు శ్లాబ్‌ల విధానాన్ని అమలు చేస్తున్నాయి.
- శ్లాబ్-1లో రూ.4 లక్షల రుణ మొత్తంగా నిర్ణయించారు. ఈ శ్లాబ్‌లో విద్యార్థులు ఎలాంటి హామీ ఇవ్వక్కర్లేదు.
- శ్లాబ్-2లో రూ.4 లక్షల నుంచి రూ.7.5 లక్షల వరకు రుణ మొత్తాన్ని కేటాయిస్తున్నారు. ఇందుకోసం తల్లిదండ్రుల హామీ, థర్డ్ పార్టీ గ్యారెంటీ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది.
- శ్లాబ్-3లో రూ.7.5 లక్షలకు పైగా రుణ మొత్తం ఉంటోంది. దీనికి దరఖాస్తు చేయాలనుకుంటే.. ఈ మొత్తానికి సరిపడే కొల్లేటరల్ సెక్యూరిటీ(స్థిరాస్తి పత్రాలను) ఇవ్వాల్సి ఉంటుంది.

మార్జిన్ మనీ చెల్లింపు

విద్యార్థులు కొంత మొత్తాన్ని మార్జిన్ మనీగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. రూ.4లక్షల వరకు ఎలాంటి మార్జిన్ మనీ ఉండదు. రూ.4 లక్షలు దాటిన రుణ దరఖాస్తులకు స్వదేశంలో చదివే విద్యార్థులు అయిదు శాతం,విదేశీ విద్య అభ్యర్థులు 15% మార్జిన్ మనీని సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

ఈ వ్యయాలకే రుణం

- ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఎగ్జామినేషన్/ లైబ్రరీ/ లేబొరేటరీ ఫీజు.
- విదేశీ విద్య విద్యార్థులకు ప్రయాణానికి అయ్యే ఖర్చులు.
- పుస్తకాలు, యూనిఫామ్, కంప్యూటర్, ఇతర అకడమిక్ సంబంధిత పరికరాలు కొనుగోలుకు అయ్యే వ్యయం.
- కోర్సు పరంగా అవసరమైన స్టడీ టూర్స్, ప్రాజెక్ట్ వర్క్స్ తదితరాలకు అయ్యే ఖర్చు.
- ఇన్‌స్టిట్యూట్‌లు వసూలు చేసే కాషన్ డిపాజిట్, బిల్డింగ్ ఫండ్,రిఫండబుల్ డిపాజిట్‌లకు రుణం మంజూరు చేస్తారు. ఇవి నిర్దేశిత ట్యూషన్ ఫీజు మొత్తంలో 10 శాతానికి మించకుండా ఉండాలి.
- కంప్యూటర్ కొనుగోలు వ్యయం, స్టడీ టూర్స్, ప్రాజెక్ట్ వర్క్స్ కోసం ఇచ్చే మొత్తం ట్యూషన్ ఫీజులో 20 శాతానికి మించకుండా ఉంటుంది.

తిరిగి చెల్లింపు.. నిబంధనలివే

విద్యా రుణం తిరిగి చెల్లించే విషయంలో బ్యాంకులు కొంత సరళీకృత నిబంధనలు పాటిస్తున్నాయి. రీ పేమంట్ హాలిడే పేరుతో కోర్సు పూర్తయిన తర్వాత సంవత్సరం నుంచి లేదా కోర్సు పూర్తయి ఉద్యోగం లభించినప్పటి నుంచి వాయిదాల విధానంలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఇలా గరిష్ఠంగా 15 ఏళ్ల వ్యవధిలో ఈఎంఐ విధానంలో చెల్లించొచ్చు.

మహిళలను ప్రోత్సహించేలా

- ఉన్నత విద్యనభ్యసించేలా మహిళా విద్యార్థులను ప్రోత్సహించేందుకు బ్యాంకులు విద్యా రుణాలకు సంబంధించి వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నాయి. ముఖ్యంగా వడ్డీ రేట్లలో 0.5 శాతం నుంచి ఒక శాతం వరకు మహిళా విద్యార్థులకు రాయితీ ఇస్తున్నాయి.
- రుణ తిరిగి చెల్లింపు పరంగా స్టార్టప్ ఔత్సాహిక విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాన్ని కల్పిస్తూ గత ఏడాది కొత్త వెసులుబాటు కల్పించారు. స్టార్టప్ ఏర్పాటు వైపు అడుగులు వేసిన విద్యార్థులు.. కోర్సు పూర్తయ్యాక రెండేళ్ల తర్వాత నుంచి రుణం తిరిగి చెల్లించే వీలుంది.

ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్

ఐబీఏ (ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్) మార్గ నిర్దేశకాల ప్రకారం-విద్యార్థులు ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందితే ఆ గరిష్ట రుణ మొత్తాన్ని పెంచే విచక్షణాధికారాన్ని బ్యాంకులకు కల్పించింది. ఉదాహరణకు ఐఐఎంలు, ఐఐటీల వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో రూ పది లక్షల కంటే ఎక్కువ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన వారికి గరిష్ఠ రుణ పరిమితిలో సడలింపు లభిస్తుంది.

అకడమిక్ ప్రతిభపై సమీక్ష

విద్యా రుణం మంజూరు అయిన విద్యార్థికి సంబంధించిన ఫీజులను బ్యాంకులు నేరుగా సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌కే పంపుతాయి. ఒకవేళ తొలి దశలో విద్యార్థులు సొంతంగా ఫీజు చెల్లిస్తే సంబంధిత రశీదులు ఆధారంగా తొలి దశ ఫీజును విద్యార్థికి అందిస్తాయి. ఆ తర్వాత దశ నుంచి ఇన్‌స్టిట్యూట్‌కు పంపుతాయి. అంతేకాకుండా ప్రతి ఏటా రుణ మొత్తాన్ని పంపించే బ్యాంకులు..అంతకుముందు విద్యా సంవత్సరంలో సదరు విద్యార్థి ప్రతిభ గురించి కూడా సమీక్ష చేస్తున్నాయి.

దరఖాస్తుకు అవసరమైన పత్రాలు

- ప్రవేశ ధ్రువీకరణ పత్రం; అకడమిక్ అర్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు; తల్లిదండ్రుల ఆదాయ ధ్రువీకరణ; తల్లిదండ్రుల ఆదాయ స్థితిగతుల వివరాలు, బ్యాంకు అకౌంట్ స్టేట్‌మెంట్స్; నివాస ధ్రువీకరణ; థర్డ్‌పార్టీ ఆదాయ ధ్రువీకరణ
- కోర్సు వ్యయానికి సంబంధించి ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి అధీకృత లెటర్స్
- వివరాలకు వెబ్‌సైట్: www.iba.org.in

విద్యా లక్ష్మి పోర్టల్

విద్యా రుణాల దరఖాస్తుకు కేంద్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తోంది. విద్యార్థులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. విద్యాలక్ష్మి పేరుతో ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ప్రకారం-విద్యార్థులు ఈ పోర్టల్‌లో లాగిన్ అయి.. కామన్ ఎడ్యుకేషనల్ లోన్ అప్లికేషన్ ఫామ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠంగా మూడు బ్యాంకులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇలా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను అభ్యర్థులు ప్రాథమ్యాల ఆధారంగా ఆయా బ్యాంకులకు పంపిస్తారు. తర్వాత దశలో సదరు బ్యాంకులు దరఖాస్తును పరిశీలించి.. సంతృప్తి చెందితే తదుపరి దశలో ఏ బ్రాంచ్‌లో సంప్రదించాలి, ఏ ఏ పత్రాలు తీసుకెళ్లాలి అనే వివరాలను విద్యార్థులకు పంపుతాయి. విద్యాలక్ష్మి పోర్టల్ విద్యార్థులకు, బ్యాంకులకు అనుసంధానకర్తగా ఉంటుంది.

- వెబ్‌సైట్: www.vidyalakshmi.co.in

క్లుప్తంగా

ఎంఎల్‌హెచ్‌పీ నియామక పరీక్షకు 10,790 మంది హాజరు

సాక్షి, అమరావతి: మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టుల భర్తీకి వైద్య శాఖ బుధవారం నిర్వహించిన నియామక పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 42 సెంటర్లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు. 1681 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా 11,992 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 10,790 మంది పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ పరీక్ష నిర్వహించారు. బీఎస్సీ నర్సింగ్ సిలబస్ నుంచి ఎంపిక చేసిన ప్రశ్నలకు మల్టిపుల్ చాయిస్‌లో 200 మార్కులకు పరీక్ష నిర్వహించారు. ఫలితాల ఆధారంగా మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేసి పోస్టుల భర్తీ చేపడతామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ చెప్పారు.

31న నూజివీడులో ఆర్జీయూకేటీ 2వ విడత కౌన్సెలింగ్



నూజివీడు ట్రిపుల్ ఐటీ అకడమిక్ భవనం

సాక్షి, అమరావతి/నూజివీడు/వేంపల్లె: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో మిగిలిన 460 సీట్ల భర్తీకి అక్టోబర్ 31న ఏలూరు జిల్లా నూజివీడులో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆర్జీయూకేటీ చాన్స్‌లర్ కేసీ రెడ్డి, అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య గోపాలరాజు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఇందులో జనరల్ కేటగిరీలో 446, ప్రత్యేక కేటగిరీ (సీఏపీ, పీహెచ్, స్కౌట్స్)లో 14 ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. అభ్యర్థుల జాబితాను వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. అలాగే, అభ్యర్థులకు కాల్ లెటర్లు కూడా పంపినట్లు చెప్పారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటాల మెరిట్ లిస్ట్ ఇంకా రాలేదని, అది రాగానే వాటికి కూడా కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

‘కృష్ణపట్నం’లో మరో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

నేడు మూడవ యూనిట్‌ను ప్రారంభించనున్న సీఎం జగన్



నేలటూరులోని దామోదరం సంజీవయ్య సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రం

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, నెల్లూరు: భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంలో భాగంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డీఎస్‌టీపీఎస్)లో 800 మెగావాట్ల యూనిట్‌ను యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. ప్రభుత్వ రంగంలో దేశంలోనే మొదటిదైన ఈ సూపర్ క్రిటికల్ యూనిట్ రోజుకు 19 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయనుంది. ఈ ప్లాంట్‌ను సీఎం వైఎస్ జగన్ గురువారం ప్రారంభించి, జాతికి అంకితం చేయనున్నారు. సాధారణ థర్మల్ పవర్ ప్లాంట్లతో పోలిస్తే ఈ ప్లాంట్‌లో తక్కువ బొగ్గును వినియోగిస్తారు. దీనివల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం కొంత మేర తగ్గుతుంది. రోజుకు 9,312 టన్నుల బొగ్గుతో నడిచేలా ఈ యూనిట్‌ను రూపొందించారు.

పూర్తి స్థాయిలో సన్నద్ధం

కృష్ణపట్నం ప్లాంట్ మొత్తం సామర్థ్యం నాలుగు యూనిట్లు కాగా, స్టేజ్–1లో ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. మూడవ యూనిట్‌గా స్టేజ్–2లోని 800 మెగావాట్ల ప్లాంట్‌ను రూ.5,082 కోట్ల అంచనా వ్యయంతో మొదలుపెట్టారు. అయితే జీఎస్టీ అమలు, చట్టంలో మార్పు, ఇప్పటికే ఖర్చు చేసిన మొత్తంపై వడ్డీ కారణంగా అంచనా వ్యయంతో పోలిస్తే ప్రాజెక్ట్ వ్యయం కొంత పెరిగింది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.5,935.87 కోట్లు, రాష్ట్ర విద్యుత్ ఆర్థిక సంఘం ద్వారా రూ 1,000 కోట్ల రుణ సాయంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేశారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి రెండవసారి ట్రయల్ రన్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. తాల్చేర్ నుంచి కృష్ణపట్నం పోర్టు ద్వారా బొగ్గు రవాణా జరుగుతుంది. బంగాళాఖాతం నుంచి సముద్రపు నీటిని గ్రహించి, ఆర్వో ప్లాంట్ల ద్వారా మంచినీటిగా మార్చి వినియోగిస్తారు. కాగా, ఈ ప్రాజెక్టుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2008 జూలై 17న శంకుస్థాపన చేయగా, ఇప్పుడు ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్ పూర్తి చేయడం విశేషం. కాగా, నేడు 3వ యూనిట్ ప్రారంభోత్సవం నేపథ్యంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సీఎం టూర్ కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ తలశిల రఘురాం, కలెక్టర్ చక్రధర్‌బాబు తదితరులు బుధవారం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డిమాండ్ కోసం సమాయత్తం

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడానికి, ప్రజలకు మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం 1,600 మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులోకి తెస్తోంది. దీనిలో ఎస్‌డీఎస్‌టీపీఎస్‌లోని 800 మెగావాట్ల యూనిట్ ఒకటి. మరో నాలుగు నెలల్లో నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్)లోని 800 మెగావాట్ల యూనిట్‌లో ఉత్పత్తి మొదలవుతుంది.

– కే విజయానంద్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

29 నుంచి ఈశాన్య రుతుపవనాలు!

- ఈసారి వారానికి పైగా ఆలస్యం
- 30 నుంచి భారీ వర్షాలకు అవకాశం



రుతుపవన వర్షాలు (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: ఈశాన్య రుతుపవనాలు మరి కొద్ది రోజుల్లోనే రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయి. సాధారణంగా ఈశాన్య రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడును అక్టోబర్ 20 లేదా అంతకు రెండు రోజులు అటుఇటుగా తాకుతాయి. కానీ, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ఈ నెల 23 వరకు పూర్తి కాలేదు. ఇంతలో బంగాళాఖాతంలో ఏర్పడిన ‘సిత్రాంగ్’ తుపాను కూడా ఈశాన్య గాలులను నిలువరించడం ద్వారా రుతుపవనాల ఆలస్యానికి కారణమైంది. ఈ నెల 25తో సిత్రాంగ్ తుపాను పూర్తిగా బలహీనపడింది. ఈ నేపథ్యంలో ఈ నెల 29 నుంచి ఆగ్నేయ భారతదేశ ద్వీపకల్పంలో ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమవుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం నాటి నివేదికలో వెల్లడించింది. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల ప్రవేశం సాధారణం కంటే వారానికి పైగా ఆలస్యమవుతోంది. నైరుతి రుతుపవనాలు జూన్ నుంచి సెప్టెంబర్ వరకు దేశమంతటా వర్షాలు కురిపిస్తే ఈశాన్య రుతుపవనాలు మాత్రం దక్షిణ భారతదేశంలోనే ప్రభావం చూపుతాయి. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు మూడు నెలల పాటు ఈ రుతుపవనాలు విస్తారంగా వర్షాలను కురిపిస్తాయి. ఈశాన్య రుతుపవనాల వల్ల కోస్తాంధ్రలో 338.1 మిల్లీమీటర్లు, రాయలసీమలో 223.3 మిల్లీమీటర్ల సాధారణ సగటు వర్షపాతం నమోదవుతుంది.

ఈ సీజనులో తుపాన్లకు ఆస్కారం..

నైరుతి రుతుపవనాల సీజన్‌లో కంటే ఈశాన్య రుతుపవనాల సమయంలోనే బంగాళాఖాతంలో తుపానులు ఎక్కువగా ఏర్పడతాయి. వాటిలో అధికంగా దక్షిణ కోస్తాంధ్ర, తమిళనాడులపైనే ప్రభావం చూపుతాయి. సాధారణంగా ఈశాన్య రుతుపవనాల సీజను (అక్టోబర్–డిసెంబర్‌ల మధ్య)లో కనీసం మూడు తుపానులు ఏర్పడుతుంటాయి. కానీ.. ఈ ఏడాది అంతకు మించి ఏర్పడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

30 నుంచి భారీ వర్షాలకు అవకాశం

మరోవైపు ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి సూచికగా ఈ నెల 29 నుంచి రాష్ట్రంలో వర్షాలు మొదలు కానున్నాయి. 30వ తేదీ నుంచి భారీ వర్షాలకు ఆస్కారం ఉందని ఐఎండీ అంచనా వేస్తోంది. అదే సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. అది తీవ్రరూపం దాలిస్తే రాష్ట్రంలో విస్తారంగా వానలు కురుస్తాయి.

యాజమాన్య కోటా ప్రవేశాలకు దరఖాస్తులు

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో 2022–23 విద్యా సంవత్సరానికి యాజమాన్య కోటా సీట్లలో ప్రవేశాలకు ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. ఈ నెల 31వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. దరఖాస్తు చేసుకునే సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే 7416563063, 7416253073, 9063400829, 9492818477 నంబర్లను విద్యార్థులు సంప్రదించొచ్చు. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో యాజమాన్య కోటా కింద భర్తీ చేసే 85 శాతం బీ కేటగిరి సీట్లలో రాష్ట్ర విద్యార్థులకే అవకాశం కల్పిస్తూ ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే. మిగిలిన 15 శాతం సీట్లలోనే ఇతర రాష్ట్రాల విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. ఈ 15 సీట్లలోనూ మన విద్యార్థులు మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు పొందేందుకు వీలుంటుంది.

రాష్ట్రంలో యాజమాన్య కోటా సీట్లు ఇలా

ఎంబీబీఎస్

- 16 ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఆల్ ఇండియా కోటా కింద కేటాయించిన బీ కేటగిరి సీట్లు – 146
- 16 ప్రైవేట్ వైద్య కళాశాలల్లో రాష్ట్ర విద్యార్థులకే కేటాయించిన బీ కేటగిరి సీట్లు – 809
- ప్రైవేట్ మైనారిటీ కళాశాలలో బీ కేటగిరి సీట్లు – 35
- ప్రైవేట్ నాన్–మైనారిటీ, మైనారిటీ, స్విమ్స్‌లో ఎన్ఆర్ కోటా సీట్లు – 458

బీడీఎస్

- 14 డెంటల్ కళాశాలల్లో ఆల్ ఇండియా కోటాకు కేటాయించిన బీ కేటగిరి సీట్లు – 66
- 14 డెంటల్ కళాశాలల్లో రాష్ట్ర విద్యార్థులకే కేటాయించిన బీ కేటగిరి సీట్లు – 388

ఎల్‌సీడీసీ రాష్ట్ర స్థాయి సదస్సు ప్రారంభం

సాక్షి, అమరావతి: లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) కార్యక్రమం రాష్ట్ర స్థాయి సదస్సును విజయవాడలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్ బుధవారం ప్రారంభించారు. జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ అధికారులకు రెండు రోజుల పాటు ఈ సదస్సులో లెప్రసి వ్యాధి నియంత్రణపై శిక్షణ ఇవ్వనున్నారు. వ్యాధి నియంత్రణపై వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని నివాస్ ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి, ఏడీ డాక్టర్ యాస్మిన్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూకి టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకు



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకు లభించింది. లండన్‌కు చెందిన టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలకు సబ్జెక్టుల వారీగా 2023కి ర్యాంకులు ప్రకటించింది. ఈ ర్యాంకుల్లో ఏఎన్‌యూ ఫిజికల్ సైన్సెస్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, జాతీయ స్థాయిలో 40వ ర్యాంకు, అంతర్జాతీయ స్థాయిలో 1001+ కేటగిరీలో ర్యాంకు సాధించింది. ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు, అంతర్జాతీయ స్థాయిలో 801–1000 కేటగిరీలో ర్యాంకును పొందింది.

శ్రీశైలం, సాగర్ గేట్ల మూసివేత

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: వరద ప్రవాహం తక్కువగా వస్తుండటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల గేట్లను బుధవారం మూసేశారు. బుధవారం సాయంత్రం సమయానికి శ్రీశైలం జలాశయంలోకి జూరాల, సుంకేసుల నుంచి 1,33,746 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కుడి, ఎడమగట్టు కేంద్రాల్లో విద్యుత్ ఉత్పాదన అనంతరం 67,897 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నాలుగువేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 884.60 అడుగుల మట్టంలో 213.4011 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ జలాశయంలో 589.30 అడుగుల మట్టంలో 309.9534 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నేడు విజయవాడలో రాష్ట్ర స్థాయి ఫారెస్ట్రీ సదస్సు

సాక్షి, అమరావతి: అటవీ శాఖ పునర్వ్యవస్థీకరణ తర్వాత తొలిసారి విజయవాడలో రాష్ట్ర స్థాయి ఫారెస్ట్రీ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ నెల 27,28న జరిగే ఈ సదస్సుకు రాష్ట్రంలోని ఉన్నత స్థాయి అటవీ శాఖాధికారులు, డీఎఫ్‌వోలు హాజరవుతున్నారు. అటవీ శాఖలో అమలవుతోన్న కార్యక్రమాలు, భవిష్యత్తు వ్యూహాలు, ప్రణాళికలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. 27న గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉన్న నగర వనాన్ని అటవీ శాఖాధికారులు పరిశీలించనున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.